Published by Telangana
TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 113 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ మంగళవారం 29-4-2025 పేజీలు :12 వెల : 2/-

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన

ఫోన్ నెంబర్ : 9398191920.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని వెంటాడుతాం: కెటిఆర్



హైదరాబాద్: తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. వరంగల్ సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలకు చెప్పిన సందేశం ఇదేనని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. దేశ రాజకీయ చరిత్రలో అతి పెద్ద సభల్లో ఒకటిగా నిలిచిపోతుందని ప్రశంసించారు. వరంగల్ బిఆర్ఎస్ సభ అనేది రజతోత్సవ కార్యక్రమాలకు ప్రారంభం మాత్రమేనని, ఇకపై తానే ముందుండి పోరాడుతానని కెసిఆర్ ప్రకటించారని, భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని బిఆర్ఎస్ శ్రేణులకు కెటిఆర్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇప్పటికే తగిన సమయం ఇచ్చామని, ఇకపై ప్రతి అంశంలో ప్రభుత్వాన్ని వెంటాడుతామని కెటిఆర్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆరాచకాలను మరింతగా ఎండగడతామన్నారు.

## ఆ విషయంలో కెసిఆర్ విలన్‌గా మిగిలిపోతారు : మహేష్ కుమార్



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రజాధనం దోచుకుంది కెసిఆర్ కుటుంబం విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టులు, భూముల పేరిట దోచుకుని రాష్ట్రాలని అప్పుల పాలుజేశారని దుయ్యబట్టారు. సోమవారం టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ మీడియాతో మాట్లాడారు. దూరదృష్టి, ఆలోచన లేకుండా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి కొంపముంచారని, పలాయనం చిత్తగించిన వ్యక్తి కాంగ్రెస్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణకు విలన్‌గా కెసిఆర్ మిగిలిపోతారని, కాంగ్రెస్‌ను విలన్ అంటున్నారని, యువతరం కెసిఆర్‌ను క్షమించదని మండిపడ్డారు.సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబం గురించి ఆరోపణలు చేయడం సరికాదని మహేష్ కుమార్ హితవు పలికారు. దొంగ పాస్‌పోర్టులు సృష్టించి విదేశాలకు పంపిన చరిత్ర కెసిఆర్‌ది కాదా? అని

మిగతా 2లో

- రాష్ట్ర ఖజానా అంతా ఖాళీ చేసి ఇప్పుడు మాపై నిందలా?
- కేసీఆర్ పై రేవంత్ ఆగ్రహం
- ఎల్కతుర్తిలో కేసీఆర్ ప్రసంగంపై తీవ్రంగా స్పందించిన రేవంత్ రెడ్డి
- కేసీఆర్ ప్రసంగం అక్కసుతో ఉందని, స్పష్టత లోపించిందని విమర్శ
- ఖజానా ఖాళీ చేసి నిందలు వేస్తున్నారని కేసీఆర్‌పై ఆరోపణ
- రాహుల్ గాంధీతో తనకు గ్యాప్ లేదని స్పష్టం చేసిన రేవంత్
- మావోయిస్టులతో చర్చలకు శాంతి కమిటీ ఏర్పాటుపై జానారెడ్డితో సీఎం భేటీ

# కేసీఆర్ స్పీచ్‌లో క్లారిటీ లేదు...



హైదరాబాద్ : బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ అభద్రతాభావంలో మాట్లాడారని.. ఆయన స్పీచ్‌లో క్లారిటీ లేదంటూ పేర్కొన్నారు. కేసీఆర్ తన అక్కసు మొత్తం వెళ్లగక్కారని.. రాహుల్‌గాంధీకి, తనకు గ్యాప్ ఉందనడం అవాస్తవమంటూ పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ హీట్ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత జానా రెడ్డితో తెలంగాణ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు.. ఈ సందర్భంగా తెలంగాణ-ఛత్తీస్‌ఘడ్ బోర్డర్ లో నెలకొన్న పరిస్థితులు..

కర్రెగుట్టలో కూంబింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఆపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణపై చర్చ జరిగింది.. నిన్న పీస్ కమిటీ సూచించిన అంశాలపై జానారెడ్డితో చర్చించారు.. 2005లో జరిగిన శాంతి చర్చలపై సీఎం ఆరా తీయగా.. అప్పటి కాంగ్రెస్ నిర్ణయాలను జానారెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. అయితే.. జానా రెడ్డితో భేటీ అనంతరం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. కగార్‌పై పార్టీలో నిర్ణయం తర్వాత ప్రభుత్వ విధానం ప్రకటిస్తామని తెలిపారు. నిన్న తాము నిర్ణయం ప్రకటించాకే కేంద్రానికి లేఖ రాస్తామంటూ కేసీఆర్ ప్రకటించారని రేవంత్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ అభద్రతాభావంలో మాట్లాడారని.. ఆయన స్పీచ్‌లో క్లారిటీ లేదంటూ పేర్కొన్నారు. కేసీఆర్ తన అక్కసు మొత్తం వెళ్లగక్కారని.. రాహుల్‌గాంధీకి, తనకు గ్యాప్ ఉందనడం అవాస్తవమంటూ పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ, తాను రెగ్యులర్‌గా టచ్‌లో ఉన్నామని.. ఆ విషయం బయటకు చెప్పాల్సిన అవసరం లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అవసరాలకు అనుగుణంగా కేసీఆర్, మోదీ

మిగతా 2లో



## అక్కడి కంపెనీల సీఈవోలు తెలుగు వాళ్లే

- సీఎం చంద్రబాబు

- అమరావతి విట్ వర్సిటీలో అభివృద్ధి పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు.
- స్టార్టప్‌ల కోసం 'వి-లాంచ్ ప్యాడ్ 2025'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి.
- గతంలో ఐటీని ప్రోత్సహించా, ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీకి ప్రాధాన్యం: సీఎం.
- మే 2న ప్రధాని మోదీ అమరావతికి రాక, రాజధాని పనులు పునఃప్రారంభం.
- విట్‌లో 95% ప్లేస్‌మెంట్లుబీ ఉద్యోగాలు ఇవ్వాలని విద్యార్థులకు సూచన.

2లో



## మావోయిస్టుల కోసం ఆగని వేట

- మందుపాతరల తొలగింపు అతిపెద్ద సవాల్
- మూడు బేస్ క్యాంపుల ఏర్పాటుకు సన్నహాలు
- మావోయిస్టులకు మద్దతుగా వామపక్షపార్టీల ర్యాలీలు
- సీఎంను కలిసిన శాంతి చర్చల కమిటీ నేతలు
- సామాజిక సమస్యగా పేర్కొన్న సీఎం రేవంత్
- ఆపరేషన్ కగార్ ఆపాలని కేంద్రానికి కేసీఆర్ వినతి
- శాంతిచర్చలపై నోరు మెదపని కేంద్ర ప్రభుత్వం

2లో

## 16 పాక్ యూట్యూబ్ చానెళ్లను నిషేధించిన కేంద్రం




- భారత్‌పై విషం కక్కుతున్న పాక్ యూట్యూబ్ చానెళ్లు
- డాన్, జియో న్యూస్ వంటి ప్రముఖ యూట్యూబ్ వార్తా చానెళ్లపై నిషేధం
- పహల్గామ్ దాడిపై బిబిసి వార్తకు కూడా ఖండన
- ఉగ్ర దాడి బదులు 'తీవ్రవాదుల దాడి' అని పేర్కొన్న బిబిసి

2లో



## గెట్ వే ఆఫ్ అమరావతిగా మచిలీపట్నం పోర్ట్

- మంత్రులు జనార్ధనరెడ్డి, కొల్లు రవీంద్ర

హైదరాబాద్ : మచిలీపట్నం పోర్ట్ నిర్మాణాన్ని వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా పోర్టు నిర్మాణంపై ప్రతి నెలా మారిటైమ్ బోర్డు సమీక్ష చేస్తోందని రహదారులు భవనాల మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ కొల్లు రవీంద్ర తెలిపారు. మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఆర్టీసీ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ ,జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మచిలీపట్నం పోర్ట్ నిర్మాణ పనులను మంత్రులు పరిశీలించారు. మెగా ఇంజినీరింగ్ సంస్థ జనరల్ మేనేజర్ జి. తులసీదాస్ పోర్టు నిర్మాణ పనుల పురోగతిని మంత్రులకు, అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రతినెలా పోర్ట్ ను సందర్శించి పనులు వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకోవాలని మారిటైమ్ బోర్డు చీఫ్ ఇంజినీర్ జీవి రాఘవరావుని మంత్రి జనార్ధనరెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా

మిగతా 2లో

## 26 రఫేల్ యుద్ధ విమానాలకు భారత్, ఫ్రాన్స్ ఒప్పందం



2లో

## తదుపరి పోప్ ఎవరు?



2లో

సత్యమేవ జయతే



# కేసీఆర్ స్పీచ్‌లో క్లారిటీ లేదు...

మాటలు మారుస్తున్నారు.. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ విమర్శలు ఇప్పుడు కాదు.. అసెంబ్లీకి వచ్చి చేయాలన్నారు.

**పొగరు పెరిగింది.. అలాంటి వారికి పదవులు రావు..**

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి మరోసారి అలర్ట్ చేసారు.. కొందరు ఎమ్మెల్యేలకు పొగరు పెరిగింది.. సీఎల్పీలో చెప్పినా తీరు మారలేదని సీఎం పేర్కొన్నారు.. ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో టైమ్‌పాస్ చేయడం సరికాదంటూ పేర్కొన్నారు. పథకాలను ఎమ్మెల్యేలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీలో అంతర్గత విషయాలు, కొందరు నేతల విమర్శలు.. గురించి కూడా రేవంత్ రెడ్డి స్పందించారు.. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి.. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే నష్టపోతారంటూ.. క్లియర్ కట్‌గా చెప్పారు. కొందరు పదవులు రాలేదని నోరుజారుతున్నారని.. వాళ్లకు పదవులు రావు.. అవకాశాలు ఉండవంటూ స్పష్టంచేశారు. పార్టీలో ఓపికతో ఉంటే పదవులు వస్తాయని చెప్పారు. తాను ఇంకా 20 ఏళ్ల రాజకీయాల్లో ఉంటానని పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అనర్థాలకు కేసీఆర్ బాధ్యత వహించాలని, రాష్ట్ర ఖజానాను లూటీ చేసింది కేసీఆరే అని ఆయన మండిపడ్డారు. ఆయన స్పీచ్ అంతా అక్కసుతో నిండి ఉందని విమర్శించారు. తాను సీఎం అయిన రెండో రోజే కేసీఆర్ గుండె పగిలిపోయిందని ఆరోపించారు. గతంలో ఖమ్మంలో రాహుల్ గాంధీ సభకు బస్సులు ఇవ్వకపోవడం మోసపూరిత చర్య అని అంటూ తాము మాత్రం కేసీఆర్ సభకు అవసరమైనన్ని బస్సులు సమకూర్చామన్నారు.

హైదరాబాద్ లోని సీనియర్ కాంగ్రెస్ నేత జానారెడ్డి నివాసానికి నేటి ఉదయం వచ్చిన సందర్భంగా రేవంత్ మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తమ పార్టీపై, పాలనపై చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని, ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అనర్థాలకు కేసీఆరే కారణమని విమర్శించారు. కేసీఆర్ రాష్ట్ర ఖజానా అంతా ఖాళీ చేసి ఇప్పుడు మాపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అభద్రతా భావంలో అక్కసు వెల్లగక్కారని ఫైర్ అయ్యారు. ఆయన స్పీచ్ లో క్లారిటీ లేదన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసుల విషయంలో చట్టం మేరకే చర్యలు తీసుకుంటామన్నారు, కేసీఆర్ లాగా తాను చట్టాన్ని అతిక్రమించనన్నారు. కేటీఆర్ మీద ఉన్న కేసులు కూడా చట్ట ప్రకారమే సాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో తాను చేసిన వ్యాఖ్యలే కేసీఆర్ సభలో పునరావృతం చేశారని విమర్శించారు. కేటీఆర్, హరీష్ రావులను చిన్నపిల్లలుగా పేర్కొన్న వ్యాఖ్యలు కూడా కేసీఆర్ తీరుని ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు.తనకు రాహుల్ గాంధీతో మంచి మైత్రి ఉందని, ఇది ఎవరు నమ్మినా, నమ్మకపోయినా తనకు పరవాలేదన్నారు. రాహుల్ గాంధీకి.. నాకు తెలిస్తే చాలు.. బయట ఎవరేం అనుకుంటున్నారు అనేది నాకు అనవసరమని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేయలేకపోయిన విషయాన్ని గుర్తు చేశారు. కొంత మంది అధికారుల పనితీరు తెలిసినా, అవసరంగా ఉన్న కారణంగా వారి సేవలను కొనసాగించాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ల మార్పు వేరే విషయమని, అవసరమైన మార్పులు చేసుకుంటామని వివరించారు. తనను నమ్ముకున్న వారిని తాను ఎప్పటికీ మర్చిపోనని, నన్ను నమ్మిన వారిలో ఒకరైన దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి వచ్చిందని చెప్పారు. ఓపికగా ఉన్న వారికే తన నుండి బాధ్యతలు వస్తాయని, బయటకి వెళ్లి విమర్శలు చేస్తే తనపై బాధ్యత ఉండదన్నారు.బీఆర్ఎస్ ఎల్కతుర్తిలో నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రసంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ ప్రసంగం పూర్తిగా అక్కసుతో నిండి ఉందని, ఆయన మాటల్లో స్పష్టత కొరవడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు.రాష్ట్ర ఖజానాను కేసీఆర్ పూర్తిగా ఖాళీ చేసి, ఇప్పుడు ఆ నిందను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. రాహుల్ గాంధీతో తనకు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని స్పష్టం చేశారు.అవసరాలకు అనుగుణంగా కేసీఆర్, ప్రధాని నరేంద్ర మోదీ తమ వైఖరిని మార్చుకుంటున్నారని విమర్శించారు. దేశానికి దివంగత ప్రధాని ఇందిరా గాంధీ లాంటి నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డితో సమావేశమయ్యారు. ఈ భేటీ సందర్భంగా పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, రాష్ట్రంలో మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు వీలుగా ఒక శాంతి కమిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై పార్టీలో తదుపరి చర్చల బాధ్యతను జానారెడ్డి, మరో సీనియర్ నేత కె. కేశవరావు చూస్తారని చెప్పారు.ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలని, వారు వెళితేనే పథకాలు ప్రజల్లోకి వెళతాయని అన్నారు. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయని అన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని హెచ్చరించారు.

# అక్కడి కంపెనీల సీఈవోలు తెలుగు వాళ్లే: సీఎం చంద్రబాబు

**అమరావతి:** ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో భారతీయులు, ప్రత్యేకించి తెలుగువారు కీలక స్థానాల్లో రాణిస్తున్నారని, సిలికాన్ వ్యాలీ వంటి టెక్నాలజీ కేంద్రాల్లో అనేక ప్రముఖ కంపెనీలకు సీఈఓలుగా వ్యవహరిస్తూ అగ్రస్థానంలో నిలుస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో నేడు జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు తమ ప్రతిభతో ఉన్నత స్థానాల్లో ఉంటున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా విట్-ఏపీ క్యాంపస్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

అనంతరం, నూతన స్టార్టప్ ఆలోచనలకు ఊతమిచ్చేందుకు ఏర్పాటు చేసిన 'వి-లాంచ్ ప్యాడ్ 2025' ఇంక్యుబేషన్ సెంటర్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. విద్యార్థులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ, విట్-ఏపీలో 95 శాతం మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని, అయితే కేవలం ఉద్యోగాలతో సంతృప్తి చెందకుండా, వినూత్న ఆలోచనలతో నూతన సంస్థలను స్థాపించి, పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐటీ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చానని, కేవలం 14 నెలల్లోనే హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించి చూపించామని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఐటీయే భవిష్యత్తు అని చెప్పానని, ఇప్పుడు కాలం మారిందని, క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి నూతన సాంకేతికతలు కీలకంగా మారాయని అన్నారు. ఇప్పుడు ఈ నూతన టెక్నాలజీలను ప్రోత్సహించడంపై దృష్టి సారించానని స్పష్టం చేశారు. ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో అటెండర్ ఉద్యోగానికి కూడా తీవ్ర పోటీ ఉండేదని, కానీ నేడు ఐటీ రంగంలో ఉద్యోగాలకు యువత అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇది మారిన ప్రాధాన్యతలకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో విట్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.వి. కోటారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారు ఉద్యోగాలు పొందే స్థాయిలోనే ఆగిపోకుండా, ఇతరులకు ఉద్యోగాలు కల్పించే సంస్థల స్థాపకులుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

అమరావతిలోని విట్ యూనివర్సిటీలో జరిగిన 'వి లాంచ్‌పాడ్ 2025 - స్టార్టప్ ఎక్స్ పో' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన మహాత్మాగాంధీ, వి.వి. గిరి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ బ్లాక్‌లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని, అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేంద్రంగా మారనుందని స్పష్టం చేశారు. ఎంతో కీలకమైన రాజధాని నిర్మాణ పనులు మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా పునఃప్రారంభం కానున్నాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెల్లడించారు. విట్ అధినేత జి. విశ్వనాథన్‌తో తనకున్న అనుబంధాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.

సాధారణ వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి, రాజకీయాల్లో (పార్లమెంటు సభ్యునిగా), విద్యా రంగంలో అసాధారణ విజయాలు సాధించారంటూ విశ్వనాథన్‌ను ఆయన అభినందించారు. 2014 ఎన్నికల ఫలితాలు రాకముందే విశ్వనాథన్ తనను కలిసి అమరావతిలో విట్ ఏర్పాటుకు అనుమతి కోరారని, తాను వెంటనే 100 ఎకరాలు కేటాయించానని తెలిపారు.

భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని భూములు ఇచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. రాబోయే ఏడేళ్లలో విట్ అమరావతిలో విద్యార్థుల సంఖ్య 50 వేలకు చేరాలని ఆకాంక్షించారు. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్స్ ఉండటం, ప్రపంచంలోని మేటి 100 విశ్వవిద్యాలయాల్లో విట్‌కు స్థానం దక్కడం గర్వకారణమని చంద్రబాబు కొనియాడారు. విట్ విద్యాసంస్థలన్నింటిలో అమరావతి క్యాంపస్ అగ్రస్థానంలో నిలవాలని తాను కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని, సృజనాత్మక ఆవిష్కరణలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

# మావోయిస్టుల కోసం ఆగని వేట

**హైదరాబాద్ :** కర్రెగుట్టల్లో ఏడో రోజైన సోమవారం భద్రతా దళాల కూంబింగ్ కొనసాగింది. శనివారం సాయంత్రమే అక్కడికి చేరుకున్న భద్రతా దళాలు అణువణువు పరిశీలన చేస్తున్నాయి. పెద్ద సొరంగంతోపాటు వందకు పైగా బంకర్లు ఉన్నట్లు పోలీసు బలగాలు గుర్తించాయి. బంకర్లలో మావోయిస్టులు ఉన్నారేమో అని వేట కొనసాగిస్తూనే.. అడుగడుగున అమర్చిన మందుపాతరలు పేలే ప్రమాదం ఉందని అచీతూచి అడుగులు వేస్తున్నారు. రైస్ కుక్కర్‌లో బాంబులు అమర్చి.. భారీ విస్ఫోటనం కలిగించి, ప్రాణాలుహరించే బాంబులు అమర్చినట్టు భద్రతా దళాలు గుర్తించాయి. ఇప్పటి వరకు వందకు పైగా మైన్స్ నిర్వీర్యం చేశారు. కొన్ని మందుపాతరలు పేలాయి. బంకర్లలో తలదాచుకున్న మావోయిస్టులను బయటకు రప్పించేందుకు హెలికాప్టర్ ద్వారా భద్రతా దళాలు బాంబులు వేస్తున్నాయి. బాంబుల మోతతో కర్రెగుట్టలు దద్దరిల్లుతున్నాయి. కర్రెగుట్టల్లో మూడు బేస్ క్యాంపులు ఏర్పాటు భద్రతా దళాలు సన్నాహాలు చేస్తున్నాయి. పామునూరు ప్రాంతంలో రెండు బేస్ క్యాంపులు, వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఉసూర్ అటవీ ప్రాంతంలో ఒక బేస్ క్యాంప్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడ కొంత కాలం సీఆర్‌పీఎఫ్‌తోపాటు కోబ్రా, డీఆర్‌జీ దళాలు ఉండనున్నట్టు తెలుస్తోంది.మావోయిస్టులపై మారణ హోమం ఆపాలని శాంతి చర్చల కమిటీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే వివిధ ప్రాంతాలను పర్యటించిన శాంతి చర్చల కమిటీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ హరగోపాల్, వివిధ రాజకీయ పార్టీల మద్దతు కూడగడుతున్నారు. శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలని ఖమ్మం, నల్లగొండ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీలో అన్ని వామపక్ష పార్టీలతోపాటు మేథావులు పాల్గొన్నారు. వరంగల్‌లో హరగోపాల్ ప్రెస్‌మీట్ పెట్టి ఆపరేషన్ కగార్ ఆపేయాలని కోరారు. సీఎం క్యాంప్ ఆఫీస్‌లో సీఎం రేవంత్ రెడ్డికి శాంతి చర్చల కమిటీ వినతి పత్రం ఇచ్చింది. మారణహోమం ఆపాలని, శాంతి చర్చలకు కేంద్రం వచ్చేలా ఒత్తిడి తేవాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో శాంతి చర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గాప్రసాద్, జంపన్న, రవి చందర్ ఉన్నారు. కాగా, తమ ప్రభుత్వం సామాజిక కోణంలో ఈ అంశాన్ని చూస్తుందని సీఎం రేవంత్ అన్నారు. గతంలో నక్సల్స్‌తో చర్చలు జరిపిన అనుభవం ఉన్న సీనియర్ నేత జానారెడ్డి, ఇతర మంత్రులతో చర్చించి నిర్ణయాన్ని తీసుకుంటామని తెలిపారు.

**జానారెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, హోంశాఖ మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. ఆపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణ తదితర అంశాలపై చర్చించారు. శాంతి చర్చల కమిటీ ముఖ్యమంత్రిని కలిసిన నేపథ్యంలో సోమవారం ఉదయం జానారెడ్డితో సీఎం భేటీ చర్చనీయాంశమైంది.

**మావోయిస్టులతో చర్చలు జరపాలి : కేసీఆర్**

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం, కేసీఆర్ కోరారు. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఆపరేషన్ కగార్ పేరుతో ప్రాణాలు తీస్తున్నారని.. అది సరైంది కాదన్నారు. బలగాలున్నాయని చంపుకొంటూ పోవడం ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలని, చర్చలకు పిలవాలని కోరారు. కాగా, ప్రజా ఆమోదం మేరకు ఆపరేషన్ కగార్‌ను ఆపాలని తీర్మానం చేసి ఢిల్లీకి పంపుతున్నట్లు కేసీఆర్ తెలిపారు.

**మావోయిస్టుల వినతి.. పట్టించుకోని కేంద్రం**

ఆపరేషన్ కగార్ ఆపేయాలని, శాంతికోసం తాము సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు కేంద్రాన్ని కోరుతున్నారు. కాగా, కర్రెగుట్టలను స్వాధీనం చేసుకోవడానికి భద్రతా దళాలు మరింత దూకుడుగా ముందుకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టు నేత రూపేస్ పేరుతో మరో లేఖ విడుదలైంది. శాంతి చర్చలకు సిద్ధమని, కర్రెగుట్టల్లో ఆపరేషన్ ఆపేయాలని అందులో కోరారు. అయినా ఇవేవీ పట్టించుకోకుండా కేంద్ర మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది.

# 16 పాక్ యూట్యూబ్ చానెళ్లను నిషేధించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** భారత్ గురించి 'తప్పుడు, రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను' ప్రసారం చేస్తున్నాయనే ఆరోపణపై 16 పాకిస్తానీ యూట్యూబ్ చానెళ్లను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని, అదే సమయంలో పహల్గామ్ దాడిపై బిబిసి ప్రసారం చేసిన వార్తకు కూడా కేంద్రం తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేసిందని అధికారులు సోమవారం వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్‌లోని పర్యాటక పట్టణం పహల్గామ్ మైదాన ప్రాంతంలో ఈ నెల 22ప ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఎ) సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నది. ఆ దాడిలో పర్యాటకులతో సహా 26 మంది వ్యక్తులు హతులైన విషయం విదితమే. ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొన్న బిబిసి ప్రసారం చేసే వార్తలను విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) పర్యవేక్షించనున్నదని అధికారులు తెలిపారు.

కేంద్రం నిషేధించిన పాక్ యూట్యూబ్ చానెళ్లు డాన్ న్యూస్, ఇర్షాద్ భట్టి, సమా టివి, ఎఆర్‌వై న్యూస్, బిఒఎల న్యూస్, రఫ్తార్, ది పాకిస్తాన్ రెఫరెన్స్, జియో న్యూస్, సమా స్పోర్ట్, జిఎన్ఎన్, ఉజెయిన్ క్రికెట్, ఉమర్ చీమా ఎక్స్‌క్లూజివ్, ఆస్మా షిరాజి, మునీబ్ ఫారూఖ్, సునో న్యూస్, రజీ నామా. 'జమ్మూ కాశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో భారత్‌పైన, దాని సైన్యం, భద్రతా సంస్థలపైన రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను. అసత్య, తప్పుదోవ పట్టించే కథనాలను ప్రసారం చేస్తున్నందుకు పాకిస్తానీ యూట్యూబ్ చానెళ్లను హోమ్ మంత్రిత్వశాఖ సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం నిషేధించింది' అని అధికారులు వివరించారు.

**బిబిసి భారత్ అధిపతికి విదేశాంగ శాఖ లేఖ**

పహల్గామ్‌లో ఇటీవలి భీకర ఉగ్ర దాడికి సంబంధించి ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ బిబిసి ప్రచురించిన ఒక కథనంపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ దాడిని 'తీవ్రవాదుల దాడి'గా అభివర్ణించడాన్ని కేంద్రం ఆక్షేపిస్తూ, బిబిసి పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తోందని ఆరోపించింది. విదేశాంగ శాఖ ఈ మేరకు బిబిసి భారత్ విభాగం అధిపతి జాకీ మార్టిన్‌కు లేఖ రాసింది. 'కాశ్మీర్‌లో దాడి తరువాత భారతీయులకు వీసాలనే పాకిస్తాన్ రద్దు చేసింది' అనే శీర్షికతో బిబిసి ప్రచురించిన కథనంలో పహల్గామ్ ఘటనను ఉగ్రవాద చర్యగా పేర్కొనడానికి బదులు 'మిలిటెంట్ దాడి' అని ప్రస్తావించడంపై కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది.

ఇది వాస్తవాలను వక్రీకరించడమేనని, బాధితుల పట్ల అగౌరవాన్ని సూచిస్తుందని కేంద్రం తన లేఖలో పేర్కొన్నది. ఉగ్ర దాడి తీవ్రతను తగ్గించి చూపే యత్నం చేశారని ప్రభుత్వం విమర్శించింది. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని బిబిసికి సూచిస్తూ, ఈ నెల 22న పహల్గామ్‌లో జరిగిన దాడికి సంబంధించిన పూర్తి వివరాలను కూడా విదేశాంగ శాఖ తన లేఖతో పాటు పంపింది.

'ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొనడంపై బిబిసికి ఒక లేఖ పంపడమైంది. ఎంఇఎ విదేశీ ప్రచార విభాగం బిబిసి వార్త పంపే తీరును పర్యవేక్షించనున్నది' అని అధికారి ఒకరు తెలియజేశారు. ఆ రోజు పట్టపగలు, రద్దీగా ఉన్న ప్రాంతంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఆ ఘటనను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి కూడా.

# తదుపరి పోప్ ఎవరు?

**- వచ్చే నెల 7 నుంచి కార్డినల్స్ భేటీ**

**వాటికన్ సిటీ:** దివంగత పోప్ ఫ్రాన్సిస్ వారసుడి ఎంపిక ప్రక్రియ వచ్చే నెల 7వ తేదీ నుంచి ఆరంభమవుతుంది. కొత్త పోప్ ఎంపిక విధానంలో కార్డినల్స్ ఓటు కీలకం అవుతుంది ఈ హక్కు ఉన్న పలువురు కార్డినల్స్ ఒక్కరిని మరొకరు పరిచయం చేసుకోవడానికి, వారి పూర్వాపరాలు తెలుసుకోవడానికి కొంత సమయం పడుతుంది. దీనితో ఎన్నిక ప్రక్రియ రెండు రోజులు వాయిదా పడిందని చర్చి అధికార వర్గాలు తెలిపాయి. పూర్తి స్థాయి ఏకాభిప్రాయం సాధనతో తదుపరి పోప్‌ను ఎన్నుకునేందుకు వీలుగా అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. పోప్ అంత్యక్రియల తరువాత జరిగిన ఆంతరంగిక సమావేశంలో పోప్ ఎంపిక తేదిని ఖరారు చేశారు. కాగా పోప్ ఎంపిక వివాదానికి దారితీస్తోందని, కార్డినల్స్ మధ్య సరైన సయోధ్య లేదనే వార్తలతో మీడియా పలు ప్రసారాలను వెలువరించింది. దీనితో మరింత గందరగోళం ఏర్పడింది. శనివారం నాటి ఆంతరంగిక సమావేశం హాల్ వెలుపల పలువురు జర్నలిస్టులు గుమికూడారు. లోపల అసలేం జరుగుతోంది? అంటూ జర్నలిస్టులు మత పెద్దలను ప్రశ్నలతో ఇరుకున పెట్టారు. ఎంపిక ఎప్పుడు జరుగుతుంది? తేదీ ఖరారు అయిందా? ఏం జరుగుతోంది? అంతా కలిసికట్టుగా వ్యవహరిస్తున్నారా? లేక ఇతరత్రా ఏమైనా ఉన్నత స్థాయి లొసుగులు తలెత్తాయా? అనే ప్రశ్నలతో కార్డినల్స్ కంగుతిన్నారు. క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్న ఓ కార్డినల్‌ను కూడా ఓటింగ్‌కు అనుమతిస్తున్నారా? అని ఓ జర్నలిస్టు నిలదీశారు. దీనికి కార్డినల్స్ బృందం నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. తదుపరి పోప్ ఎన్నిక అంతా కూడా కార్డినల్స్‌తో కూడిన ఎలక్టోరల్ కాలేజ్ ఓటింగ్, తరువాతి నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. ఈ క్రమంలో తదుపరి పోప్ ఎంపిక విషయంలో అన్ని వర్గాలూ కార్డినల్స్ స్పందన గురించే ఎదురుచూస్తున్నాయి.

## ఆ విషయంలో కెసిఆర్ విలన్‌గా మిగిలిపోతారు : మహేష్ కుమార్

విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ వల్లే తెలంగాణ వచ్చాక కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, తెలంగాణ సాకారం చేసినందుకు కాంగ్రెస్ విలన్‌గా నిలుస్తుందా? అని ప్రశ్నించారు. తెలంగాణను అన్ని రకాలు కెసిఆర్ నాశనం చేశారని, టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చి పార్టీ పేరులో తెలంగాణ పదమే తొలగించారని మహేష్ కుమార్ దుయ్యబట్టారు.

రెండు పడక గదుల ఇళ్లు ఘరానా మోసం అని ప్రజలకు తెలుసునని, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.4.5 లక్షల మందికి ఇస్తున్నామన్నారు.

## గెట్ వే ఆఫ్ అమరావతిగా మచిలీపట్నం పోర్ట్

మంత్రి బీసీ జనార్ధనరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికీ పోర్ట్ పనులు 35 శాతం పూర్తయ్యాయని చెప్పారు. 2025 అక్టోబర్ కు పోర్ట్ నిర్మాణాన్ని కాంట్రాక్టు సంస్థ పూర్తి చేయాల్సి ఉందన్నారు . కాంట్రాక్ట్ సంస్థ 2026 నవంబర్ వరకు గడువు కోరుతోందని, జూన్ నెలకు 2026 మధ్యంతరానికి పూర్తి చేయాలని సూచించామన్నారు. పోర్టుకు అనుసంధానంగా జాతీయ రహదారులు, రైల్వే లైన్లను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతికి మచిలీపట్నం పోర్ట్ గేట్ వే ఆఫ్ అమరావతిగా నిలుస్తుందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ టీడీపీ పోరాట ఫలితంగానే మచిలీపట్నం పోర్ట్ నిర్మాణం జరుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోర్టు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని అన్నారు. పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు . పోర్టు తో పాటు అనుబంధ పరిశ్రమల నిర్మాణానికి భూములు అందుబాటులో ఉన్నాయని అన్నారు. పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం మంత్రులు అధికారులు, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు పరిశీలించారు.

## 26 రఫేల్ యుద్ధ విమానాలకు భారత్, ఫ్రాన్స్ ఒప్పందం

**- భారత్, ఫ్రాన్స్ మధ్య రూ. 63 వేల కోట్లు విలువ చేసే రక్షణ ఒప్పందం**

**- భారత నౌకాదళం కోసం 26 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు**

**- స్వదేశీ విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి కార్యకలాపాలు**

**- 37 నుంచి 65 నెలల్లో విమానాల డెలివరీ పూర్తి**

**న్యూఢిల్లీ :** భారత నౌకాదళ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ మెరైన్ యుద్ధ విమానాలు కొనుగోలు చేసేందుకు రెండు దేశాల మధ్య సోమవారం మెగా ఒప్పందం కుదిరింది. రూ. 63 వేల కోట్లు విలువ చేసే ఈ ఒప్పందంపై రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, ఫ్రాన్స్ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో నేవీ వైస్ చీఫ్ అడ్మిరల్ కె స్వామినాథన్ కూడా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వం మధ్య (జి2జి) కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, భారత నౌకాదళానికి 22 సింగిల్ సీట్ రఫేల్‌ఎం జెట్లు, నాలుగు ట్విన్ సీట్ శిక్షణ విమానాలు అందనున్నాయి. ఈ యుద్ధ విమానాలు ప్రధానంగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నుంచి తమ కార్యకలాపాలు నిర్వహిస్తాయి.కొన్ని రోజుల క్రితమే ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని భద్రత వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఎస్) ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపింది. ఒప్పందంలో భాగంగా విమానాలతో పాటు కొన్ని రకాల ఆయుధాలు, సిమ్యులేటర్లు, సిబ్బందికి శిక్షణ, ఐదు సంవత్సరాల పాటు పనితీరు ఆధారిత లాజిస్టిక్స్ సహకారాన్ని కూడా ఫ్రాన్స్ అందజేయనున్నది. ఒప్పందం విలువలో ప్రాథమికంగా 15 శాతం మొత్తాన్ని భారత్ చెల్లించనున్నది. మొత్తం 26 విమానాల డెలివరీ ప్రక్రియ 37 నెలల నుంచి 65 నెలల మధ్య పూర్తి అవుతుందని, 2031 నాటికి అన్ని జెట్లు నౌకాదళానికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలియజేశారు. సముద్ర లక్ష్యాలపై దాడులు, వాయు రక్షణబీ నిఘా వంటి బహుళ ప్రయోజనకరమైన ఈ 4.5వ తరం రఫేల్ యుద్ధ విమానాలు అణ్వాయుధాలను ప్రయోగించగల సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాయి. ఈ జెట్లలో 70 కిమీ పరిధి గల ఎక్సోసెట్ ఎఎం 39 యాంటీషిప్ క్షిపణులు, 300 కిమీ పైగా దూరంలోని లక్షాలను ఛేదించగల స్కాల్ప్ గగనతలం నుంచి భూమి పైకి ప్రయోగించే క్రూజ్ క్షిపణులు, 120150 కిమీ పరిధిలో శత్రు విమానాలను ఎదుర్కొనగల అత్యాధునిక మెటియోర్ ఎయిర్ టు ఎయిర్ క్షిపణులు కూడా అమర్చనున్నారు. 2022లో నౌకాదళం నిర్వహించిన విస్తృత స్థాయి పరీక్షల్లో అమెరికాకు చెందిన ఎఫ్/ఎ18 సూపర్ హార్నెట్ కన్నా ఫ్రెంచ్ రఫేల్‌ఎమ్ మెరుగైన ప్రదర్శన కనబరచింది. ఇప్పటికే భారత వైమానిక దళం (ఐఎఎఫ్) 36 రఫేల్ జెట్లను వినియోగిస్తుండడంతో లాజిస్టిక్స్, విడిభాగాలు, నిర్వహణలో సౌలభ్యం కూడా రఫేల్‌ఎమ్ ఎంపికకు కలసివచ్చింది.

ప్రస్తుతం నౌకాదళం వద్ద రష్యా నుంచి 2009 తరువాత కొనుగోలు చేసిన 45 మిగ్29కె యుద్ధ విమానాల్లో సుమారు 40 మాత్రమే ఉన్నాయి. అవి ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్ విమానవాహక నౌకల నుంచి పని చేస్తున్నాయి. అయితే, మిగ్29కె విమానాలు తరచు నిర్వహణ సమస్యలు, సేవల లభ్యత లోపాలతో ఇబ్బంది పడుతున్నాయి. మరొక వైపు స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్న ట్విన్ ఇంజన్ డెక్ బేస్డ్ ఫైటర్ (టిఇడిబిఎఫ్) పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి మరొక దశాబ్దం పట్టే అవకాశం ఉండడంతో, మధ్యంతర చర్యగా ఈ రఫేల్‌ఎమ్ జెట్లు కొనుగోలు చేయాలని నౌకాదళం నిర్ణయించింది. ఈ కొత్త విమానాల చేరికతో హిందు మహాసముద్రంలో భారత నౌకాదళ పటిష్ఠత మరింత పెరగనున్నది.

## ప్రధాని మోడీపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శనాస్త్రాలు

**- పహల్గామ్ దాడిపై అఖిల పక్ష భేటీకి మోడీ గైర్‌హాజరుకు ఆక్షేపణ**

**- దేశ గౌరవానికి హాని సమయంలో బీహార్‌లో మోడీ ఎన్నికల ప్రసంగం**

**- ఆయన తమ నుంచి ఏ సహాయం కోరుతున్నారు?**



**జైపూర్ :** 26 మంది ప్రజలను బలిగొన్న పహల్గామ్ ఉగ్ర దాడిపై చర్చించేందుకు ఏర్పాటైన అఖిల పక్ష సమావేశానికి హాజరు కానందుకు ప్రధాని నరేంద్ర మోడీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం తూర్పారపట్టారు. జైపూర్‌లో 'సంవిధాన్ బచావో' ర్యాలీలో ఖర్గే ప్రసంగిస్తూ, 'దేశ గౌరవానికి హాని కలిగినప్పుడు మీరు (ప్రధాని మోడీ) బీహార్‌లో ఎన్నికల ఉపన్యాసం ఇస్తుండడం దేశం దురదృష్టం' అని అన్నారు. 'అన్ని పార్టీల నేతలు అఖిల పక్ష సమావేశానికి హాజరయ్యారు. కానీ ప్రధాని మోడీ ఆ సమావేశానికి రాకపోవడం శోచనీయం. బీహార్‌ఏమైనా దూరంగా ఉన్నదా? ప్రధాని అఖిల పక్ష సమావేశానికి వచ్చి, ప్రభుత్వ ప్రణాళికను వివరించి ఉండవలసింది. ఆయనకు మా నుంచి కావలసిన సహాయం ఏమిటి?' అని ఖర్గే పేర్కొన్నారు. ప్రధానిపై మరింతగా ఖర్గే విరుచుకుపడుతూ, 'మోడీ ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత ఇచ్చారు. అటువంటి వ్యక్తులు దేశాన్ని బలహీనపరుస్తారు. 56 అంగుళాల ఛాతీ కుంచించుకుపోయింది' అని విమర్శించారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో ఉత్తర ప్రదేశ్‌ను గుజరాత్‌గా మార్చడానికి 56 అంగుళాల ఛాతీ కావాలని అన్న సంగతి విదితమే. దేశమే సర్వోన్నతం కనుక ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నా తాము మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించినట్లు ఖర్గే తెలియజేశారు. 'దేశం సర్వోన్నతం, ఆ తరువాతే పార్టీలు, మతం వస్తాయి. దేశం కోసం అంతా సమైక్యం కావాలి' అని ఆయన పేర్కొన్నారు, కాంగ్రెస్ సమైక్యత గురించి మాట్లాడుతుంటే బిజెపి దానిని విడదీయడం గురించి మాట్లాడుతుంటుందని ఆయన ఆరోపించారు. 'ఈ దేశంలో రాజ్యాంగం సుప్రీం. మన ప్రజాస్వామ్యం రాజ్యాంగం కింద నడుస్తుంటుంది' అని ఆయన చెప్పారు. కాంగ్రెస్ నాయకులపై దాడులపైన, దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపైన ప్రభుత్వాన్ని ఖర్గే తీవ్రంగా విమర్శిస్తూ, 'కాంగ్రెస్ వృద్ధి చెందుతున్నప్పుడల్లా ఈ వ్యక్తులు దానిని అణచివేయజూస్తుంటారు. మేము అణచివేతకు గురయ్యేవారం కాము' అని అన్నారు. బిజెపి నేతలు ప్రతి ఒక్కరినీ బలహీనపరచజూస్తున్నారని, కానీ ప్రజలపై 'తప్పుడు' కేసులు బనాయించడం ద్వారా వారుప్రజాస్వామ్యాన్ని బలహీనపరచజాలరని ఖర్గే అన్నారు.

# కెసిఆర్ ప్రసంగంలో పస లేదు ::సీఎం రేవంత్ రెడ్డి!



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా..
బీఆర్ఎస్ రజతోత్సవ సభలో భాగంగా కేసీఆర్ ఇచ్చిన ప్రసంగంపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ స్పీచ్‌లో అసలు పసలేదని, తమ ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల వల్ల ఉన్న కడుపుమంటే కనిపిస్తోందం టూ మండిపడ్డారు.
అంతేకాకుండా కర్రెగుట్ట ఆపరేషన్ ఆపాలని, శాంతి చర్చలకు తాము సిద్ధ మంటూ మావోలు పంపిన లేఖపై కూడా స్పందించారు. ఈ శాంతి చర్చల విషయం పై పార్టీ హైకమాండ్‌కు సమాచారం ఇస్తామని, ఆ తర్వాత ఈ విషయంలో ఎలాంటి స్టాండ్ తీసుకో వాలో డిసైడ్ అవుతామని చెప్పారు.
శాంతి చర్చల అంశం పై పార్టీ హైకమాండ్ కి కూడా సమాచారం ఇస్తాం. పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉండాలి. అధిష్టానం కి పీస్ కమిటీ రిక్వెస్ట్ నీ పంపిస్తాం. ఆ వ్యవహారం అంతా జానారెడ్డి.. కేకే చూస్తారు. కేసీఆర్ కి నేను సీఎం అయిన రెండో రోజే గుండె పగిలింది. ఇప్పుడు రాష్ట్రం లో జరుగుతున్న అనర్థాల కు కేసీఆర్ కారణం. ఖజానా అంతా లూటీ చేసింది ఆయన కాదా..? కేసీఆర్ స్పీచ్ అంత అక్కసు తో మాట్లాడినట్టు ఉందన్నారు.
కేసీఆర్ సభకు ఎన్ని అంటే అన్ని బస్సులు ఇచ్చాం. ఆర్టీసీకి ఆదాయం కూడా వచ్చింది. బస్సులు ఆపితే సభ ఆగిపోతుంది అని అనుకునేంత ఆలోచన వాళ్ళది" అని అన్నారు.
ఖమ్మంలో రాహుల్ గాంధీ సభ కు వాళ్ళు కనీసం బస్సులు కూడా ఇవ్వలేదు. నిన్న కేసీఆర్ తన అక్కసు మొత్తం కక్కాడు. కేటీఆర్, హరీష్ లను పిల్లగాల్లు అని కేసీఆర్ అన్నాడు ...
మరి ఆ పిల్లగాళ్ళను అసెంబ్లీ కి ఎందుకు పంపిస్తున్నాడు. కేసీఆర్ స్పీచ్ లో పస లేదు సంవత్సరన్నరగా పథకాలు తీసుకొచ్చాం...ఇప్పుడు వాటన్నిటిని స్ట్రీమ్ లైన్ చేస్తున్నాం. ప్రపంచంలో ఇంధిరా గాంధీ కి మించిన యోధురాలు లేదు. ఒక దేశాన్ని ఓడించిన చరిత్ర ఇందిరా గాంధీదే..
కేసీఆర్, మోడీ, వారి అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతారు. నాకు ,రాహుల్ గాంధీ మధ్య మంచి రిలేషన్ ఉంది... ఇది ఎవరూ నమ్మాల్సిన అవసరం లేదు" అని తెలిపారు.
కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన స్కీం లు ఏ రాష్ట్రంలో అమలు లో లేవు.. చివరి 6 నెలలు వీటి పై చర్చ జరుగుతుంది. కగార్ అంశం పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి. కగార్ పై మా పార్టీ నిర్ణయం తీసుకున్నాక.. ప్రభుత్వ విధానం ప్రకటిస్తాం.
పదేళ్లు మాక్కూడా అవకాశం ఇస్తారు ప్రజలు. పదేళ్లలో ఆయన చేసిన విధ్వంసం సెట్ చేయడానికే ఏడాది సరిపోయింది. కేటీఆర్..హరీష్ లు చిన్న పిల్లలు అసెంబ్లీకి వస్తు న్నారు అని నేను ముందే చెప్పాను.కేసీఆర్ కూడా నిన్న రజతోత్సవ సభలో అదే చెప్పారు..

# పెద్దేముల్ ప్రభుత్వ హాస్పిటల్ హాస్టల్ ను తనిఖీ చేసిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్....





.సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా... వికారాబాద్ జిల్లా పెద్దేముల్ లో మండలం ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ హాస్టల్ ను కలెక్టర్ తనిఖీ చేశారుప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ వైద్య అధికారులకు సూచించారు.
సోమవారం పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ల తో కలసి జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా
ఆస్పత్రిలోని ఇన్ పేషెంట్, లాబరేటరీ, మందుల నిల్వ గదితో పాటు ఔట్ పేషెంట్, ఏఎంసీ తదితర రిజిస్టర్ ల ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భవన పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ మరమ్మతులు పనులను త్వరితగతిన చేపట్టాలని అదేవిధంగా ఆసుపత్రి, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో అవసరాలకు అనుగుణంగా లైట్లు, ఫ్యాన్లు సమకూర్చాలని కలెక్టర్ తెలిపారు.
ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ పరీక్షలు, గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలు, ప్రసవాల వివరాలపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఏవైనా మందుల లోటు ఉంటే తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే అవసరమైన మందులను సరఫరా చేయిస్తానని కలెక్టర్ తెలిపారు.
అనంతరం పెద్దేముల్ బి సి బాలుర వసతి గృహాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.
కలెక్టర్ గారి ఆకస్మిక పర్యటనలో తహసిల్దార్ వెంకటేష్, డిప్యుటీ తహసీల్దార్ శ్రీనివాస్, డాక్టర్ శ్వేత,, ఎంపిడిఓ ల తో పాటు ఇతర వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు..

## 4 కార్మిక వ్యతిరేక లేబర్ కొడ్లను రద్దు చెయ్యాలి లేబర్ చట్టాలను అమలు చెయ్యాలి....



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా..... తెలంగాణ అంగన్ వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ డిమాండ్. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం భారతీ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక కర్షక ఉద్యోగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చెయ్యకుండా హక్కులను కళారస్తున్నారు హక్కులు అడిగితే దేశ ద్రోహులు అంటున్నారు. ప్రశ్నించే గొంతుకలు నొక్కుతూ ప్రజా స్వామ్య నీ అణచి వేస్తున్నారు. గుజరాత్ హైకోర్టు తీర్పును గౌరవిస్తూ అంగన్వాడి టీచర్లు 36వేలు, హెల్పర్సు కు 26వేలు చొప్పున జీతాలు ఇవ్వాలి.
సౌకర్యం కల్పించాలి. పౌష్టికాహారం నాణ్యత పరిమితి పెంచాలి.మౌలిక వసతులు కల్పించాలి. అన్ని ప్రభుత్వ రంగా సంస్థల ప్రవేటీకరణ ఆపాలి.రైతు వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కారం చెయ్యాలి. నిత్యావసరాల సరుకుల పెరుగుదలను నియంత్రించాలి. ఆన్లైన్ పనిభారం తగ్గించాలి. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చెయ్యాలి. మే 20న తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చెయ్యండి. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా నాయకురాలు నర్సమ్మ భారతీ లక్ష్మి అందాలు సంతోష నిర్మల సీఐటీయూ యూనియన్ నాయకులు మహిపాల్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# బిజెపి నూతన పట్టణ కమిటీ ఏర్పాటు





సత్యమేవ జయతే న్యూస్/ నర్సాపూర్ నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు నిరుడి చంద్రయ్య గారి ఆధ్వర్యంలో పట్టణ కమిటీని వేయడం జరిగింది కమిటీ లో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శిగా రామిరెడ్డి గారు, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులుగా ఓంకార్ గుప్తా గారు, బిజెపి పట్టణ కార్యదర్శిగా చిరుమన్ నరేందర్ గారు, బిజెపి సభ్యులుగా చిప్ప రాజు గారు, బేకరీ మల్లేశం గారు, గుమ్మడిదల శ్రీకాంత్ గారు, బిజెపి పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా బబ్బురి కృష్ణ గారు, బిజెపి పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా పాపగారి నాగేష్ గౌడ్ గారిని నియమించడం జరిగింది..... ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్ గారు, బిజెపి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ కౌన్సిలర్ గోద రాజేందర్ గారు ,అసెంబ్లీ కన్వీనర్ రమణారావు ముదిరాజ్ గారు, మాజీ కౌన్సిలర్ ఎరుకల యాదగిరి గారు, బిజెపి నాయకులు షేక్ నర్సింగ్ రావు గారు, లక్ష్మణ్ యాదవ్ గారు పాల్గొనడం జరిగింది...

## వచ్చేనెల 7.న ఎన్నెపల్లి లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ..పోస్టర్ ఆవిష్కరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్...



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా... వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నే పల్లి లో ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ గోడ ప్రతిని విడుదల చేసిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వికారాబాద్ లోని ఎం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం లో దళిత సంఘాల నేతలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్ విడుదల చేసిన ప్రసాద్ కుమార్ , మహేందర్ రెడ్డి రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క తదితరులు ముఖ్య అతిథిగా పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన దళిత సంఘాల నేతలు. పాల్గొన్నారు...

## భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం -స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి...





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.. పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో "భూ భారతి చట్టం పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి గార్లతో కలిసి పాల్గొని, ప్రసంగించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడు తూ భూ భారతి సమస్య లు పరిష్కారం అవుతాయి అన్ని అన్నారు
అనంతరం 24 మంది లబ్ధిదారులకు రూ. 24,02,784/- విలువగల కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేసిన స్పీకర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గారు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత గారు, తాండూరు సబ్ కలెక్టర్, రెవిన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు ఉన్నారు..

## అంబేద్కర్ గొప్ప మేధావి. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో "అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ" కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడు తూ అంబేద్కర్ గొప్ప మేధావి అన్ని ఆయన అభిప్రాయపడారు మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి. తో కలిసి ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఈ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, కవులు, రచయితలు, కళాకారులు, అంబేద్కర్ సంఘం నాయకులు, కందనెల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

# దేశంలో తీవ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలి









**తీవ్రవాదుల దాడి హేయమైన చర్య**

**భూ భారతి దేశానికే రోల్ మోడల్**

**రైతులు, ప్రజలు భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి చట్టం**

**భూ సమస్యలు లేని రాష్ట్రం గా తీర్చి దిద్దటమే లక్ష్యం**

సత్యమేవ జయతే/హత్నూర: తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు.
సోమవారం హత్నూర మండలంలోని మంగపూర్ రామ శివార్లో గల ప్రైవేటు ఫంక్షనల్లో భూభారతి అవగాహన సదస్సుకు , అటవీ,దేవాదాయ ధర్మాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మెదక్ ఎంపీ రఘు నందన్ రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీ ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు లతో కలసి పాల్గొన్నారు.దేశంలో తీవ్రవాదుల దాడికి నిరసనగా రెండు నిముషాల సమయం మౌనం పాటించారు.జ్యోతి ప్రజ్వలన చేసి భూ భారతి చట్టం అవగాహన సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా భూభారతి- నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... దేశంలో తీవ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకిలించలన్నారు. తీవ్ర వాదుల దాడి హేయమైన చర్యగా,అభివర్ణించారు.దేశంలో తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వనికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఎంపీ రఘు నందన్ రావుకు తెలిపారు.అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్ధకత ఏర్పడుతుందని అన్నారు.రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో గ్రామ పరిపాలన అధికారులను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు.భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అన్నారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అన్నారు. భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు – భూ భారతి చట్టం అని ఈ చట్టం లో హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చెయ్యడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ ,పెండింగ్ సాదాబైనామా ధరఖాస్తుల పరిష్కారం అవకాశం ఉందన్నారు.వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయాలని, భూమి హక్కులు మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదుకు, పాసు పుస్తకాలలో భూమి పటం ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు.భూ సమస్యల పరిష్కారనికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, వ్యక్తికి ఆధార్ భూమికి భూధార్ కార్డుల జారీ చేస్తున్నట్లు చట్టంలో ఉందని తెలిపారు. ఇంటి స్థలాలకు, ఆబాది,వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం ,గ్రామ రెవిన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైన ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారన్నీ కూడా పొందుపరిచారని,రికార్డులో తప్పుల సవరణకు ,హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు కూడా అవకాశం ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఎంపీ రఘు నందన్ రావు మాట్లాడుతూ భూ భారతి చట్టం లో రైతులకు చట్టాలపై అవగాహన కల్పించి, భూ సమస్యలు లేకుండా చూడాలన్నారు.దేశంలో 5 కోట్ల కేసులు పెండింగ్ లో ఉన్నాయని వాటిలో 3 కోట్ల వరకు భూ సంబంధిత కేసులే ఉన్నాయన్నారు.భూ రికార్డులు డిజిటల్ గా మార్చాలని ,భూ భూధార్ లాంటివి గతంలో కేంద్ర ప్రభుత్వ%శీ% నిర్ణయించిన కూడా అప్పటి ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు.గ్రామాల్లో ఉన్న గ్రామ కంఠం,అభది భూముల సర్వే జరగాలన్నారు.టి జి ఐ ఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం ఎంతో అనుభవజ్ఞులతో తయారు చేశారని, ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని, గతంలో పేద రైతులను న్యాయస్థానాల చుట్టూ తింపారని అని అన్నారు.ప్రజా పాలన అనంతరం రైతు సంక్షేమ కార్యక్రమాలు అనేకం జరిగాయన్నారు. రుణమాఫీ ,ఉచిత విద్యుత్ ,ఫ్రీ బస్ , 500 కే గ్యాస్ సిలిండర్, సన్నాళ్లకు బోనస్ ఇలాంటివి అమలు చేశారన్నారు. యువతకు అనేక ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలియజేశారు.జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూలి రైతులు, ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూభారతి, దానిలోని అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని కలెక్టర్ అన్నారు.ఇంతకు ముందు ఉన్న ధరణిలో కోల్పోయిన హక్కులు, కొత్త చట్టంలో ఎలాంటి హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి ప్రజలకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి,అదనపు కలెక్టర్ మాధురి,ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి , తాసిల్దార్ పర్వీన్ షేక్, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

## ఘనంగా పోచమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం







సత్యమేవ జయతే/హత్నూర:ంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల 12 అవార్డులో పోచమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మాణిక్ పంతులు ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకం అనంతరం పుణ్య దంపతులచే హోమం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికో సందర్భంగా పోచమ్మ ఆలయాన్ని విద్యుద్దీపనతో అలంకరణ చేసి ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాగులగడ్డ శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్,ఆశిరెడ్డి, కిష్టారెడ్డి, బక్క రవి నాయికోటి ప్రభాకర్, లక్ష్మికాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి ,(సన్నీ) పార్థివ రెడ్డి మల్లయ్య, నరసింహారెడ్డి, కొండ గౌడ్, రాజ మల్లయ్య, భుజంగ రెడ్డి, అనంతరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీని అరికట్టాలని ధర్నా



సత్యమేవ జయతే - దస్తూరాబాద్
దస్తూరాబాద్ : దస్తురాబాద్ మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా నిర్వహించింది . సోమవారం సంఘం నాయకులు మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. రైస్ మిల్లు యజమానులు ఒక్కో సంచికి మూడు కిలోలు తమకు ఇవ్వాలని డిమాండ్ చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రైస్ మిల్లర్స్ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధాన్యం తూకం వేసిన తరువాత రైతులందరికీ రసీదులు ఇవ్వాలని, , కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టే విధంగా రైతులు పోరాడాలని పిలుపునిచ్చారు.కలెక్టర్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు నష్టపోకుండా చూడాలని, రైతులను దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్స్ పై కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జాజి మొగ్గ లింబాద్రి, బరిగెల గంగాధర్ , చించోలి రాములు, నన్నకుమార్ , జాజిమొగ్గ ఆశన్న తదితర రైతులు పాల్గొన్నారు.

### ఆదివాసీల హననాన్ని ఆపాలి..

### ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలంటూ ధర్నా

సత్యమేవ జయతే - పెద్దపల్లి పెద్దపల్లి : చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఆదివాసీల హననాన్ని నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్‌ను ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఇవాళ పెద్దపెల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సందర్భంగా ఐఎఫ్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ మాట్లాడుతూ.. చత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని కర్రెగుట్టలో మావోయిస్టులు దాక్కున్నారని కేంద్ర ప్రభుత్వం 10000 పోలీసు బలగాలతో కూంబింగ్ ఆపరేషన్ చేయడం, అక్కడ నివసిస్తున్న ఆదివాసీలను అంతమొందించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్టల్లో కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా జరుగుతున్న దాడులను ఆపాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.కర్రెగుట్ట ప్రాంతంలో మోహరించి ఉన్న కేంద్ర పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలని కోరారు. అరెస్టు చేసిన ఆదివాసులను విడుదల చేయాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఐఎఫ్‌టీయూ నాయకులు ఈదునూరి నరేష్, అశోక్, రాజేశం, చిలుక, శంకర్, బాలకృష్ణ, లింగమూర్తి, ప్రసాద్, వసంత్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇయ్యాల ఇంకా తలుపుతీయలే..





**కరీంనగర్ కలెక్టరేట్ వద్ద అర్జీదారుల ఆవేదన**

సత్యమేవ జయతే - కరీంనగర్
కరీంనగర్ : కొత్త రెవెన్యూ చట్టంపై అవగాహన కల్పించే క్రమంలో కరీంనగర్జి ల్లాలోని పలు మండలాల్లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల నేపథ్యంలో ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన కూడా విడుదల చేశారు.
అయ్యా%ౌ% అధికారులేరి ? పదకొండు దాటినా ఇయ్యాల ఇంకా తలుపుతీయలే. ఒక్క సారు కూడా ఇటుదిక్కు వత్తలేడు. నడి ఎండల గింత దూరమచ్చిన, కాయితమియ్యకుంట ఎట్ల పోవాలే. మల్లెప్పుడు రావాలే అంటూ ఓ వృద్ధురాలు కలెక్టరేట్‌లోకి వచ్చే వారిని పోయే వారిని దీనంగా అడుగుతుండగా.. ఇందిరమ్మ ఇల్లు పథకం అధికారి ప్రజావాణిల కలుస్తడు అంటే వచ్చిన. అదెక్కడ జరుగుతుంది. అంటూ తన కుమారుడితో కలిసి వచ్చిన మరో మహిళ కలెక్టరేట్ ఎదుట ఆరా తీస్తున్నది. ఇలా వీరిద్దరే కాదు.. సోమవారం ఉదయం పదిన్నర నుంచి పదకొండున్నర మధ్య వంద మందికిపైగా వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో తమ గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చారు. అధికారులెవరూ కానరాక, తమవెంట తెచ్చుకున్న అర్జీలు ఎవరికి అప్పగించాలంటూ కనిపించిన ప్రతివారిని అడుగుతూ, అధికారుల వద్దకు తీసుకెళ్లండంటూ వేడుకుంటుండగా, తమకు తెలియదంటూ దాటవేయడం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట కనిపించిన దృశ్యాలు.
అయితే, కొత్త రెవెన్యూ చట్టంపై అవగాహన కల్పించే క్రమంలో జిల్లాలోని పలు మండలాల్లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల నేపథ్యంలో ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన కూడా విడుదల చేశారు. నిత్యం దినపత్రికలు చదివే అలవాటు జిల్లా వాసులకు తక్కువ శాతమే ఉండగా, ఈ నెల 21వ కూడా ప్రజావాణి రద్దు కాగా, ఈసారి ఖచ్చితంగా ఉంటుందని కలెక్టరేటుకు వచ్చినట్లు అర్జీదారులు పేర్కొంటున్నారు. ఇతర జిల్లాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమం యధావిధిగానే కొనసాగుతుండగా, మన జిల్లాలో కూడా అలాగే జరుగుతుందనే భావనతో కూడా వచ్చినట్లు మరికొంతమంది చెబుతున్నారు.
సమయానికి ప్రజావాణి జరగటం లేదు..
సుదూర ప్రాంతాల నుంచి వందల రూపాయలు ఖర్చు చేస్తూ, తమ సమస్యలు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వస్తే తీరా సమయానికి ప్రజావాణి జరగటం లేదు. ముందుగానే పత్రికా ప్రకటన కూడా విడుదల వేశామంటూ, కలెక్టరేట్ సిబ్బంది కసురుకుంటున్నారనే ఆవేదన అర్జీదారుల నుంచి వ్యక్తమవుతోంది. వాస్తవానికి ప్రజావాణి రద్దు చేస్తున్న సందర్భంలో శనివారం సాయంత్రమే పత్రిక ప్రకటన విడుదల చేస్తే ఆదివారం దినపత్రికల్లో అచ్చు అయి, ఎక్కువ మందికి తెలిసే అవకాశముంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
గతంలో కూడా ఇలాగే పలుమార్లు ప్రజావాణి రద్దు చేయగా, ముందస్తు సమాచారంతో ఆదివారమే దినపత్రికల్లో వార్తలు వస్తుండేవి. ప్రస్తుతం అంతగా ప్రాధాన్యమివ్వకపోవటంతో ప్రజలు మండే ఎండల్లో చెమటలు కక్కుతూ వస్తే, తీరా వచ్చిన అనంతరం ప్రజావాణి లేదు. పేపర్లో వచ్చింది అంటూ అర్జీదారులను సిబ్బంది దబాయిస్తూ నిర్లక్ష్యపు సమాధానాలు ఇవ్వటం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.పత్రికా ప్రకటన వెలువరించినా ఒకరిద్దరు అధికారులకు గతంలో మాదిరిగా ఆడిటోరియం సమీపంలో విధులు కేటాయిస్తే, ఇబ్బందులు పడేవారం కాదని అర్జీదారులు పేర్కొంటున్నారు. కాగా భారీ సంఖ్యలో అర్జీదారులు కలెక్టరేట్‌కు వస్తున్న విషయం తెల్చుకున్న ఏఓ గడ్డం సుధాకర్ అర్జీదారుల ఫిర్యాదులు ఇన్వర్డ్ సెక్షన్‌లో ఇవ్వాలంటూ సూచించగా, తమ ఆర్జీలు అక్కడి సిబ్బందికి అందజేసి వెనుదిరిగారు.
భూమి పంచాయితీ మీద ఫిర్యాదు చేసేందుకు వచ్చిన : అంజమ్మ, కొత్తపల్లి గ్రామం
మా భూమి పంచాయితీ మా ఊర్ల తెంపుతలేరు. కలెక్టరమ్మ దగ్గరికొచ్చి దరఖాస్తు ఇత్తే తొందరగా పని అయితదంటే నా మనుమరాలుతో కలిసి వచ్చిన. ఈడికొచ్చినంక ఇయ్యాల జరుగుతలేదు అని చెప్పిండు. పేపర్ సూడలేదా? ఎందుకచ్చినవని సార్లు అంటున్నరు? నాకు సదువే రాదయే.. పేపరెట్ల సూత్త, నేను గంత దూరం నుంచి నడి ఎండల వడి ఇక్కడికి వచ్చిన. ఎవ్వలన్న కలుత్తే కాయితమన్న ఇచ్చి పోదామని ఆగిన.
ఇందిరమ్మ ఇల్లుకు దరఖాస్తు చేసేందుకు వచ్చిన: వి. మహేశ్వరి, మధురానగర్ కాలనీ, గంగాధర
మొన్న మా ఊరిలో చేసిన సర్వేలో ఇందిరమ్మ ఇల్లుకు నన్ను లబ్దిదారుగా ఎంపికైనట్లు చెప్పిండ్లు, ముగ్గు పోసుకుంటా అని కార్యదర్శిని అడుగుతే, నీకు రాలేదు అని అనటంతో, మళ్లా దరఖాస్తు చేసుకుంటామని నా కొడుకుతో కలిసి వచ్చిన. ఇక్కడికి వచ్చే దాకా ఇవ్వాళ్ల ప్రజావాణి లేదని తెలవదు. ఆడిటోరియం మూసి ఉంటే పదకొండు అవుతున్నా ఇంకా తీయలేదని అడిగితే, ఈ రోజు ప్రజావాణి రద్దు చేసినట్లు చెప్పారు. రెండు రోజుల ముందుగానే చెబితే వచ్చేవాళ్ళము కాదు. పోయిన సోమవారం కూడా వచ్చినం. గిట్లనే చేసిండ్లు. ఎన్నిరోజులు బంధు వెడుతారో ముందుగానే చెబితే బాగుంటది. కండ్ల నుంచి వేడి వస్తుంటే 20 కి.మీ. దూరం నుంచి మేము వచ్చేటోళ్లం కాదు కదా.

# విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి












### -అటవీ, దేవాదాయ ధర్మాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

**సత్యమేవ జయతే/హత్నూర:**విద్యార్థులు సంప్రదాయ మార్గాలను మాత్రమే ఆశ్రయించకుండా, స్వీయ లక్ష్యాలతో ముందుకు సాగాలని అటవీ, దేవాదాయ ధర్మాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం హత్నూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఒక కోటి రూపాయలతో నిర్మించిన భోజనశాలకు, 60.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లకు,ఎంపీ రఘు నందన్ రావు, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ లో మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు ఉత్తమ పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో రాష్ట్రంలోనే ఉత్తమ ర్యాంకులు సాధించిన 25 మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శాలువాతో సత్కరించి మొమెంటులో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో కాకుండా ఉజ్వలమైన భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. కళాశాల ప్రశాంత వాతావరణంలో ఉండాలన్నారు.నూతన ప్రభుత్వం లో డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచి,నూతన మెనూ ను అమలు చేశామన్నారు. రోజు వారి మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు.ఎండ వేడి పెరిగి పోయిందని, చెట్లు నరకవద్దన్నారు.

**డిమాండ్ ఉన్న కోర్సులు**

ఎంచుకోవాలన్నారు.విద్యార్థులకు హాస్టల్ లో సమస్యలు ఉంటే చెప్పుకోవడానికి కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీ రఘు నందన్ రావు మాట్లాడుతూ... విద్యార్థులు ఆకాశమే హద్దు గా ఉన్నత స్థాయిలో లో స్థిరపడాలన్నారు.దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మించబడుతుందని స్వామి వివేకానంద చెప్పారని గుర్తు చేశారు.విద్యార్థులకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకోవలన్నారు .
తల్లితండ్రుల ఇష్ట ఇష్టాలు పిల్లలమీద రుద్దవద్దని సూచించారు. గతంలో చాలా పేదరికం నుంచి మాలవత్ పూర్ణ , లిఖిత్ జరీన్ లను ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ఈ కళాశాలల్లో ఐఐటి, జేఈఈ లకు శిక్షణ కార్యక్రమాన్ని అందిస్తున్నామని ,విద్యార్థులకు అన్ని విధాలుగా అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తు నిర్మించుకోవాలన్నారు. అంతకు ముందు హత్నూర మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ప్రాంగణంలో చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి,అదనపు కలెక్టర్ మాధురి,ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి , తాసిల్దార్ పర్వీన్ షేక్, కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్, కళాశాల అధ్యాపకులు, ప్రజా ప్రతినిధులు, తల్లితండ్రుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో మరో ముందడుగు - ఆవుల రాజిరెడ్డి

## చేతుల మీదుగా 8,66,500 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సత్యమేవ జయతే న్యూస్/ నర్సాపూర్‌నేడు వెల్దుర్తి, కౌడిపల్లి మండలానికి చెందిన 18 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (%జవీ=ఖీ%) నుండి మంజూరైన ₹10,66,500 విలువైన చెక్కులను తెలంగాణ పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి గారు అందజేశారు.
ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వ సహాయాన్ని పొందడంలో చేసిన ప్రయత్నాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సంక్షేమం తమ ధ్యేయమని పేర్కొన్న ఆవుల రాజిరెడ్డి గారు, "సామాజిక న్యాయం, పారదర్శక పాలన, నిరంతర ప్రజా సేవే మా లక్ష్యం. అవసరమైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం," అని హామీ ఇచ్చారు.అదనంగా, ఆరోగ్య సంబంధిత అత్యవసర ఖర్చులను ఎదుర్కొంటున్న మరిన్ని బాధితుల వివరాలు సేకరించి, వారి పట్ల తక్షణమే ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా చొరవ చూపనున్నట్లు ఆవుల రాజిరెడ్డి గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఎదురుకాల్పులు..!



సత్యమేవ జయతే - కొత్తగూడెం
కొత్తగూడెం : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. గత వారం రోజులుగా తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో వేల సంఖ్యలో భద్రతా దళాలు మావోయిస్టుల కోసం కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా నడిపల్లి-గల్గామ్ గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో కాసేపటి క్రితం మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగారు. సుమారు 30 నిమిషాలుగా ఈ కాల్పులు కొనసాగుతున్నాయి. ఘటన స్థలానికి అదనపు భద్రతా దళాలు చేరుకుంటున్నట్లు సమాచారం. ఈ ఘటనలో ప్రాణ నష్టం తెలియాల్సి ఉంది. భద్రతా బలగాలు వారం రోజులుగా కర్రెగుట్టలను జల్లెడ పడుతున్నాయి. నాలుగు రోజుల క్రితం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు హతమయ్యారు. సోమవారం సాయంత్రం నుంచి జరుగుతున్న ఈ ఎదురు కాల్పుల వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

ఆపరేషన్ కగార్ ఆపాల్సిందే : కేసీఆర్

ఆపరేషన్ కగార్ ను ఆపాల్సిందేనని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిన్నటి వరంగల్ సభ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన చేసిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో యువకులను, గిరిజనులను ఊచకోత కోయడం ధర్మం కాదన్నారు. శాంతి చర్చలకు నక్సలైట్లు ప్రతిపాదన పెట్టిన విషయాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ ప్రస్తావించారు. ప్రభుత్వంతో చర్చలు చేయడానికి నక్సలైట్లు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారన్నారు. ఈ నేపథ్యంలో తాను కేంద్రాన్ని ఒకటే కోరుతున్నట్లు.. బలం ఉందికదా అని చంపుకుంట పోవడం సరికాదని, అది ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలన్నారు. నక్సలైట్లను పిలిచి చర్చలు జరపాలని కోరారు. వాళ్ల ప్రతిపాదన ఏంటో దేశం ముందటికి రానీయాలన్నారు. అట్లకాకుండా మొత్తం నరికేస్తాం, కోసి పారేస్తం అంటే ఎలా? అని ప్రశ్నించారు. మిలట్రీ మీ దగ్గర ఉన్నది కాబట్టి కొడతరు. కానీ అది ప్రజాస్వామ్యం అనిపించుకోదు. అది ధర్మం కాదు అని కేసీఆర్ అన్నారు.

## సన్నాలపై చిన్నచూపు.. మిల్లర్లు ధాన్యం దించుకోకపోవడంతో రోడ్డెక్కిన రైతులు



సత్యమేవ జయతే - ఎల్లారెడ్డిపేట
ఎల్లారెడ్డిపేట : మూడురోజులుగా రైస్ మిల్లుల వద్ద పడిగాపులు కాస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వైఖరికి నిరసగా ధర్నాకు దిగారు. సన్నధాన్యం కొనుగోలు చేస్తామని, దీనికోసం రైస్ మిల్లులను కేటాయించామని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ మూడు రోజుల క్రితం ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ధాన్యం దించుకోవడానికి మిల్లర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారని
వ ం ం డ ి ఎ ́ డ ́ ం త ́ ం న ా ౖ ం ́ ం .
సన్న వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో సింగారంలో రైతులంతా ధాన్యం పండించి ఆదర్శంగా నిలవాలనుకున్నారు. గత 20 రోజుల క్రితం వరి ధాన్యం కల్లాల్లోకి తెచ్చి కొనుగోలు కోసం ఎదురు చూశారు. రైతులకు మొర పెట్టుకోగా నాలుగు రోజుల క్రితం కాంటా చేసిన వడ్లను పరిరలోని శ్రీ లలితా పరమేశ్వరి ఇండస్ట్రీస్‌కు కేటాయించగా ఒక లారీ ధాన్యం లోడ్ చేసి పంపించారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత తాము సన్నపు ధాన్యం తీసుకోవడం లేదని చేతులెత్తేయడంతో నాలుగు రోజులపాటు వేచి చూసి సోమవారం తాసిల్దార్ కార్యాలయం ముందు 50 మంది రైతులు పలు పార్టీలకు సంబంధించిన నాయకులు సన్నపు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న డీసీఎస్ఓ వసంతలక్ష్మి సన్న వడ్లను కచ్చితంగా కొనుగోలు చేసేలా, రైస్ మిల్లులో దింపుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన రైతులు ధర్నా విరమించారు.

## వీక్లీ మార్కెట్లో చలి వేంద్రం ఏర్పాటు




సత్యమేవ జయతే - నిజామాబాద్
నిజామాబాద్ : ప్రజలకు సేవలు అందించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సామాజిక సేవకర్త ఏంఎ హకీమ్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోనీ వీక్లీ బజార్‌లో పబ్బ లాలవ్వ, సాయన్న జ్ఞాపకార్థం గోల్డెన్ జిమ్ అధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుతున్న ఎండల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహన దారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించామన్నారు.
ఎండాకాలం ముగిసేంత వరకు చలివేంద్రం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోల్డెన్ జిమ్ ప్రొప్రైటర్ శేఖర్, బీఆర్ఎస్ నాయకుడు నవీన్, పిరజీ, జల్లపల్లి మాజీ ఎంపీటీసి రాములు, ప్రశాంత్, గంగారం, రాములు, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

## భూ భారతి చట్టంపై అవగాహన తప్పనిసరి : కలెక్టర్ రాజర్షి షా



సత్యమేవ జయతే - ఆదిలాబాద్
ఆదిలాబాద్ : భూ భారతి చట్టంపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో భూ భారతి చట్టంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా ఉండి భూమి లేని రైతులకు జిల్లాలోని భూ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం మండల ప్రజలు, రైతులు అట్నంగూడ గ్రామంలో పశువులకు తాగేందుకు నీళ్లు కూడా లేవని ఫిర్యాదు చేశారు. తాంసి మత్తడివాగులో పూడికతీత పనులు చేపట్టాలని మాజీ సర్పంచ్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.
కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్ , ఆర్డీవో వినోద్ కుమార్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి , జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, తాజా మాజీ జడ్పీటీసీలు తాటిపల్లి రాజు , గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ సురకుంటి మంజుల శ్రీధర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు మా ఇష్టం ఉన్న వారికి ఇస్తాం..కాంగ్రెస్ నాయకుల వైఖరిపై గ్రామస్థుల మండిపాటు

సత్యమేవ జయతే - నాగర్‌కర్నూల్
నాగర్‌కర్నూల్ : మా పార్టీ మా ఇష్టం. ఇందిరమ్మ ఇండ్లు మా ఇష్టం ఉన్నవారికి ఎవరికైనా ఇస్తామంటూ గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు , కాంగ్రెస్ నాయకులు వాదిస్తున్నారని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామస్థులు ఆరోపించారు. గ్రామంలో సోమవారం పలువురు అర్హులైన గ్రామస్థులు తమకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇండ్లు ఉన్న వారి పేర్లు లిస్టులో ఉన్నాయని, ఇండ్లు లేక పట్టణాల్లోకి పోయి పని చేసుకుంటూ జీవించే పేదలకు ఇల్లు మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని అడిగితే దబాయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.

# ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి : సీఐ శ్రీనివాస్ గౌడ్



సత్యమేవ జయతే - వరంగల్
వరంగల్ : రైల్వే ప్రయాణికులు అప్రమతంగా ఉంటూ తన గమ్య స్థానాలకు సురక్షితంగా చేరాలని వరంగల్ ఆర్పీఎఫ్ సీఐ పీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దేశ వ్యాప్తంగా చేపట్టిన భద్రత చర్యల్లో భాగంగా సోమవారం వరంగల్ రైల్వేస్టేషన్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ప్రయాణికులకు భద్రతపై బరోసా కల్పించేందుకు స్టేషన్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోగీలలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనించినట్లయితే రైలులోని ఆర్పీఎఫ్, జీఆర్పీ, రైల్వే సిబ్బంది దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు.
అలాగే పేలుడు, మండే స్వభావం కలిగి వస్తువులను తరలించడం చట్ట రీత్యా నేరమన్నారు. విలువైన వస్తువలతో ప్రయాణించేవారు ఎప్పటిప్పుడు తమ వస్తువులను సరి చూసుకోవాలన్నారు. రైలు ప్రయాణంలో కిటికి వద్ద కూర్చునే మహిళలు అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే చైన్ స్నాచింగ్ జరిగే అవకాశం ఉందన్నారు. బంగారు ఆభరణాలు కనిపించకుండా జాగ్రత్త పడాలన్నారు. అనుమానిత వ్యక్తులు గాని, సంఘ విద్రోహక శక్తుల గురించి లేదా చోరీ జరిగిన వెంటనే ప్రయాణికులు టోల్ ఫ్రీ నెం. 139 సమాచారం ఇవ్వాలన్నారు. సమచారం ఇచ్చిన వెంటనే రైలులోని పోలీసులు గాని లేదా తదుపరి రైల్వేస్టేషన్లోని పోలీసులు అసంఘీక శక్తుల భరతం పడుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్సై జీ వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్..

# 13లక్షల విలువైన బంగారు ఆభరణాల బ్యాగ్ ప్రయాణికుడికి అందజేత



సత్యమేవ జయతే - హైదరాబాద్
హైదరాబాద్ : టీజీఎస్ఆర్టీసీ కండక్టర్ వెంకటేశ్వర్లు నిజాయితీని చాటుకున్నారు. బస్సులో పోగొట్టుకున్న రూ.13 లక్షల విలువగల బంగారు, వెండి ఆభరణాలు, నగదుతో కూడిన బ్యాగును ప్రయాణికుడికి అందజేశాడు. ఈ సందర్భంగా ఉదారత చాటుకున్న అచ్చంపేట డిపోనకు చెందిన వెంకటేశ్వర్లును టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. హైదరాబాద్ బస్ భవన్లో సోమవారం ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ ఆయనను సన్మానించి.. ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అచ్చంపేట-హైదరాబాద్ రూట్ టీజీఎస్ఆర్టీసీ బస్సులో ఈ నెల 26న కండక్టర్ వెంకటేశ్వర్లు విధులు నిర్వహించారు. ఎంజీబీఎస్‌కు చేరుకోగానే బస్సులో ఎవరో ప్రయాణికుడు బ్యాగ్‌ను మరచిపోయినట్లు కండక్టర్ గుర్తించారు. బ్యాగును తెరిచి చూడగా అందులో బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు, పలు సర్టిఫికెట్లు ఉన్నాయి. వెంటనే ఈ విషయాన్ని అచ్చంపేట డీఎం మురళీ దుర్గా ప్రసాద్‌కు ఫోన్‌లో కండక్టర్ సమాచారం అందించారు. బ్యాగ్‌ను ఎంజీబీఎస్‌లోని స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో అప్పగించాలని డీఎం సూచించారు. ఇంతలోనే అనిల్ కుమార్ అనే ప్రయాణికుడు డీఎంకి ఫోన్ చేసి బస్సులో బ్యాగును మరచిపోయినట్లు చెప్పారు. కందుకూరులో బస్సు ఎక్కి సీబీఎస్‌లో దిగి కాచిగూడకు వెళ్లిపోయానని పేర్కొన్నారు. దీంతో ఎంజీబీఎస్‌లోని స్టేషన్ మేనేజర్ కార్యాలయానికి వెళ్లాలని డీఎం సూచించారు. టీజీఎస్ఆర్టీసీ అధికారులు వివరాలను పరిశీలించి.. బ్యాగును ప్రయాణికుడు అనిల్ కుమార్ కు అందజేశారు. ఆ బ్యాగులో 14 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.14,800 నగదు, అనిల్ కుమార్ స్టడీ సర్టిఫికెట్లు, అతని కుమారుడి బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయి. కాగా, విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించి రూ.13 లక్షల విలువైన ఆభరణాలతో కూడిన బ్యాగును ప్రయాణికుడికి అందజేసిన కండక్టర్ వెంకటేశ్వర్లును సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ అభినందించారు. సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూనే 'ఎక్స్ట్రా మైల్' దిశగా సమాజంలో ఆర్టీసీ సిబ్బంది ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని కొనియాడారు.

## వికారాబాద్ పట్టణం లో మున్సిపల్ అధికారుల తనిఖీలు చేసిన శానిటరి ఇన్ స్పెక్టర్ యేసు దాస్....





సత్యమే వ జయతే వికారాబాద్ జిల్లా.... వికారాబాద్ పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పలు హోటల్ మరియు మోర్ సూపర్ మార్కెట్ మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. ఏసుదాస్ మాట్లాడుతూ తేదీ అయిపోయిన సరుకులను అమ్మితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రెండు రూపాయలు మోర్ సూపర్ మార్కెట్ కు 10000 రూపాయలు. కనకదుర్గ బార్ కు 5000.గీత కేఫ్ 1000 రూపాయలు సేవన్ హిల్స్ బార్ మరియు రెస్టారెంట్ 3000 మొత్తం 19000 రూపాయలు జరిమానా వేసినట్టు వారు తెలిపారు.ఈ కార్యక్రమం లో శ్రీనివాస్ జవాన్లు వినోద్ కుమార్ శంకర్ చెన్నయ్య రాజు ఆశయ్య మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గన్నీ బ్యాగుల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే, కలెక్టర్‌కు రైతుల మొర



సత్యమేవ జయతే - నారాయణపేట నారాయణపేట : నారాయణ పేట జిల్లా మాగనూర్ ఉమ్మడి మండలంలో గన్నీ బ్యాగుల సమస్య తీవ్రంగా ఉందని రైతులు ఆరోపించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి , నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ రైతులు మొరపెట్టుకున్నారు. మక్తల్ నియోజకవర్గంలోని మాగనూరు, కృష్ణ మండల కేంద్రాల్లో సోమవారం భూ భారతి కొత్త రెవెన్యూ చట్టం అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే, కలెక్టర్‌కు తమ సమస్యలను వినిపించారు. ప్రధానంగా మాగనూరు మండలంలో 14వేల ఎకరాల వరి ధాన్యం, కృష్ణా మండలంలో 12,500 ఎకరాల్లో వరి ధాన్యం పండించిన రైతులకు కావాల్సిన సంఖ్యలో గన్నీ బ్యాగులను అందించలేదని ఆరోపించారు. గన్నీ బ్యాగుల కొరతతో అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.
కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం ఆదివారం కురిసిన ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయిపోయిందని, తడిసిన ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేసి తమకు తగిన న్యాయం కోరారు. ధాన్యం సేకరణ తరువాత లారీ డ్రైవర్లు లంచాలు తీసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షానికి తడిసిన ధాన్యం కొనుగోలు చేసే విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రైతుకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న హెల్ప్ లైన్ నెంబర్ 9963471959 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.
సమావేశంలో నారాయణపేట ఆర్డీవో రామచందర్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, మాగనూరు, కృష్ణ మండలాల తహసీల్దార్లు వెంకటేష్, సురేష్ కుమార్, ఎంపీడీవోలు జానయ్య, ఉమ్మడి మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్, వివిధ శాఖల సంబంధిత అధికారులు, రైతులు , తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ విగ్రహావిష్కరణలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలి



సత్యమేవ జయతే - నారాయణపేటనారాయణపేట : షాహిద్ భగత్ సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని పీవో డబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. మే 5న మక్తల్ నారాయణపేట చౌరస్తాలో జరిగే షాహిద్ భగత్ సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర శాఖ తరపు నుంచి మక్తల్ పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి మహిళలకు అవగాహన కల్పించారు.
బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విముక్తి చేయాలని, పోరాటమే మార్గమని భావించిన భగత్ సింగ్, బ్రిటిష్ దొరలను గడగడలాడించారని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు శారద, జిల్లా సహాయ కార్యదర్శి భాగ్యలక్ష్మి, కోశాధికారి మహాదేవమ్మా , రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య, యూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఘట్టో , పాటు తదితరులు ఉన్నారు.

## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి : అఖిలపక్ష నాయకులు



సత్యమేవ జయతే - కొత్తగూడెం కొత్తగూడెం : ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని అఖిలపక్ష నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీలు, సంఘాల నాయకులు మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక మావోయిస్టు పార్టీని ఆపరేషన్ కగార్ పేరుతో అంతం చేస్తామని, మార్చి 2026 నాటికల్లా నక్సల్స్ లేకుండా చేస్తామని ప్రకటిస్తూ, కార్పొరేట్ సంస్థలకి ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను అప్పగించడం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తోందని ఆరోపించారు.
ఆదివాసి ప్రాంతాల్లో 89 రకాల ఖనిజ సంపద ఉన్నదని, దానిని స్వాధీనపరచుకోవడం కోసం దాడులు, అత్యాచారాలు, ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని, 280 కిలోమీటర్ల వైశాల్యం కలిగిన కర్రెగుట్టను లక్ష్యంగా చేసుకుని వేలాది మంది సైన్యం జల్లెడ పడుతుందన్నారు. తక్షణమే కర్రెగుట్టకు వెళ్లిన సైన్యాన్ని వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు. శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు కొనసాగించాలని, ప్రజాస్వామికంగా వ్యవహరించాలని వారు కోరారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగ సీతారాములు, సీపీఐ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సలివిడి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు లిక్కి బాలరాజు, టీజేఎస్ రాష్ట్ర నాయకుడు మల్లె రామనాథ%శీ%, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ఉపేందర్, ఐలు జిల్లా అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్, ఆల్ ఇండియా ట్రైబల్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ సూర్ణపాక నాగేశ్వర్‌రావు, బీసీ సంఘం నాయకుడు సైదుబాబు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తుపాకుల నాగేశ్వర్‌రావు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు జె.సీతారామయ్య, వై. గోపాలరావు, పృథ్వీ, మోత్కూరి మల్లికార్జునరావు, మంజుల, ఎట్టి ప్రశాంత్, అలీముద్దీన్, ప్రణయ్, కిరణ్, బుచ్చయ్య దొర పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి : జలాల్



సత్యమేవ జయతే - కొత్తగూడెం
కొత్తగూడెం : కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో ఉన్న నిరుపేదలు 807 మందికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 75 గజాల చొప్పున ఇంటి స్థలం ఇచ్చింది. ఆ లబ్ధిదారులకు ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ”సేవ్ కొత్తగూడెం- సేవ్ మున్సిపాలిటీ” కన్వీనర్ జలాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం లబ్దిదారులతో కలిసి మున్సిపాలిటీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ కమిటీల్లో మాజీ కౌన్సిలర్ల పెత్తనం ఎక్కువైందని, లబ్ధిదారులకు అన్యాయం చేయాలని కొంతమంది నాయకులు చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హులకు ఇండ్లు ఇస్తే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏ వార్డులో ఎంతమందికి ఇండ్లు వచ్చాయో సవివరంగా మున్సిపల్ నోటీసు బోర్డులో పెట్టాలని, ఇండ్ల ఎంపికలో మాజీ కౌన్సిలర్ల ప్రాధాన్యత అస్సలు ఉండకూడదని ఆయన అధికారులను కోరారు.
ఇందిరమ్మ కమిటీ సభ్యులు సైతం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రామవరం ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వారికి ఎలాంటి హక్కు పత్రాలు లేకపోవడంతో ఇండ్లు మంజూరయ్యే అవకాశం కనబడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం పట్టణంలో సైతం స్థలాలకు అతి తక్కువ మందికి పట్టాలు ఉండడంతో ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తీవ్ర అన్యాయం జరగనున్నట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే అర్హులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జిల్లా కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల లబ్దిదారులు పాల్గొన్నారు.
%ళి7:53ాపీ, 4/28/2025ి% ం91 91213 73951: ఎండ్

## మధ్య భారతాన్ని గాజాగా మార్చిన మోదీ ప్రభుత్వం : బాలరాజు




సత్యమేవ జయతే - వరంగల్
వరంగల్ : మధ్య భారతాన్ని ఇండియన్ గాజాగా మోదీ ప్రభుత్వం మార్చిందని సీపీఐఎంల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేసి కర్రెగుట్ట ప్రాంతంలో కేంద్ర భద్రత దళాల దాడులను నిలిపి వేయాలని కోరుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఖిలా వరంగల్లోని అమర వీరుల స్తూపం వద్ద నిరసన చేపట్టారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో ప్రారంభించిన గ్రీన్ హంట్ మొదలు నేటి ఆపరేషన్ కగార్ వరకు అనేక మంది ఆదివాసీ ప్రజలను కేంద్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర పోలీసు బలగాలు చంపేస్తున్నాయని ఆరోపించారు. అక్కడున్న సహజ ఖనిజ సంపదను అంబానీ, ఆదానీలకు, సామ్రాజ్యవాద దేశాలకు బహుళ జాతి కంపెనీలకు అప్పగించేందుకు నరమేధాన్ని కొనసాగిస్తున్నాయని విమర్శించారు. గత ఐదు రోజులుగా తెలంగాణ, ఛత్తీస్ గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టలో మావోయిస్టుల కోసం కొనసాగుతున్న కూబింగ్‌ను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ నేతలు శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్న ప్రకటించి నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యమ సంస్థల నాయకులు, ప్రజాస్వామిక వాదులు, మేధావులతో మాట్లాడి శాంతి చర్చలు జరిపి మధ్య భారతదేశంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, సుద్దాల వీరన్న, ఇనుముల కృష్ణ, ఎండీ అక్బర్, బండి చంద్రమోళి తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే

మంగళవారం 29 ఏప్రిల్ 2025

### భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే

### భూ భారతి చట్టం : కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సత్యమేవ జయతే - హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ : భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చినట్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్ నందు రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా రైతులు తమ భూముల సమస్యలు సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు. భూ భారతి చట్టంపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కమతానికి భూధార్ కార్డును కేటాయించి దీనిలో హద్దులతో కూడిన మ్యాప్ పొందుపరచనున్నట్లు చెప్పారు. అలాగే భవతి చేసేటప్పుడు కుటుంబంలోని ప్రతి ఒక్కరికి నోటీసులు ఇచ్చి ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు వెల్లడించారు.

గతంలో జరిగిన కమిటేషన్లపై అప్పీల్ చేసుకునేందుకు ధరణిలో అవకాశం లేదని కానీ భూభారతిలో ముటేషన్ల పై అభ్యంతరాలు ఉంటే రెండు అంచెలుగా అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. త్వరలో జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి, పరిశీలించిన పిదప జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులు తీసుకుని అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. ముందుగా ఆర్డీఓ శ్రీనివాసులు భూ భారతి చట్టంలోని ఒక్కొక్క అంశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేశ్ముఖ రాధిక అరుణ్ కుమార్, డీసీసీబీ డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు, డీఏఓ రాజేందర్ రెడ్డి, ఏడీఏ రవి, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేందర్, ఎంపీడీఓ లావణ్య, పీఏసీఎస్ చైర్మన్లు శౌరరెడ్డి, జి.నాగేందర్, గోపాలరావు పాల్గొన్నారు.

## చర్లపల్లి డివిజన్ ఈసీనగర్ కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి




సత్యమేవ జయతే - చర్లపల్లి చర్లపల్లి : చర్లపల్లి డివిజన్ ఈసీనగర్ కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఈసీ నగర్ హౌజ్ బిల్డింగ్ సొసైటీ కమిటీ అధ్యక్షుడు బూడిద శ్రవణ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ ఈసీనగర్ కమ్యూనిటి హాల్‌లో కాలనీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా కాలనీలో డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాలనీలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం 2025ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యాక్షుడు సీహెచ్.పద్మిని, ప్రధాన కార్యదర్శి జగ్గారాజు, కోశాధికారి కాసుల ఇందిరాగౌడ్, కమిటీ సభ్యులు భిక్షపతి, బాలయ్యగౌడ్, మల్లేశ్, బాల్‌రెడ్డి, భానుకుమార్, సత్తిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డిలతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## దోపిడి దొంగల బీభత్సం.. కానిస్టేబుల్‌పై కత్తులతో దాడి, 30 గొర్రెలు అపహరణ



సత్యమేవ జయతే - రంగారెడ్డి

రంగారెడ్డి : గొర్రెల మందకు కాపలాదారులుగా పడుకున్న ఓ ఇద్దరి వ్యక్తులపై దోపిడి దొంగలు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కాపలాదారు, ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరొక వ్యక్తి స్వల్ప%శీ%గా గాయపడ్డారు. గొర్రెల మంద నుండి 30 గొర్రెలను దొంగలు అపహరించారు. ఈ సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండల తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ గ్రామానికి చెందిన రాసూరి నవీన్ (29), వృత్తిరీత్యా కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.కాగా, తన తండ్రి శ్రీశైలానికి 250 గొర్రెలు ఉన్నాయి. ప్రతిరోజు వాటిని మేపుతూ పోషిస్తుండేది. కొన్ని రోజులుగా తండ్రి ఆరోగ్యం బాగా లేనందున చికిత్స నిమిత్తం ఎల్బీనగర్ లోని కామినేని హాస్పిటల్‌లో చేర్పించారు.ఆదివారం రాత్రి తండ్రి స్థానంలో నవీన్, బావమరిది శ్రీకాంత్‌తో కలిసి గ్రామ సమీపంలోని సంపత్ బాల్ రెడ్డి పొలంలో ఉన్న గొర్రెల మంద వద్దకు వచ్చి పడుకున్నారు. సోమవారం తెల్లవారుజామున దాదాపు 3.30 గంటలకు 20 నుండి 25 మధ్య వయసు గల దాదాపు 10 మంది గుర్తుతెలియని వ్యక్తులు బొలెరో వాహనంలో మంద వద్ద పడుకున్న వారి వద్దకు వచ్చారు. వెంటనే వారి వద్ద ఉన్న సెల్ ఫోన్లను, రూ.5 వేలు నగదును లాక్కున్నారు. నవీన్ పై కత్తులతో దాడి చేయగా అతని కుడి కన్ను, తలపై, కుడి భుజం వెనుక భాగాల్లో తీవ్రంగా గాయాలయ్యాయి. శ్రీకాంత్ మొహంపై కూడా దాడి చేయడంతో అతని కుడికన్ను, ఇతర భాగాల్లో గాయాలయ్యాయి.

అనంతరం వారందరూ వెంట తీసుకొచ్చిన బొలెరో వాహనంలో 30 గొర్రెలను ఎత్తుకెళ్లారు. దాడికి పాల్పడిన వ్యక్తులు హిందీ భాషలో మాట్లాడినట్లు వెల్లడించారు. సంఘటన అనంతరం బాధితులు వెంటనే గ్రామానికి వెళ్లి గ్రామస్తుల సహాయంతో 100 కు డయల్ చేశారు. విషయం తెలుసుకున్న హయత్ నగర్ పోలీసులు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. తీవ్రంగా గాయపడ్డ వారిని నవీన్, శ్రీకాంత్ లను చికిత్స నిమిత్తం ఎల్బీనగర్ లోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు.

హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ పి నాగరాజ్ గౌడ్, సిబ్బందితో టీమ్స్ గా ఏర్పడి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్ సమీపంలోని సీసీ టీవీ ఫుటేజ్ లను కూడా పరిశీలిస్తున్నారు. నేరానికి పాల్పడిన దొంగల ముఠాను త్వరలోనే పట్టుకొని అరెస్టు చేస్తామని సీఐ నాగరాజు గౌడ్ వెల్లడించారు. బాధితుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# గన్నీ బ్యాగుల కోసం జాతీయ రహదారిపై రాస్తారోకో.. ఇరువైపుల స్థంభించిన ట్రాఫిక్



సత్యమేవ జయతే - నారాయణపేట

నారాయణపేట : పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలంటే అధికారులు గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ మక్తల్ మండల రైతులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. సోమవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై చేరుకుని రాస్తారోకోను చేపట్టారు. రైతులు గన్నీ బ్యాగుల కోసం సోమవారం ఉదయం మక్తల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి రాగా, కార్యాలయ సిబ్బంది రైతులకు గన్ని బ్యాగులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారు. దీంతో అధికారుల తీరుకు విసుగు చెందిన రైతన్నలు వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ యాసంగి సీజన్లో పంట చేతికొచ్చి ధాన్యం మొత్తం కల్లాలపై ఉన్నప్పటికీ రైతులకు అందించాల్సిన గన్నీ బ్యాగులను అందించకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. అధికారుల మొండి వైఖరి వల్ల ఆదివారం కురిసిన వర్షానికి భారీ మొత్తంలో ధాన్యం తడిసి పోయిందని వాపోయారు.

అధికారులు రైతులకు తేదీల వారిగా టోకెన్ల ను జారీ చేసి సంచులు ఇవ్వాల్సి ఉండగా, ఇందుకు విరుద్ధంగా ప్రాథమిక సహకార సంఘం సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి, అవసరమైన పెద్ద రైతులకు రహస్యంగా గన్నీ బ్యాగులను తరలిస్తున్నారని ఆరోపించారు. రైతన్నల రాస్తారోకోతో జాతీయ రహదారిపై భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న మక్తల్ సీఐ రామ్‌లాల్ హుటాహుటినా సిబ్బందితో ధర్నా వద్దకు వెళ్లి రైతులను సమదాయించారు.

రైతులు ఏమాత్రం తగ్గకుండా, గన్నీ బ్యాగులు వచ్చేంతవరకు రోడ్డుపై ఉంటామని కూర్చోవడంతో, సీఐ జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు కావలసిన గన్నీ బ్యాగులను అందిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. మండలంలో రైతులకు నాలుగున్నర లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, కేవలం కార్యాలయంలో 25 వేల గన్నీ బ్యాగులు మాత్రమే ఉన్నాయని, ఈ గన్నీ బ్యాగులను ఎవరికి ఇవ్వాలో అర్థం కాక కార్యాలయంలోనే నిలువ ఉంచామని పీఏసీఎస్ మక్తల్

# లేబర్ కోడ్స్‌ను తీసుకురావడాన్ని నిరసిస్తూ సమ్మె.. మేడే స్ఫూర్తితో జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపు



సత్యమేవ జయతే - జహీరాబాద్

జహీరాబాద్ : కేంద్ర ప్రభుత్వం కార్మికుల గుండెకాయ లాంటి కార్మిక చట్టాలను రద్దు చేసి పూర్తిస్థాయిలో కార్మికులను నట్టేట ముంచే, బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను తీసుకురావడాన్ని నిరసిస్తూ మే 20న దేశ వ్యాప్తంగా సమ్మె జరుగుతుందని.. ఈ దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చింది.

ప్రపంచ కార్మిక దీక్షా దినోత్సవం మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, మేడేను ఘనంగా జరపాలని.. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్ కార్మిక వర్గానికి సీఐటీయూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఇవాళ శ్రామిక్ భవన్‌లో సీఐటీయూ జహీరాబాద్ ఏరియా కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ మహిపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల గుండెకాయ లాంటి కార్మిక చట్టాలను రద్దు చేసి పూర్తిస్థాయిలో కార్మికులను నట్టేట ముంచే, బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను తీసుకురావడాన్ని నిరసిస్తూ మే 20న దేశ వ్యాప్తంగా సమ్మె జరుగుతుందని.. ఈ దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కార్మిక చట్టాలు రావడానికి కారణమైన మేడేను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని, మే 1న సీఐటీయూ అనుబంధ యూనియన్లు, మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున జెండా ఆవిష్కరణలు నిర్వహించి ఘనంగా జరపాలని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు రాజిరెడ్డి, గౌరమ్మ, నందమ్మ, నరేష్, యాల్లప్ప , నారాయణ, యశోదమ్మ, తదితరులున్నారు.

### రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు : తహసీల్దార్ రజనీకుమారి



సత్యమేవ జయతే - రామాయంపేట

రామాయంపేట : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వరి ధాన్యాన్ని వెంటవెంటనే లారీల్లో రైస్ మిల్లులకు తరలించాలని రామాయంపేట తహసీల్దార్ రజనీకుమారి ఆదేశించారు. తహసీల్దార్ ఇవాళ రామాయంపేట పట్టణంతోపాటు డి ధర్మారం తదితర గ్రామాలలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులు ధాన్యం మంచి మ్యాచర్ వచ్చేలా వడ్లను ఎండబెట్టాలన్నారు. వడ్లు మంచిగా ఎండితేనే మ్యాచర్ వచ్చి రైతులకు గిట్టుబాటు ధర వస్తుందన్నారు.

కేంద్రాల్లో ఉన్న సిబ్బంది ఇక్కడే ఉండి రైతులకు టార్పాలిన్లు, బ్యాగులను అందజేయాలని ఆదేశించారు. బ్యాగులను నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు లారీలలో తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ రజనీకుమారి పేర్కొన్నారు.

### ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి: జస్టిస్ చంద్రకుమార్




సత్యమేవ జయతే - హైదరాబాద్

హైదరాబాద్ : ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ కన్వీనర్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపకుండానే ఆదివాసీలపై దమనకాండకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇది సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదివాసీల హననాన్ని తక్షణమే ఆపేయాలని కోరారు. విలువైన ఖనిజ వనరులను దేశ విదేశీ వాణిజ్య సామ్రాజ్యవాదులు, కార్పొరేట్లతో ఒప్పందాలు చేసుకొని, వారికి అప్పజెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే ఆదివాసీలు, వారికి అండగా ఉన్న మావోయిస్టులను అంతం చేసే కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. ఇరువర్గాలు కాల్పుల విరమణ పాటించి, శాంతి చర్చల వైపు ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులను కాలరాస్తూ పెసా,1/70 చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల రాజ్యాంగ హక్కులను కాపాడాలని కోరారు. శాంతి చర్చల కమిటీ ఉపాధ్యక్షులు జంపన్న మాట్లాడుతూ.. ఆదివాసీల సంక్షేమం దృష్ట్యా ఇరుపక్షాలు శాంతిని పాటించాలని కోరారు.

## ఆయుర్వేద ప్రకారం ఈ మొక్క చాలా శక్తివంతమైనది.. తప్పకుండా ఇంట్లో పెంచుకోండి..!



సత్యమేవ జయతే - ఆరోగ్య చిట్కాలు ఆయుర్వేద ప్రకారం మన శరీరంలో వాత, పిత్త, కఫ దోషాల్లో వచ్చే హెచ్చు తగ్గుల కారణంగానే మనకు రోగాలు వస్తాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అందుకనే ఆ దోషాలను సమతుల్యం చేసేలా ఔషధాలను తయారు చేస్తుంటారు. వాటిని రోగాన్ని బట్టి, రోగి పరిస్థితిని బట్టి ఇస్తుంటారు. దీంతో ఆ దోషాలు సమతుల్యం అవుతాయి. రోగం నయం అవుతుంది. ఆయుర్వేద ఔషధాలు ఇదే సూత్రంపై ఆధార పడి పనిచేస్తాయి. అయితే అన్ని రకాల ఔషధాలు ఏదో ఒకటి లేదా రెండు దోషాలను మాత్రమే సమతుల్యం చేయగలవు. కేవలం కొన్ని మాత్రమే మూడు దోషాలను సమతుల్యం చేస్తాయి. అలాంటి ఔషధాల్లో దూసరి తీగ కూడా ఒకటి. దీన్నే పాతాళ గరుడి అని కూడా పిలుస్తారు. దూసరి తీగ ఆకుల రసాన్ని అనేక వ్యాధులను నయం చేసేందుకు ఉపయోగిస్తారు. ఇది వాత, పిత్త, కఫ మూడు దోషాలను సమతుల్యం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.దూసరి తీగ మన చుట్టూ ప్రకృతిలోనే పెరుగుతుంది. దీన్ని చాలా మంది చూసే ఉంటారు. కానీ ఈ మొక్కలో ఔషధ గుణాలు ఉంటాయని చాలా మందికి తెలియదు. గ్రామీణ ప్రాంతాల్లో మనకు దూసరి తీగ విరివిగా లభిస్తుంది. ఎక్కడ చూసినా ఈ మొక్క మనకు దర్శనమిస్తుంది. ఈ మొక్క ఆకుల రసాన్ని ఉపయోగిస్తే పలు వ్యాధులు నయం అవుతాయి. దూసరి ఆకులతోపాటు వేర్లను కూడా ఉపయోగించవచ్చు. దేన్ని ఉపయోగించినా సరే నీటితో కలిపి 10 నుంచి 20 ఎంఎల్ మోతాదులో మాత్రమే వాడుకోవాలి. దూసరి తీగ నుంచి రసం తీసి 10 నిమిషాల పాటు అలాగే పక్కన పెట్టాలి. తరువాత అందులో కాస్త పటిక బెల్లం కలిపి తీసుకోవాలి. దీంతో శరీరంలోని వేడి తగ్గిపోతుంది. వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. డీహైడ్రేషన్ తగ్గుతుంది. మూత్రంలో మంట తగ్గి మూత్రం ధారాళంగా వస్తుంది. వేసవిలో ఈ మిశ్రమాన్ని తీసుకుంటే శరీరం చల్లగా ఉంటుంది.

దూసరి తీగ ఆకుల రసం, పటిక బెల్లం కలిపి తీసుకోవడం వల్ల మహిళల్లో గర్భాశయ సమస్యలు సైతం తొలగిపోతాయి. దీంతో సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి. మహిళల్లో వచ్చే హార్మోన్ సమస్యలు కూడా తగ్గుతాయి. నెలసరి సక్రమంగా వస్తుంది. దూసరి తీగ ఆకుల రసాన్ని కాస్త తీసుకుని స్నానం చేసే నీటిలో కలిపి ఆ నీటితో స్నానం చేస్తే వేసవిలో వచ్చే వేడి కురుపులు, చెమట కాయలు తగ్గుతాయి. వేసవిలో కొందరికి చెమట కారణంగా చర్మంపై దురద వస్తుంది. ఈ సమస్య నుంచి కూడా బయట పడవచ్చు. దూసరి తీగ ఆకులు అన్ని వేళలా లభించవు అనుకునే వారు ఈ ఆకులతో పొడి తయారు చేసుకుని దాన్ని సీసాలో నిల్వ చేసి కావాల్సినప్పుడు ఉపయోగించుకోవచ్చు.

ఎముకల దృఢత్వానికి..

దూసరి తీగ ఆకుల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు దూసరి తీగ ఆకుల రసాన్ని సేవిస్తుంటే త్వరగా ఎముకలు అతుక్కుంటాయి. ఉదయం నిద్ర లేవగానే కొందరికి నీరసంగా ఉంటుంది. ఎలాంటి పని చేయకపోయినా, రాత్రంతా సరిగ్గానే నిద్రించినా ఉదయం అలసటగా అనిపిస్తుంది. అలాంటి వారు ఉత్తేజం కోసం ఉదయం దూసరి తీగ రసాన్ని తీసుకోవచ్చు. దీంతో యాక్టివ్‌గా మారి చురుగ్గా పనిచేస్తారు. దూసరి తీగ మొక్కను ఇంట్లో పెంచుకోవడం వల్ల మనకు ఆరోగ్యపరమైన లాభాలే కాకుండా ఇంకో లాభం కూడా ఉంది. అదేమిటంటే.. పూర్వం మన పెద్దలు దూసరి తీగను ఇళ్లలో ఎక్కువగా పెంచుకునేవారు. దీంతో పాములు, తేళ్ల వంటి విష కీటకాలు ఇళ్లలోకి రావని నమ్మేవారు. ఇలా దూసరి తీగ మనకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది.

(నోట్ : ఇంటర్నెట్‌లో మరియు పుస్తకాల ఆధారంగా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు 'సత్యమేవ జయతే' బాధ్యత వహించదు.)

# లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్! కొంతమందికి పాలు సరిపడవు.. ఎందుకంటే?



పాలు సంపూర్ణాహారం. తల్లికి పాలు పడకపోతే.. పిల్లలకు ఆవు లేదా గేదె పాలు ఇచ్చి పెంచుతారు. సాధారణంగా అందరికీ సరిపడే పాలు.. కొంతమందికి మాత్రం సరిపడవు. పాలలోని చక్కెర వారి ఒంటికి సరిపడక పోవడంతో కడుపు ఉబ్బరం, నీళ్ల విరేచనాలు వంటి కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ పరిస్థితిని 'లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్' అంటారు. ఈ సమస్యపై అవగాహన కల్పించే కథనమిది. సాధారణంగా మనందరి చిన్నపేగుల్లో 'లాక్టేజ్' అనే ఎంజైమ్స్ విడుదలవుతాయి. ఇవి పాలలో ఉండే లాక్టోజ్ అనే చక్కెరను జీర్ణం చేస్తాయి. కొందరిలో ఈ ఎంజైమ్ ఉత్పాదన చాలా తక్కువగా ఉంటుంది. అలాంటి వారిలో 'లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్' అనే సమస్య కనిపిస్తుంది. ఈ లాక్టేజ్ అనే ఎంజైమ్.. పాలలోని చక్కెరను గ్లూకోజ్, గలాక్టోజ్ అనే రెండు పదార్థాలుగా మారుస్తుంది. ఇవి చాలా తేలిగ్గా చిన్నపేగుల్లోకి ఇంకిపోయి.. అక్కడి నుంచి రక్తప్రవాహంలో కలిసి దేహానికి శక్తిని అందిస్తాయి. ఒకవేళ ఈ లాక్టేజ్ చాలా చాలా తక్కువగా ఉంటే.. పాలలోని చక్కెర అయిన లాక్టోజ్ చిన్నపేగుల ప్రాంతంలో రక్తంలో ఇంకిపోకుండా పెద్దపేగుల్లోకి ప్రవేశిస్తుంది. జీర్ణం కాని ఆహారంగా అక్కడికి చేరుకున్న ఆ చక్కెర పదార్థాల్లో బ్యాక్టీరియా ఉత్పన్నం అవుతుంది. దాంతో కొన్ని ఇబ్బందికరమైన లక్షణాలు కనిపిస్తాయి.

**ఇందులో రకాలు లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్‌లో మూడు రకాలు. అవి..**

**ప్రైమరీ లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ :** చిన్నప్పుడు పాలు పట్టే సమయంలో ఉత్పత్తి అయ్యే లాక్టేజ్ మోతాదు.. శిశువుల్లో పాలు మాన్పించాక అకస్మాత్తుగా బాగా తగ్గిపోతుంది. దాంతో వాళ్లు పెరిగి పెద్దయ్యాక పాలు, పాల ఉత్పాదనల్ని సరిగ్గా జీర్ణం చేసుకోలేరు. సెకండరీ లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ : ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి తగ్గాక.. ఒకవేళ చిన్నపేగుల్లో లాక్టేట్ ఉత్పాదన తగ్గిపోవచ్చు. ఇక మరికొందరిలో ఏదైనా సమస్య వచ్చి, చిన్నపేగుల ప్రాంతంలో శస్త్రచికిత్స జరిగినప్పుడు కూడా ఇదే జరగవచ్చు. ఇలా వచ్చిన సమస్యను 'సెకండరీ లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్' అంటారు. ఇలా జరిగినప్పుడు కనిపించే లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ వల్ల పేగుల్లో బ్యాక్టీరియా విపరీతంగా పెరగడం, సీలియాక్ డిసీజ్, క్రోన్స్ డిసీజ్ వంటి జబ్బులకు దారితీయవచ్చు.

కంజెనిటల్/ డెవలప్‌మెంటల్ లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ : కొందరు చిన్నపిల్లల్లో స్వతహాగానే పుట్టినప్పటి నుంచి లాక్టేజ్ ఎంజైమ్ సరిగా ఉత్పాదన కాదు. ఇలాంటి పిల్లల్లో పసితనం నుంచే లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ సమస్య వస్తుంది.

**లక్షణాలు :** ఈ సమస్యతో బాధపడేవారిలో పాలు తాగిన 30 నిమిషాల నుంచి రెండు గంటల్లో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. కేవలం పాలు మాత్రమే కాదు.. లాక్టోజ్ ఉన్న ఇతర ఆహారాలు తీసుకున్నా కూడా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. అవి..

**నీళ్ల విరేచనాలు (డయేరియా)**

**వికారం/ వాంతులు**

**కడుపు కండరాలు పట్టేయడం (స్టమక్ క్రాంప్స్)**

**కడుపులో గ్యాస్ నిండటం**

**చికిత్స :** సాధారణంగా ఈ సమస్య వల్ల కలిగే ఇబ్బంది కొంతసేపటి తర్వాత దానంతట అదే సద్దుమణిగి పోవచ్చు. కొంతమందిలో మాత్రం దీనివల్ల కలిగే ఇబ్బందులు చాలా ఎక్కువగా ఉంటాయి. అయితే చికిత్స కోసం ఏ సమస్య కారణంగా ఇది వచ్చిందో తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇలా ఆ సమస్య తాలూకు అసలు కారణానికి (అండర్‌లయింగ్ కాజ్‌కు) పూర్తి చికిత్స చేసినప్పుడు ఈ సమస్య కూడా తగ్గిపోవచ్చు.

**డాక్టర్‌ను ఎప్పుడు కలవాలంటే..**

ముందుగా చెప్పినట్లు సమస్య తీవ్రత తక్కువగా ఉన్నవారిలో ఇది దానంతట అదే తగ్గుతుంది. అలా కాకుండా పాలతో మాత్రమే కాకుండా ఇతర పాల ఉత్పాదనలు (డెయిరీ ప్రొడక్ట్స్) తీసుకున్నప్పుడు సమస్య తీవ్రత చాలా ఎక్కువగా ఉంటే.. డాక్టర్‌ను తప్పక సంప్రదించాల్సి ఉంటుంది.

# కార్పొరేట్.. లేడీ ఫింగర్!



ప్రకటనల రంగంలోనే తొలిసారిగా.. రెడిఫ్ ఫ్యూజన్ బ్రాండ్ సొల్యూషన్స్ అనే సంస్థ వినూత్నమైన అడ్వర్టయిజింగ్ ఏజెన్సీని ఏర్పాటుచేసింది. ఇందులో సీయీవో నుంచి కాపీ రైటర్ వరకు అందరూ మహిళలే. నిజానికి టీవీ, సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల్లో.. చాలా వరకూ మహిళలకు సంబంధించిన ఉత్పత్తులే ఉంటాయి. ఆయా ప్రకటనల లక్ష్యం కూడా మహిళలే. కానీ ఆ మాధ్యమాన్ని పురుషులే శాసిస్తున్నారు. ఈ ధోరణికి కాలం చెల్లినట్టే అంటున్నారు యాడ్ గురువులు. అడ్వర్టయిజింగ్ నిపుణురాలు తీస్తా సేన్ ఈ కార్పొరేట్ ప్రమీల రాజ్యానికి నాయకత్వం వహిస్తున్నారు. ఏజెన్సీ పేరు కూడా వినూత్నంగానే పెట్టుకున్నారు.. లేడీఫింగర్! ఇప్పటికే అమెరికా, యూకేలాంటి చోట్ల 'అందరూ మహిళలే' కాన్సెప్ట్‌తో చాలా కంపెనీలు పుట్టుకొచ్చాయి. ఒక కవి హృదయాన్ని మరో కవి మాత్రమే అర్థం చేసుకోగలడు అన్నట్టు, ఒక మహిళ అంతరంగం ఇంకో మహిళకే అర్థం అవుతుంది. దీంతో ప్రకటనల ఇతివృత్తాల ఎంపిక సులభం అవుతుంది. కానీ, పురుషాధిక్య ప్రపంచంలో ఈ మహిళా బృందం ఎంతవరకు విజయం సాధిస్తుందో చూడాలి.

# కళలతో ఒత్తిడిని గెలిచా



ఫిన్‌టెక్ సంస్థ కినారా క్యాపిటల్స్ సీయీవో హార్దిక షాకు చిత్రలేఖనం అంటే ఇష్టం. టీనేజ్‌లోనే కుంచెతో స్నేహం మొదలైంది. ఆ బంధం ఇప్పటికీ కొనసాగుతున్నది. 'ఇప్పుడిప్పుడే పర్ఫెక్షన్ కోసం ప్రయత్నిస్తున్నా. ముఖ్యంగా పోర్ట్రెయిట్స్ మీద దృష్టి పెడుతున్నా. మొదట్లో పెన్సిల్‌తో గీసేదాన్ని. ఆ తర్వాత చార్‌కోల్ ఎంచుకున్నా. ఆయిల్ పెయింటింగ్స్ కూడా అలవోకగా వేస్తున్నా. ఒత్తిడి నుంచి బయట పడటానికి కళలను మించిన మాధ్యమం లేదు' అంటారామె.

కినారా క్యాపిటల్స్‌కు తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో నూటపాతిక శాఖలు ఉన్నాయి. గత ఏడాది రూ. 2,500 కోట్ల మొత్తాన్ని చిన్న వ్యాపారులకు రుణంగా ఇచ్చింది. 'దేనికీ సులభంగా తలవంచకూడదు. ఎప్పుడూ ఓటమిని అంగీకరించకూడదు. అందుకే నేను పట్టుబట్టి కుండలు చేయడం నేర్చుకున్నా. ఇప్పుడు ఆ కుండల మీద పెయింటింగ్స్ వేస్తున్నా. మొత్తానికి మనకంటూ కొంత సమయం కేటాయించుకోవాల్సిందే' అని తోటి మహిళలకు చెబుతారు హార్దిక. ఆమె వయసు యాభై ఒకటి. రిటైర్మెంట్ ఆలోచనలు లేవు కానీ.. భవిష్యత్తు గురించి లోతుగానే ఆలోచిస్తున్నారు.

# అలంకరణకు పరిశ్రమ హోదా.. సౌందర్య సంరక్షణకు అంతర్జాతీయ ప్రమాణాలు

అలంకరణకు ఓ పరిశ్రమ హోదా తెచ్చారు. సౌందర్య సంరక్షణకు అంతర్జాతీయ ప్రమాణాలు జోడించారు. సామాన్యులను సెలెబ్రిటీలుగా మార్చారు. సెలెబ్రిటీలను స్టార్స్‌గా మెరిపించారు. వేలమంది మహిళలకు ఉపాధి శిక్షణనిచ్చి.. సమాజంలో నిలువగలమనే, గెలువగలమనే ఆత్మవిశ్వాసం నింపారు. కష్టాలకు, కన్నీళ్లకు తావులేని అందమైన సమాజమే తన లక్ష్యమని చెబుతారు 'మిర్రర్స్ లగ్జరీ సెలూన్స్' అధినేత్రి గూడపాటి విజయలక్ష్మి. అందానికి అద్దంతో అనుబంధం ఎక్కువ. కష్టపడేవారికే విజయం సొంతమవుతుంది. ఈ రెండు అంశాలే.. విజయలక్ష్మిని మునుముందుకు నడిపిస్తున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ నెల్లూరు జిల్లా వాకాడులో పుట్టిందామె. చదువుకునే రోజుల్లోనే ఏదైనా సాధించాలనే కసి ఉండేది. అదే స్కూల్ చాంపియన్‌ను చేసింది. అప్పటికి తనకు తెలిసినవి రెండే.. చదువు, క్రీడలు. చదువు ఓ సమస్యే కాదు. తను ఏకసంథాగ్రాహి. క్రీడలంటారా? మైదానంలో దిగితే శివంగే. లాంగ్‌జంప్‌లో ప్రతి ప్రయత్నం ఓ రికార్డే. ఖోఖోలో ప్రత్యర్థి జట్టుకు చెమటలు పట్టించేది. తనే కాదు, తనవాళ్లూ అందరికంటే ముందుండాలని తాపత్రయపడేది. సాయంత్రం బడి నుంచి వచ్చాక తమ్ముడికి, చెల్లికి ప్రత్యేకంగా ట్యూషన్లు చెప్పేది.



**కొత్త మలుపు**

విజయలక్ష్మి చదువు పూర్తయ్యే సమయానికి.. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో అనేక మలుపులు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానం నేదురుమల్లి జనార్దన్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. ఆ నిర్ణయం విజయలక్ష్మి జీవితాన్నీ మలుపు తిప్పింది. కొత్త సీఎం తమ కుటుంబానికి ఆత్మీయుడు కావడంతో శుభాకాంక్షలు చెప్పడానికి హైదరాబాద్ వచ్చిందామె. నేరుగా చీఫ్ మినిస్టర్ బంగ్లాకు వెళ్లింది. ఆ సమయంలో పక్కనే ఉన్న స్టార్ ప్రొడ్యూసర్ రామానాయుడుకు 'మా ఊరమ్మాయే. మీ దగ్గర ఏదైనా పని ఉంటే తీసుకోండి. చాలా టాలెంటెడ్' అని పరిచయం చేశారు నేదురుమల్లి. తిరిగి వెళ్లేటప్పుడు తన విజిటింగ్ కార్డు ఇచ్చి.. 'ఆఫీస్‌కు వచ్చి కలవమ్మా' అని చెప్పారు రామానాయుడు. మరుసటిరోజే వెళ్లి కలిసింది. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉద్యోగం ఇచ్చారాయన. సినిమా పరిశ్రమ అంటేనే ఓ రంగుల లోకం. ఆ తళుకుల జగత్తును దగ్గర నుంచీ చూసిందామె. వెండితెర మేడిపండు చందమని తెలియడానికి ఎంతో సమయం పట్టలేదు. దీంతో, ఆ పరిశ్రమతో సంబంధం లేని వ్యక్తిని పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది. అలా ప్రవీణ్ గూడపాటి ఆమె జీవితంలో ప్రవేశించారు.

**లక్ష్యం వైపుగా**

అప్పటి వరకూ తారల మధ్య తారలా వెలిగిన విజయలక్ష్మి పెండ్లి తర్వాత నాలుగు గోడలకే పరిమితమైంది. ఇల్లు, సంసారం.. ఇదే జీవితంగా మారిపోయింది. అంతలోనే అంతర్మథనమూ మొదలైంది. 'పెళ్లయితే ఇంతేనా? కలల ప్రయాణం ఆగిపోవాల్సిందేనా? నేను సాధించాల్సింది ఏమీ లేదా? ప్రతిదానికీ ఇంకొకరి మీద ఆధారపడి బతకాల్సిందేనా?' అని తనను తాను ప్రశ్నించుకుంది. ఆ ప్రశ్నలే ఆమెకు దిశానిర్దేశం చేశాయి. అప్పటికే బాబు కడుపులో ఉన్నాడు. తనకు బ్యూటీ సెలూన్ నిర్వహణలో కొంత అవగాహన ఉండేది. దీంతో సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించుకుంది. అందం అనగానే అద్దమే మనసులో మెదులుతుంది. కాబట్టే, తన సౌందర్యశాలకు 'మిర్రర్స్ సెలూన్' అని పేరు పెట్టింది. అప్పటికే ఆమెకు సినిమా పరిశ్రమతో స్నేహ సంబంధాలు ఉండటంతో.. పెద్దపెద్ద తారలంతా తరలిరావడం మొదలైంది. జాగా సరిపోలేదు. సిబ్బందీ సరిపోలేదు. దీంతో, మిర్రర్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని అర్థమైపోయింది. లండన్, సింగపూర్, మలేషియా చుట్టొచ్చింది. అక్కడి సౌందర్య పరిశ్రమను అధ్యయనం చేసింది. ఆ స్ఫూర్తితోనే 'మిర్రర్స్'ను భారత్‌లోనే టాప్ లగ్జరీ సెలూన్ బ్రాండ్‌గా తీర్చిదిద్దింది. ఇప్పటివరకు ఇరవై రెండు.. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. 'ఫోర్బ్స్' పత్రిక ప్రభావశీలురైన మహిళల జాబితాలో విజయలక్ష్మి ప్రస్థానాన్ని ప్రస్తావించింది.



**ఎందరికో ఉపాధి**

ఇప్పటికే హైదరాబాద్‌లోని మాదాపూర్, గచ్చిబౌలి, బంజారాహిల్స్ ప్రాంతాల్లో మిర్రర్స్ లగ్జరీ సెలూన్స్ ఉన్నాయి. త్వరలోనే కోకాపేటలో కూడా ప్రారంభించనున్నారు. 'మిర్రర్స్ అకాడమీ ఆఫ్ హెయిర్ అండ్ బ్యూటీ' పేరుతో విజయలక్ష్మి ప్రారంభించిన శిక్షణ సంస్థ వేలమందికి అలంకరణ పాఠాలు బోధించింది. విదేశాల నుంచి సైతం శిక్షణ కోసం వస్తున్నారు. 'పట్టుదలతో కష్టపడితే ఎవరైనా విజయం సాధించవచ్చు. కాకపోతే ఏ దశలోనూ అలసిపోవద్దు, ఎక్కడా ఆగిపోవద్దు. గెలిచే వరకు పట్టుపట్టాలి. ఒకసారి గెలిస్తే సరిపోదు. మళ్లీమళ్లీ గెలవాల్సిందే. ఇంకా ఇంకా కష్టపడాల్సిందే. నేను అనుసరించే సూత్రం ఇదే.

మనకు సమాజం చాలా ఇచ్చింది. మనం కూడా సమాజానికి తిరిగివ్వాలి. అందుకే నా వంతుగా క్యాన్సర్ బాధితులకు సాయం చేస్తున్నా. త్వరలోనే ఒక వృద్ధాశ్రమాన్ని దత్తత తీసుకుందామని అనుకుంటున్నా. ఇదంతా నా మనసు చెప్పిందనే చేస్తున్నా. గుర్తింపు కోసమో, ప్రచారం కోసమో కాదు. నాకు ఎలాంటి ఎన్జీవోలూ లేవు. తోటివారికి సాయం అందితే చాలనుకునే వ్యక్తిత్వం నాది' అంటుంది విజయలక్ష్మి.

# గుజరాత్‌ను చిత్తుగా ఓడించిన రాజస్థాన్

















బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్‌లోకే అన్నట్టు ఆడాడీ యువకెరటం. రషీద్ ఖాన్ బౌలింగ్‌లో సిక్సర్‌తో సెంచరీకి చేరువయ్యాడు. ఐపీఎల్‌లో వంద కొట్టిన పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. 35 బంతుల్లోనే శతకం బాదేసిన వైభవ్.. ఈ లీగ్ చరిత్రలోనే రెండో వేగవంతమైన సెంచరీ సాధించాడు.

ఐపీఎల్ 18వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన రాజస్థాన్ రాయల్స్(భారీ విజయం సాధించింది. 210 పరుగుల లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే ఛేదించింది. 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(101) విధ్వంసక సెంచరీతో కదంతొక్కగా.. యశస్వీ జైస్వాల్(70 నాటౌట్) సూపర్ హాఫ్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. తొలి వికెట్‌కు 166 రన్స్ జోడించి రాజస్థాన్ విజయానికి పునాది వేశారిద్దరు. వైభవ్ ఔటయ్యాక రియాన్ పరాగ్(32 నాటౌట్) ధనాధన్ ఆడి లాంఛనం ముగించాడు. దాంతో, 18వ ఎడిషన్‌లో మూడో విజయం సాధించిన రాజస్థాన్ పాయింట్ల పట్టికలో సన్‌రైజర్స్‌ను కిందికి నెట్టేసి 8వ స్థానానికి ఎగబాకింది.ఐపీఎల్ చరిత్రలో రాజస్థాన్ రాయల్స్‌కు కలకాలం గుర్తిండిపోయే రోజు ఇది. రికార్డు పుస్తకాల్లో 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ(101) పేరు నిక్షిప్తమైంది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లను ఉతికారేస్తూ సిక్సర్లతో రెచ్చిపోయిన ఈ చిచ్చరపిడుగు మెరుపు శతకంతో చెలరేగాడు. దాంతో, రాజస్థాన్ కొండంత లక్ష్యాన్ని అలవోకగా కరిగించి 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది.%గుజరాత్ నిర్దేశించిన 210 పరుగుల ఛేదనలో రాజస్థాన్ ఓపెనర్లు దూకుడుగా ఆడారు. జోస్ బట్లర్ క్యాచ్ వదిలేయడంతో 2 పరుగలు వద్ద యశస్వీ జైస్వాల్(31)కు లైఫ్ లభించింది. తొలి మ్యాచ్‌లోనే ఆకట్టుకున్న వైభవ్.. సిరాజ్ వేసిన మొదటి ఓవర్లో సిక్సర్ బాదేశాడు. ఆ తర్వాత ఇషాంత్‌కు చుక్కలు చూపిస్తూ.. వరుసగా 6, 6, 4.. ఆ తర్వాత 6, 4 బాదాడు. వాషింగ్టన్ సుందర్ వేసిన 4వ ఓవర్లో 6, 6, 4 కొట్టి ఐపీఎల్‌లో తొలి అర్ధ శతకం సాధించాడీ 14 ఏళ్ల కుర్రాడు.
అర్ధ శతకం తర్వాత కూడా వైభవ్ జోరు తగ్గించలేదు. ఇషాంత్, సుందర్, రషీద్..



## పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 10 | 7 | 3 | 0 | 14 | 0.52 |
| గుజరాత్ | 8 | 6 | 2 | 0 | 12 | 1.10 |
| ముంబై | 10 | 6 | 4 | 0 | 12 | 0.88 |
| ఢిల్లీ | 9 | 6 | 3 | 0 | 12 | 0.48 |
| పంజాబ్ | 9 | 5 | 3 | 1 | 11 | 0.17 |
| లక్నో | 10 | 5 | 5 | 0 | 10 | -0.03 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 1 | 7 | 0.21 |
| హైదరాబాద్ | 9 | 3 | 6 | 0 | 6 | -1.10 |
| రాజస్థాన్ | 9 | 2 | 7 | 0 | 4 | -0.62 |
| చెన్నై | 9 | 2 | 7 | 0 | 4 | -1.30 |

నోట్: జ-జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

## ఎడిటోరియల్

# 'ఉపాధి'కి ఉరి

%గ్రామాల్లో పేదలకు ఏడాదిలో కనీసం వంద రోజులు పని కల్పించే ఉద్దేశంతో యుపిఎ-1 హయాంలో తీసుకొచ్చింది. మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎం.ఎన్.ఆర్.ఇ.జి.ఎ-నరెగా). అటువంటి బృహత్తర చట్టం అమలులో లెక్కకు మించిన లోపాలను ఎత్తిచూపింది పార్లమెంటరీ స్థాయి సంఘం. చట్టం హామీ ఇచ్చిన ప్రయోజనాలు కార్మికులకు దక్కడం లేదని గుర్తించింది. నరెగాపై సమగ్ర సమీక్ష కోసం జాతీయ స్థాయిలో స్వతంత్రతతో కూడిన పారదర్శక సర్వే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కార్మికుల సంతృప్తి, వేతనాల్లో జాప్యం, భాగస్వామ్యం పోకడలు, ఆర్థిక అవకతవకల దృష్టి కోణంలో సర్వే చేయాలని సూచించింది. చట్టం అమల్లో ఎదురవుతున్న సవాళ్లనూ పరిశీలించాలంది. కార్మికుల పనిదినాలు వంద నుంచి 150 రోజులకు, దినసరి వేతనం 400 రూపాయలకు పెంచాలని తెలిపింది. కాంగ్రెస్ ఎంపి సప్తగిరి శంకర్ ఉల్కా నేతృత్వంలో గ్రామీణాభివృద్ధిపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ మోడీ పదేళ్ల జమానాలో ఉపాధి హామీపై మచ్చుకు పరిశీలించి ఇచ్చిన రిపోర్టు ఇది. నరెగాను మోడీ ప్రభుత్వం ఒక క్రమ పద్ధతిలో నిర్వీర్యం చేస్తోందని నివేదికతో స్పష్టమైంది. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే బిజెపి కుయుక్తులపై ఇంతకాలం వెల్లడవుతున్న ఆందోళనలను ఆ రిపోర్టు నిర్ధారించింది.ఆది నుంచీ నరెగాపై మోడీ ప్రభుత్వానిది మొసలి కన్నీరేనని దాని చేష్టలే తెలుపుతాయి. బడ్జెట్ కేటాయింపుల నుంచి అమలు వరకు ప్రతిదీ చట్టాన్ని దెబ్బతీసేదిగానే ఉన్నాయి. బడ్జెట్ ప్రతిపాదనలనే తీసుకుంటే దశాబ్ద కాలంలో ఏనాడూ డిమాండ్‌కనుగుణంగా లేవు. ఏవో కొన్ని నిధులను చూపించడం, వాటితోనే కాలక్షేపం చేయడం, చివరాఖరులో ఎంతో కొంత విదిలించడం పరిపాటిగా మారింది. కరోనా సమయంలో మాత్రమే ఖర్చు రూ.లక్ష కోట్లు దాటింది. పట్టణాలకు వలసలు వెళ్లిన లక్షలాది కార్మికులు తమ ఊళ్లకు వెనక్కి వచ్చిన సందర్భంలోని ఆ ఖర్చు సైతం నాటి డిమాండ్‌తో పోల్చితే చాలా చాలా తక్కువ. అదేంటంటే, బడ్జెట్‌లో నిధులు చూపించాల్సిన అవసరం లేదని, డిమాండ్ పెరిగితే ఆటోమేటిగ్గా నిధులు పెంచుతామన్న మోడీ సర్కారు మాట ఒట్టి బూటకం. సకాలంలో నిధులివ్వని కారణంగా పనులు నిలిచిపోయిన ఉదంతాలెన్నో. రాష్ట్రాలకు నిధుల విడుదలలో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని పార్లమెంట్ సాక్షిగా నిరూపణ అయింది. 2025 మార్చి చివరినాటికి కేంద్రం రాష్ట్రాలకు అక్షరాలా 26 వేల కోట్ల రూపాయలు బకాయి పడింది. వాటిలో కూలీల వేతనాలు రూ.15 వేల కోట్లు. 2024-25లో ఉపాధి హామీకి ప్రతిపాదించింది రూ.86 వేల కోట్లు కాగా అంత పెద్ద మొత్తంలో నెలల పర్యంతం నిధులివ్వకుండా జాప్యం చేసి పేదలను ఉద్ధరిస్తామనడం వంచన కాదా?ఉపాధి హామీ ప్రధాన లక్ష్యం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పన. ఆ లక్ష్యాన్ని మోడీ సర్కారు క్రమంగా పక్కదారి పట్టించే ఎన్నో చర్యలు చేపట్టింది. బిజెపి, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాలు వాటిని పుణికిపుచ్చుకుంటున్నాయి. వ్యవసాయానికి అనుసంధానం పాట పాడుతున్నాయి. ఖర్చు లేని ప్రకృతి వ్యవసాయానికి, సేంద్రీయ వ్యవసాయానికి లింక్ పెడుతున్నాయి. నరెగా పనుల్లో భారీ యంత్రాల వినియోగం చట్ట విరుద్ధం. అపరిమితమైన మెటీరియల్ కాంపొనెంట్ సైతం చట్ట విరుద్ధం. అవన్నీ యధేచ్ఛగా సాగిపోతున్నాయి. పని లేని రోజుల్లో పని కల్పన కోసం గ్రామాల్లో జాబ్ కార్డుల జారీ సక్రమంగా లేదు. జాబ్ కార్డు పొందిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్న నిబంధన అమలు కావట్లేదు. వేతనాల జాప్యానికి పరిహారం విషయంలోనూ తప్పించుకొనే ఉదంతాలే ఎక్కువ. ఇటీవలి కాలంలో లక్షలాది జాబ్‌కార్డులు రద్దు చేస్తున్నారు. ఆర్థిక అవకతవకలు సరేసరి. ఈ చర్యలన్నీ ఉపాధి హామీ లక్ష్యాన్ని పలచన చేసేవి. ఉపాధి లేని కార్మికులకు అన్యాయం చేసేవి. కార్మికుల్లో వందకు వంద రోజులూ పని దొరికే వారిని, దినసరి వేతనం రూ.300 దొరికే వారిని వేళ్లపై లెక్కించొచ్చు. పట్టణాల్లో, గ్రామాల్లో భారీ యంత్రాల విచ్చలవిడి వినియోగం, ఆర్థిక మాంద్యం, వ్యవసాయ సంక్షోభం వలన పనుల కోసం డిమాండ్ పెరుగుతోంది. కరువొస్తే తీవ్రత ఇంకా ఎక్కువ. అందుకే ఏడాదిలో 200 రోజుల పని, దినసరి కూలి 600 కావాలన్న డిమాండ్ బలంగా ముందుకొస్తోంది. అర్బన్‌లోనూ ఉపాధి హామీ కావాలన్న ఆకాంక్ష వెల్లడవుతోంది.

# ఐఐటిల్లో ఉపాధి అవకాశాలు




దేశంలోని 23 ఐఐటిల్లో క్యాంపస్ సెలక్షన్లు తగ్గడంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తాజా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటిల్లోనూ ప్లేస్‌మెంట్లు గణనీయంగా తగ్గాయని ఈ నివేదిక తెలిపింది. 2021-22లో 98.54 శాతం ఉన్న ప్లేస్‌మెంట్లు 2023-24 నాటికి 79.88 శాతానికి తగ్గాయి. ఇందులో దేశ రాజధాని ఢిల్లీ ఐఐటి లో 15 శాతం, ఆర్థిక రాజధాని ముంబయిలో 12.72, మద్రాసులో 12.42, కాన్పూర్‌లో 11.15 శాతం మేర తగ్గిపోవడం తీవ్ర ఆందోళనకరమని నివేదిక అభిప్రాయపడింది. ఈ పరిస్థితి కొత్తగా స్థాపించిన ఐఐటిలకే పరిమితం కాలేదని, 2015కు ముందు నుండి వున్న వాటిల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ప్రకటించింది. పరిస్థితిని వివరించిన స్టాండింగ్ కమిటీ ఇది సాధారణమేనంటూ, ఈ క్షీణతను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టాలంటూ సూచనలతో సరిపుచ్చింది. దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యాలయాలుగా వున్న ఐఐటి, ఎన్ఐటి లలో చదువుకున్న వారికే ఉద్యోగాలు రాకపోతే ఇతర ఇంజనీరింగ్ విద్యార్థుల పరిస్థితి ఏమిటి? ఈ పరిస్థితులకు కారణాలు ఏమిటి? యువతకు ఉపాధి చూపే పరిష్కారాలు ఏమిటని కేంద్ర పాలకులు ఆలోచించడంలేదు. మరోవైపు ఐటి రంగంలో కొత్త కంపెనీలు రావడంలేదని, వున్నవే మూత పడుతున్నాయని సేవా రంగాల రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజా నివేదిక ప్రకటించింది. ప్లేస్‌మెంట్లు ఎందుకు లేవు? అంటే ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గడం. అవి ఎందుకు తగ్గాయంటే యూరప్, అమెరికాతోపాటు మన దేశ ఆర్థిక వ్యవస్థల సంక్షోభం కారణం. సంక్షోభం ఎందుకు వచ్చిందంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం, దీనికి మూలం అత్యధికమంది ఆధారపడిన వ్యవసాయం దివాళా తీయడం. లక్షల మందికి ఉపాధినిచ్చిన ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడం, కొత్త పరిశ్రమలను స్థాపించకపోవడం, దేశీయ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించకుండా అదానీ, అంబానీలను పెంచి పోషించడం. వీటి ఫలితంగా కోట్లాది యువత నిరుద్యోగంలో కూరుకుపోతుంటే, అతి కొద్దిమంది అత్యంత సంపన్న బిలియనీర్లుగా ఎదుగుతున్నారు. ఈ వాస్తవాలను ప్రజలు గుర్తించకుండా వుండేందుకు మొన్నటి వరకు మహా కుంభమేళా, తాజాగా అమెరికా అధ్యక్షుడు మోడీని పొగిడిన వార్తలతో మీడియా హోరెత్తిస్తున్నది.1991 తర్వాత అనుసరించిన ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా ఇంజనీరింగ్ విద్యకు కొత్త క్రేజ్ వచ్చింది. ఇంజనీరింగ్ పూర్తయితే చాలు, ఐటి రంగంలో ఉద్యోగం, లక్షల వేతనం గ్యారంటీ అనే ప్రచారం పెద్ద ఎత్తున సాగింది. దీంతో ఇంజనీరింగ్ కోర్సులో చేరుతున్న విద్యార్థుల్లో అత్యధికమంది కొన్నేళ్ళుగా కంప్యూటర్స్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి విభాగాల్లో చదవడం పెరిగింది. రెండేళ్ళుగా కంప్యూటర్ సైన్స్‌లో 85 శాతం పైగా సీట్లు భర్తీ అవుతుంటే, మెకానికల్‌లో 40-45 శాతం, సివిల్‌లో 25-30 శాతం సీట్లు కూడా భర్తీ కావడంలేదు. సాంకేతిక రంగంలో పరిశోధనలు గణనీయంగా తగ్గాయి. మన రాష్ట్రంలో 2021-22 విద్యా సంవత్సరంలో 87 వేల మంది ఇంజనీరింగ్‌లో చేరితే అందులో 58 శాతం మంది కంప్యూటర్ కోర్సులు చదివారు. దానికి కారణం ఐటి రంగంలో ఉపాధి అవకాశాలతో పాటు, అధిక వేతనాలకు అవకాశాలు వుండడమే. గత రెండు దశాబ్దాలుగా మన దక్షిణాది రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ విద్య అనేది ఒక దర్జాగా మారింది. 2022 నాటికి దేశవ్యాప్తంగా 12,47,667 బీటెక్ సీట్లు వుంటే దక్షిణాది రాష్ట్రాల్లోనే 6,74,697 సీట్లు ఉన్నాయి. ఎంసీఏలో 70,065 సీట్లు వుంటే 30,812, ఎంబిఏ, పిజిడిఎం లాంటి మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించిన కోర్సుల్లో కూడా ఎక్కువ భాగం దక్షిణాది రాష్ట్రాల్లోనే వున్నాయి. అందులో కూడా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అత్యధిక భాగం వున్నాయి. గత ఐదేళ్ళుగా సంవత్సరానికి సగటున 4 లక్షల మంది విదేశీ విద్యకు వెలుతుంటే అందులో దక్షిణాది రాష్ట్రాల నుండి 2.8 లక్షల మంది ఉన్నారని ఏఐసిటిఇ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి) అధ్యయనంలో తేలింది.టి లో తమ పిల్లల భవిష్యత్ బాగుటుందనే ఆశతో లక్షల రూపాయలు ఖర్చు చేసి తల్లిదండ్రులు, తీవ్ర ఒత్తిళ్ళతో పిల్లలు కష్టపడుతున్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఆభరణంగా పిలవబడిన ఐటి రంగం మన దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారింది. 2004లో ఆరు లక్షల మంది సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పొందుతుంటే నేడు సుమారు పది లక్షలకు పైగా పెరిగింది. ఈ రంగం నుండి దేశ ఆర్థిక వ్యవస్థకు 1990లో 197 మిలియన్ల ఆదాయం రాగా, 2020 నాటికి 8,000 మిలియన్లకు పెరిగింది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశ జిడిపిలో సేవా రంగం వాటా 55 శాతం వుంటుందని పాలకులు అంచనా వేశారు. అయితే గత మూడు సంవత్సరాల నుండి ఈ రంగం తీవ్ర సవాళ్ళను ఎదుర్కొంటున్నది. ప్రపంచ ఐటి అవుట్ సోర్సింగ్‌లో మన దేశం కీలక స్థానంలో వుందని ఇన్నాళ్ళూ గొప్పగా చెప్పుకున్నాం. మొదట్లో ఐటి రంగం కాల్ సెంటర్లకే పరిమితం అయ్యింది. క్రమంగా ఆరోగ్య సంరక్షణ, విద్య, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసులు, ఫైనాన్స్, వినోదం ఇలా అనేక రంగాలకు ఈ సేవలు విస్తరించాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం 6-8 శాతం మాత్రమే ఐటి రంగం వృద్ధి అయ్యే అవకాశం వుందని సేవ రంగాల రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజాగా అంచనా వేసింది. గత ఐదు సంవత్సరాల్లో కొత్తగా స్థాపించబడిన ఐటి కంపెనీల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా పార్లమెంట్‌లో ప్రకటించింది.

2020లో 16,338 ఐటి కంపెనీలు వుంటే 2025 నాటికి 2,419 కి అంటే 90 శాతానికి తగ్గడం దేశీయ ఐటి రంగం పట్ల ఆశలతో వున్న కోట్లాది యువతను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. తాజాగా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ఆధారంగా కార్పొరేట్ దగ్గిజాలుగా పిలవబడుతున్న ఇన్ఫోసిస్, విప్రో వంటి కంపెనీలకు కేంద్రంగా వున్న బెంగళూరులో కొత్త ఐటి కంపెనీలు రావడంలేదు. కర్ణాటకలో 2020లో కొత్త ఐటి కంపెనీలు 2,544 స్థాపించగా, 2025 మార్చి నాటికి 212కు, మహారాష్ట్రలో 2,483 నుండి 375కు, తెలంగాణలో 2,077 నుండి 233 తగ్గాయని మంత్రితత్వశాఖ నివేదిక తెలిపింది. ఇది కేవలం కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాలేదని, దేశమంతటా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ప్రకటించింది. కొత్త సంస్థలు రాకపోగా వున్నవి మూత పడడం ఈ రంగాన్ని మరింత కలవరపరుస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో 2,300 కంపెనీలు మూతపడ్డాయి. వీటిలో మహారాష్ట్రలో 459, కర్ణాటకలో 440 మూతపడడం ఈ రంగంలో వున్న సంక్షోభానికి పరాకాష్ట. 2023 ఆర్థిక సంవత్సరంలో 2.40 లక్షల మందికి ఐటి రంగం ఉపాధి కల్పించగా, 2024 నాటికి ఇందులో 40 శాతం అంటే లక్ష మందికి కూడా ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయింది. దేశంలోని ఐదు పెద్ద ఐటి కంపెనీల్లో 21,838 మంది ఉద్యోగాలను కోల్పోయినట్లు మంత్రతత్వ శాఖ నివేదిక తెలిపింది. ఐటి ఉద్యోగాలు తగ్గడమంటే దానితో ముడిపడిన ఈ అన్ని రంగాలు కష్టాల్లో వున్నట్లే. అందుకే క్యాంపస్ నియామకాలు తగ్గిపోతున్నాయి. ఎంపికైన వారికి సంవత్సరాలుగా ఉద్యోగాలు ఇవ్వడంలేదు. పనిలో వున్నవారికి వేతనాల పెంపుదల నామమాత్రంగా జరుగుతున్నది. ఇదిలా వుండగా 18 గంటల పనిదినం కావాలని, ఆదివారం శెలవు ఎందుకని ఐటి యాజమాన్యాలు బహిరంగంగానే ప్రకటిస్తున్నాయి. దీంతో ఐటి ఉద్యోగుల్లో ఆందోళన పెరిగింది. ఇటీవల బెంగళూరులో వేలాది టెకీలు రోడ్డు మీదకొచ్చి 'మేము బానిసలం కాదు, మాకు కుటుంబాలు వున్నాయి' అని గర్జించారు.

2025లో ప్రపంచ ఆర్థికాభివృద్ధి రేటు 3.2 శాతానికి మించి వుండదని, అభివృద్ధి చెందిన యూరప్ దేశాలతో పాటు, అమెరికా 1 నుండి 1.78 శాతానికి మించి అభివృద్ధి సాధించలేవని ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు అంచనా వేశాయి. 46 దేశాల అభివృద్ధి మరింత కనిష్టంగా వుంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా 13 శాతం మంది యువజనులు అంటే 6 కోట్ల 49 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే సంపదలో కార్మికుల వాటా పెద్ద ఎత్తున తగ్గింది. ప్రపంచ జనాభాలో 300 కోట్ల మంది దారిద్ర్యరేఖ కంటే దిగువన జీవిస్తున్నారు. మన దేశంలో వ్యవసాయం, తయారీ రంగాలు గత రెండు దశాబ్దాలుగా సంక్షోభంలో వున్నాయి. నోట్ల రద్దు, కోవిడ్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీశాయి. పదకొండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి దగ్గర ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన ఆర్థిక ప్రణాళిక లేదు. మతాన్ని, రాజకీయాలను మిళితం చేసి ప్రజల ఐక్యతను చీల్చి అధికారంలో కొనసాగడం, అధికార బలంతో కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెట్టడం వారి విధానంగా వుంది. ఈ విధానాలనే మన రాష్ట్రంలో గతంలో జగన్ మోహన్ రెడ్డి, నేడు చంద్రబాబు కూటమి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. కూటమి నేతలు పి4 పేరుతో దాతల సహాయంతో పేదరికాన్ని నిర్మూలిస్తామని ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉన్నత విద్యావంతులైన యువత వాస్తవాలను గుర్తిస్తారు, దేశాభ్యుదయానికి సరైన బాటలు వేస్తారు.

# స్మార్ట్ మీటర్లతో ప్రజలకు భారం



రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించాలంటే వినియోగదారుని అనుమతి కావాలి. అయితే అందుకు భిన్నంగా కరెంటు వాళ్లమని చెప్పుకుని షాపుల వద్దకు వెళుతున్నారు. మీటరు మారుస్తున్నామని చెప్పి ప్రస్తుతం ఉన్న మీటరును తొలగించి దాని స్థానంలో స్మార్ట్ మీటరు బిగించి వెళ్ళిపోతున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించినవారు అదానీ మనుషులని, ఆ స్మార్ట్ మీటర్లు అదానీ కంపెనీకి చెందినవన్న విషయాలు వారికి తెలియదు. ఇది విద్యుత్ వినియోగదారులను మోసగించటమే.

స్మార్ట్ మీటర్లు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందివనేనని భ్రమింపచేయటం కోసం మీటరు పైన రక్షణగా బిగించే ప్లాస్టిక్ షీల్డ్ మీద తమ పంపిణీ సంస్థ పేరు ముద్రించుకుంటున్నారు. ఉదాహరణకు ఎ.పి.సి.పి.డి.సి.ఎల్ పరిధిలో బిగించే స్మార్ట్ మీటర్ల షీల్డ్ పైన ప్రాపర్టీ ఆఫ్ ఎ.పి.సి.పి.డి.సి.ఎల్ అని, ఎస్.పి.డి.సి.ఎల్ పరిధిలో బిగించే స్మార్ట్ మీటర్ల షీల్డ్ పైన ప్రాపర్టీ ఆఫ్ ఎస్.పి.డి.సి.ఎల్ అని ముద్రిస్తున్నారు. నిజానికి ఈ స్మార్ట్ మీటర్లు విద్యుత్ పంపిణీ సంస్థకు చెందినవి కావు. అవి అదానీ కంపెనీవి. ఈ మీటర్లను విద్యుత్ పంపిణీ సంస్థలు కొనలేదు. డి.బి.ఎఫ్.ఒ.ఒ.టి పద్ధతి కింద అదానీకి అప్పజెప్పారు. ఈ పద్ధతి కింద వారే ఈ స్మార్ట్ మీటర్లకు డిజైన్ చేస్తారు. వారే తయారు చేస్తారు. వారే పెట్టుబడి పెడతారు. మీటర్లు వారి యాజమాన్యంలోనే ఉంటాయి. వారే వాటిని పని చేయిస్తారు. చివరలో వారు పంపిణీ సంస్థలకు బదిలీ చేస్తారు. దీనిని బట్టి ఈ మీటర్ల డిజైన్ మొదలు నిర్వహణ వరకు మొత్తం అదానీ కంపెనీయే చేస్తుందని స్పష్టం అవుతుంది. స్మార్ట్ మీటర్లను గురించి సమాచార హక్కు చట్టం కింద అడిగినపుడు విద్యుత్ పంపిణీ సంస్థలు కూడా తాము స్మార్ట్ మీటర్లను కొనలేదని ధృవీకరించాయి. అందువలన స్మార్ట్ మీటర్లు అనేవి విద్యుత్ పంపిణీ సంస్థల ఆస్తి కాదు. ఎవరు పెట్టుబడి పెట్టి తయారు చేసి నిర్వహిస్తారో వారి ఆస్తి. ఇప్పుడు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లు అదానీ ఆస్తి. కనుక షీల్డ్ మీద తమ ఆస్తి అని ముద్రించటం వినియోగదారులను మభ్యపెట్టటం కోసమే.పని చేస్తున్న మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు ఎందుకు బిగిస్తున్నారు? ఇది ప్రతి వినియోగదారుడు వేసుకోవలసిన ప్రశ్న. భారత దేశంలో విద్యుత్ రంగంలో సంస్కరణల అనంతరం విద్యుత్ ఉత్పత్తిలోకి ప్రైవేటు సంస్థలను అనుమతించారు. కాని విద్యుత్ పంపిణీలోకి ప్రైవేటు సంస్థలను అనుమతించలేదు. మోడీ సర్కారు వచ్చిన తర్వాత విద్యుత్ పంపిణీ సంస్థలను కూడా ప్రైవేటీకరించటానికి నిర్ణయించింది. దీనికి అనుగుణంగా "విద్యుత్ సవరణ చట్టం 2022" పేరుతో ఒక బిల్లును 2022 ఆగస్టు 8న పార్లమెంటులో ప్రవేశ పెట్టి అదే రోజున స్టాండింగ్ కమిటీకి పంపించారు. అప్పటి నుండి ఆ బిల్లు స్టాండింగ్ కమిటీ వద్దనే ఉన్నది.మొదటి సవరణ ప్రకారం ఒకే ప్రదేశంలో అనేకమంది పంపిణీదారులకు లైసెన్సులు ఇస్తారు. ఇప్పటివరకు మనకు విద్యుత్ పంపిణీ చేస్తున్న ఎ.పి.సి.పి.డి.సి.యల్, ఎ.పి.ఎస్.పి.డి.సి.యల్, ఎ.పి.ఇ.పి.డి.సియల్ పూర్తిగా ప్రభుత్వ రంగ సంస్థలు. ప్రైవేటు సంస్థలు లేవు. ఈ చట్ట సవరణ జరిగితే ఈ ప్రాంతాలలో ప్రభుత్వ సంస్థలతోబాటుగా ప్రైవేటు సంస్థలు కూడా లైసెన్సులు పొంది విద్యుత్ పంపిణీ చేస్తాయి. మరో సవరణ ప్రకారం లైసెన్సు పొందిన వారందరూ లైన్లు వేయకుండా, ముందుగా ఎవరిలైన్లు ఉంటాయో వారు, తర్వాత లైసెన్సులు పొందిన వారిని కూడా ఆ లైన్లను వాడుకోనివ్వాలి. ఇక్కడ ముందుగా లైన్లు వేసుకున్నది ప్రభుత్వ రంగంలోని పంపిణీ సంస్థలు. ఇవి ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసినవి, ఇప్పుడు వీటిని లైసెన్సు పొందిన ప్రైవేటు సంస్థలకు కూడా పంచి ఇవ్వాలి. దీనివలన ప్రైవేటు సంస్థలకు వేరే లైన్ల కోసం పెట్టుబడి పెట్టనవసరంలేదు. ముందుగా ఏ పంపిణీ సంస్థ అయితే విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో ఒప్పందం చేసుకుని ఉంటుందో ఆ ఒప్పందాలను తరువాత లైసెన్సులను పొందిన వారికి కూడా భాగం పంచి ఇవ్వాలన్నది ఇంకొక సవరణ. సహజంగానే ప్రభుత్వ రంగంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు ముందుగా ఒప్పందం చేసుకుని ఉంటాయి. వాటిని తరువాత లైసెన్సు పొందిన ప్రైవేటు సంస్థలకు కూడా ఇవ్వాలి. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటీకరించటం కోసమే "విద్యుత్ సవరణ చట్టం 2022" తీసుకొస్తున్నారని స్పష్టం అవుతున్నది. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటీకరించటానికి ప్రాథమిక చర్యగా ఈ స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టారు.పీక్ సమయం పేరుతో అధిక చార్జీలు వసూలు చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలు నిర్ణయించాయి. ఏ సమయానికి ఎంత విద్యుత్ వాడుకున్నారన్నది రికార్డు చేసే సదుపాయం ఈ స్మార్ట్ మీటర్లలో ఉన్నది. ఇది ప్రజలకు భారం అవుతుంది. %-% పోస్ట్ పెయిడ్ విధానంలో బిల్లు చెల్లించటానికి 15 రోజులు గడువు ఉంటుంది. బిల్లు చెల్లించడానికి, చెల్లించకపోతే పెనాల్టీతో చెల్లించటానికి, అప్పటికీ చెల్లించకపోతే, కనెక్షన్ కట్ చేయటానికి నిర్దిష్టమైన గడువు ఉంటుంది. బిల్లు చెల్లించటానికి వినియోగదారునికి వెసులుబాటు ఉంటుంది. ఈ గడువు వరకు వినియోగదారునికి విద్యుత్ సరఫరా గ్యారెంటీ ఉంటుంది. ఇవి ప్రీ పెయిడ్ మీటర్లు. ప్రీ పెయిడ్ విధానంలో అది ఉండదు. ఎప్పుడు డబ్బులు అయిపోతే అప్పుడు కనెక్షన్ కట్ అవుతుంది. %-% పరిశ్రమలు, వ్యాపార సంస్థలు లక్షలలో విద్యుత్ బిల్లులు చెల్లిస్తుంటాయి. వాడుకున్న తరువాత చెల్లించే బిల్లు నిర్దిష్టంగా ఉంటుంది. అదే మొత్తాన్ని ముందుగా ఊహించి చెల్లించాలంటే పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు వర్కింగ్ కేపిటల్ పెరుగుతుంది. %-% వర్కింగ్ కేపిటల్ భారాన్ని విద్యుత్ జనరేషన్ కంపెనీలు, డిస్కంల మీద నుండి వినియోగదారుని మీదకు నెట్టివేయబోతున్నారు. దీనివలన కొన్ని పరిశ్రమలు మూతబడతాయి. ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుంది. -వాడుకున్న తరువాత పేపరు మీద బిల్లు ఇస్తే ఎంత వాడామో, ఏ రేటు చెల్లిస్తున్నామో నిర్దిష్టంగా ఉంది. ప్రీ పెయిడ్ అయితే యూనిట్‌కు ఎంత వసూలు చేస్తున్నారో వినియోగదారునికి తెలియదు. -స్మార్ట్ మీటరు ఖరీదును, దానికి అనుబంధంగా వాడే పరికరాల ఖర్చును వినియోగదారుడే భరించాలి. -సేవలు పొందిన తరువాత వినియోగదారుల నుండి చార్జీలు వసూలు చేసే విధానం నుండి, వినియోగదారుడు ముందుగానే చెల్లించి సేవలు పొందే విధానంలోనికి మార్పు చేసే ప్రక్రియే ఈ స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన. ఈ విధానం వలన అల్పాదాయ వర్గాలకు చెందిన వినియోగదారులను విద్యుత్ సరఫరాకు దూరం చేసే పరిస్థితికి దారితీసే అవకాశం ఉంది. ఈ స్మార్ట్ మీటర్లు అన్ని విధాలా నష్టం.

# శివ శక్తి రేఖ ఉండే శివాలయాలు ఏవి.. అవి ఎక్కడున్నాయంటే...







మన దేశంలోని అనేక శివాలయాలు జ్యోతిర్లింగాలతో సంబంధాలను కలిగి ఉన్నాయి. అందులోనూ రామేశ్వరం నుంచి కేదార్‌నాథ్ మధ్య ఏడు శివాలయాలున్నాయి. అవన్నీ ఒకే రేఖపై ఉండటం విశేషం. ఈ 7 శివాలయాలకు, జ్యోతిర్లింగాలకు ఉన్న సంబంధమేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

భారతదేశంలో పూర్వకాలం నుంచి ఎన్నో పురాతన ఆలయాలు ఉన్నాయి. వాటి నిర్మాణాలు, అందులో కొన్ని రహస్యాలు ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయాయి. వాటిలో అన్నింటికంటే ముఖ్యమైనవి శివాలయాలు, జ్యోతిర్లింగాలు.

ఈ దేవాలయాల్లో అనేక రహస్యాలు దాగున్నాయి. ముఖ్యంగా ఉత్తరభారతంలోని కేదార్‌నాథ్ ఆలయం నుంచి దక్షిణ భారతదేశంలోని రామేశ్వరం మధ్య లోతైన రహస్యాలున్నట్లు పెద్దలు చెబుతారు. కేదార్‌నాథ్, రామేశ్వరం రెండూ కూడా శివాలయాలే. ఈ రెండు ఆలయాల మధ్య దూరం దాదాపు 2,382 కిలోమీటర్లు. ఈ రెండు జ్యోతిర్లింగాల మధ్య ఏడు శివాలయాలున్నాయి. ఇవి కేదార్‌నాథ్, రామేశ్వరాన్ని కలుపుతాయని చాలా మంది నమ్ముతారు.

ఈ ఏడు ఆలయాలు ఒకే సరళ రేఖలో ఉండటం గమనార్హం. అంతేకాదు పంచభూతాలు(అగ్ని, నీరు, గాలి, భూమి, ఆకాశం) అని పిలిచే 5 దేవాలయాలు కూడా ఉండటం మరో విశేషం. ఈ సందర్భంగా 7 శివాలయాలు కేదార్‌నాథ్ మరియు రామేశ్వరాన్ని ఎలా కలిపాయో ఇప్పుడు తెలుసుకుందాం...

**దాదాపు 4 వేల ఏళ్ల క్రితం..**

ఈ ఏడు శివాలయాలు ఒకే సరళరేఖలో ఉండటం యాదృచ్ఛికం అయితే కాదు. ఎందుకంటే ఈ శివాలయాలు దాదాపు 4 వేల సంవత్సరాల క్రితం నిర్మించబడ్డాయి. ఈ సమయంలో ఒక ప్రదేశం అక్షాంశం, రేఖాంశాలను కొలిచేందుకు టెక్నాలజీ అందుబాటులో లేవు. అయినా కూడా ఈ ఆలయాలు స్పష్టమైన సరళ రేఖలో నిర్మించబడ్డాయి.

ఈ ఆలయాన్నీ ఒకే వరుసలో ఉన్నాయి. ఇవన్నీ వేర్వేరు సమయాల్లో స్థాపించబడినవి. అయితే ఈ ఆలయాలు ఏమైనా ప్రత్యేకమైన ఆలోచనతో నిర్మించబడ్డాయా లేదా అది కేవలం యాదృచ్ఛికంగా జరిగిందా అనేది చెప్పడం కొంత కష్టం.

అయితే ఈ ఆలయాల నిర్మాణం జరిగినప్పుడు అక్షాంశ, రేఖాంశాలను బట్టి ఏడు శివాలయాలను 'శివశక్తి రేఖ' అని పేర్లతో పిలిచారు. ఈ రేఖకు ఒక చివర ఉత్తరాన కేదార్‌నాథ్, దక్షిణాన రామేశ్వరం జ్యోతిర్లింగాలు ఉన్నాయి. ఈ శివ రేఖ ఉత్తరం నుంచి దక్షిణాన్ని కలుపుతుంది.

**కేదార్‌నాథ్ ఆలయం..**

ఉత్తరాఖండ్‌లోని రుద్ర ప్రయాగ్ జిల్లాలో కేదార్‌నాథ్ ఆలయం ఉది. ఈ ఆలయాన్ని అర్థ జ్యోతిర్లింగం అంటారు. ఈ ఆలయాన్ని జనమేజయుడు నిర్మించాడని, ఆది శంకరాచార్య పునర్నిర్మించాడని చెబుతారు. ఈ దేవాలయంలో భక్తులకు ఆరు నెలలు మాత్రమే దర్శించుకునందుకు అనుమతిస్తారు. మిగిలిన ఆరు నెలలు ఈ ఆలయ తలుపులు మూసుకునే ఉంటాయి. ఈ ఆలయం 79.0669 డిగ్రీల రేఖాంశంలో ఉంటుంది.

**కాళేశ్వరం..**

తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గోదావరి నదీ తీరాన కాళేశ్వరాలయంలో త్రిలింగదేశంగా ఈశ్వరుడు పూజలందుకుంటున్నాడు. అంటే మూడు లింగాల భూమి అని అర్థం. ఇక్కడి రెండు శివ లింగాలు శివుడు మరియు యమ చిహ్నాంగా పరిగణించబడతాయి.

**శ్రీకాళహస్తీశ్వర ఆలయం..**

ఈ దేవాలయం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోని శ్రీకాళహస్తిలో ఉంది. ఇది తిరుపతి పుణ్యక్షేత్రం నుంచి దాదాపు 40 కిలోమీటర్ల లోపు దూరంలో మాత్రమే ఉంది. ఈ దేవాలయం పంచ భూతాలలో వాయు మూలాకానికి ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం 79.6983 డిగ్రీల రేఖాంశంలో ఉంది.

**ఏకాంబరేశ్వర ఆలయం..**

ఈ ఆలయంలో పరమేశ్వరుడు భూమి మూలక రూపంలో పూజ లందుకుంటారు. ఈ శివాలయాన్ని పల్లవ రాజులు నిర్మించారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత చోళులు, విజయనగర రాజులు దీన్ని మెరుగుపరిచారు. ఈ ఆలయం 79.42'00' రేఖాంశంలో ఉంది.

**అరుణాచలేశ్వరుని ఆలయం..అరుణాచలేశ్వరుని ఆలయం..**

ఈ శివాలయాన్ని తమిళ రాజ్యానికి చెందిన చోళవంశస్తులు నిర్మించారు. ఈ ఆలయం 79.0677 డిగ్రీల రేఖాంశంలో ఉంది. ఇక్కడి శివుడిని పూజించడం వారికి అనేక శుభ ఫలితాలు కలుగుతాయని చాలా మంది నమ్ముతారు.

ఈ ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణలు చేయడం వల్ల శుభ ఫలితాలొస్తాయని పండితులు చెబుతారు. ముఖ్యంగా పౌర్ణమి తిథి వేళ ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

**నటరాజ ఆలయం..**

తమిళనాడులోని చిదంబరంలో ఉన్న ఈ శివాలయం ఖగోళ మూలాకానికి ప్రసిద్ధి చెందింది. ఇక్కడ శివుడిని నటరాజ రూపంలో కొలుస్తారు. ఈ ఆలయం 79.6935 డిగ్రీల రేఖాంశంలో ఉంది.

## ప్రతిరోజూ ఈ పనులు చేస్తే లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకోవచ్చు...!



మనలో ప్రతి ఒక్క వ్యక్తి మంచి ఆదాయం కావాలని కోరుకుంటాడు. అయితే లక్ష్మీదేవి అనుగ్రహం ఉన్న వారికి మాత్రమే వారి జీవితంలో భారీగా సంపద లభిస్తుంది. ఎందుకంటే సంపదకు దేవతగా లక్ష్మీదేవినే భావిస్తారు. హిందూ పురాణాల ప్రకారం, లక్ష్మీదేవి ఆశీస్సులు ఉండే వారికి తమ జీవితంలో ఎప్పటికీ ధనానికి, ధాన్యానికి కొరత అనేదే ఉండదు. అందుకే అందరూ లక్ష్మీదేవిని నిత్యం భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. అయితే ఆ తల్లి ఎక్కువ సమయం ఒకే చోట ఉండదు. అందుకే ఆ లక్ష్మదేవి మీ ఇంట్లో ఎక్కువ సమయం ఉండేందుకు శాస్త్రాల ప్రకారం కొన్ని పనులు చేయాలి. అప్పుడే లక్ష్మీదేవి ప్రత్యేక అనుగ్రహం మీపై ఉంటుంది. మీ ఇంట్లో ఆనందం, శ్రేయస్సు కూడా ఉంటాయి.

శాస్త్రాల ప్రకారం తులసి దేవిని లక్ష్మీ స్వరూపంగా భావిస్తారు. తులసి మొక్క ఉన్న ఇంట్లో విష్ణుమూర్తి అనుగ్రహం కచ్చితంగా ఉంటుంది. అందుకే మీ ఇంట్లో తులసి మొక్కను నాటాలి. ప్రతిరోజూ తులసి మొక్కకు పూజ చేసి నీరు సమర్పించాలి. తులసిని ఇంటికి ఈశాన్య దిశలో నాటాలి. ఆదివారం, బుధవారాల్లో తప్ప తులసి మొక్కను తాకడం వల్ల మీ శరీరం శుద్ధి అవుతుందని, రోగాలు దూరమవుతాయని చాలా మంది నమ్ముతారు. తులసి దర్శనం వల్ల పాపాలు తొలగిపోతాయి. ఈ కారణంగా మీ ఇంటి ప్రాంగణంలో తులసి మొక్కను నాటాలి. శాస్త్రాల ప్రకారం, మీ ఇంట్లో ప్రతికూల శక్తులను తొలగించడానికి ఆవు పేడతో చేసి బెరణిపై ధూపం కాల్చాలి. ఆ పొగ ఇంట్లోని ప్రతి మూలకు చేరేలా చూడండి. ఈ పనిని ప్రతి మంగళవారం, గురువారం, శనివారం రోజున చేయాలి. దీని వల్ల మీ ఇంట్లో ప్రతికూల శక్తులు తొలగిపోయి సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. అంతేకాదు మీ ఇంటి పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలి.దీపం వెలిగించాలి..లక్ష్మీదేవి ప్రత్యేక అనుగ్రహం కావాలనుకునే వారు ప్రతి శనివారం సాయంత్రం ఇంటి ప్రధాన ద్వారం దగ్గర అరలి చెట్టు కింద ఆవాల నూనె దీపం వెలిగించాలి. అరటి చెట్టు కింద దీపం వెలిగించిన తర్వాత ఆ చెట్టుకు మూడుసార్లు ప్రదక్షిణలు చేయాలి. ఇలా చేయడం వల్ల లక్ష్మీదేవి ప్రత్యేక అనుగ్రహం మీపై ఉంటుంది.శాస్త్రాల ప్రకారం, ప్రతి నెలా మీ వేతనంలో కొంత భాగాన్ని దేవుని పేరు మీద ఆలయానికి విరాళంగా ఇవ్వాలి. దీని వల్ల దేవుడి దయ మీపై ఉండేలా చేస్తుంది. మీ దగ్గర ఉన్న ఆదాయాన్ని కొంత భాగం సామాజిక సేవకు, మరికొంత భాగం ఖర్చులకు, పెట్టుబడులకు ఉపయోగించాలి. ఇలా చేయడం వల్ల మీరు లక్ష్మీదేవి ఆశీస్సులను పొందుతారు.పైన చెప్పిన నాలుగు పరిహారాలను ప్రతిరోజూ భక్తి శ్రద్ధలతో చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహాన్ని పొందొచ్చు. మీరు కూడా లక్ష్మీదేవి ప్రత్యేక ఆశీస్సులు కావాలంటే ఇవి ప్రయత్నించండి.. మంచి ఫలితాలను పొందండి...

## గమనాన్ని మార్చుకోనున్న 2025లో బృహస్పతి..

# ఈ రాశుల వారిపై ధన కనక వర్షం



జ్యోతిషశాస్త్రంలో అన్ని గ్రహాలు ఒక నిర్దిష్ట కాలం పూర్తయిన తర్వాత రాశి నుంచి మరొక రాశిలోకి అడుగు పెడతాయి. తమ రాశుల గమనాన్ని మార్చుకుంటాయి. ఈ గ్రహాల మార్పులు మొత్తం 12 రాశులను వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తాయి. ఈసారి వృషభ రాశిలో దేవ గురువు బృహస్పతి అడుగు పెట్టనున్నాడు. జ్యోతిష్య శాస్త్రంలో దేవతల గురువు అయిన బృహస్పతిని చాలా ముఖ్యమైనది గ్రహంగా భావిస్తారు. జ్ఞానం, ఉపాధ్యాయులు, పిల్లలు, అన్నయ్య, మతపరమైన కార్యకలాపాలు, పవిత్ర స్థలాలు, సంపద, దాతృత్వం, పుణ్యం, వృద్ధి మొదలైన వాటికి బాధ్యత వహించే గ్రహం గురువు. బృహస్పతి ప్రత్యక్ష కదలిక వల్ల కొన్ని రాశుల వారు విశేష ప్రయోజనాలను పొందనున్నారు.

**బృహస్పతి ఎప్పుడు ప్రత్యక్షంగా మారుతుంది?**

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఈ సమయంలో దేవగురు బృహస్పతి తిరోగమనంలో కదులుతున్నాడు. 2025 సంవత్సరంలో వృషభరాశిలో ప్రత్యక్షంగా మారతున్నాడు. బృహస్పతి ప్రత్యక్షంగా మారిన వెంటనే కొన్ని రాశుల వ్యక్తులపై సానుకూల ప్రభావాన్ని చూపనున్నాడు. కొన్ని రాశులకు చెందిన ఈ వ్యక్తులు అపారమైన సంపదను పొందవచ్చు.

మేష రాశి దేవగురువు బృహస్పతి ప్రత్యక్షంగా వృషభరాశిలో సంచరించడం వల్ల మేష రాశి వారికి అనుకూల ప్రభావం ఉంటుంది. అటువంటి పరిస్థితిలో మేష రాశి వారు ఆకస్మిక ఆర్థిక లాభం పొందవచ్చు. నిరుద్యోగులకు ఉపాధి లభించవచ్చు. ఉద్యోగస్తులు జీతాలు పెరిగే అవకాశం ఉంది. అంతేకాదు ఆర్థిక పరిస్థితి మెరుగై కుటుంబంలో సమన్వయం పెరుగుతుంది.

కర్కాటక రాశి కర్కాటక రాశి వారికి బృహస్పతి ప్రత్యక్ష కదలికల వలన శుభాలను తెస్తుంది. అటువంటి పరిస్థితిలో కర్కాటక రాశి వారికి వ్యాపారంలో పురోగతితో పాటు ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయి. భవిష్యత్తులో భారీ ప్రయోజనాలను తీసుకురాగల మూలధన పెట్టుబడికి ఇది మంచి సమయం. నిలిచిపోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంది. అంతేకాదు వైవాహిక జీవితంలో కొనసాగుతున్న సమస్యలు తగ్గుతాయి.

సింహ రాశి దేవగురువు బృహస్పతి ప్రత్యక్ష కదలిక సింహ రాశి వారికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ కాలంలో సింహ రాశికి చెందిన వ్యక్తులు ఆర్థిక లాభాలతో పాటు వృత్తి, వ్యాపారాలలో పురోగతిని పొందే అవకాశం ఉంది. ఉద్యోగంలో ప్రమోషన్‌తో పాటు కొత్త బాధ్యతలను పొందవచ్చు. వ్యక్తిగత జీవితం సాధారణంగా ఉంటుంది.

**మరిన్ని ఆధ్యాత్మిక వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి..**

నోట్ : పైన తెలిపిన విషయాలు పలువురు పండితుల సూచనలు, వారి తెలిపిన అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే.. వీటిలో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పాఠకులు గమనించాలి.

# రాశిఫలాలు




**మేషం**

శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ధనచింత ఉండదు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతాయి. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. ప్రయాణాల వల్ల లాభం చేకూరుతుంది. సమాజంలో గౌరవమర్యాదలు లభిస్తాయి. అన్నివిధాలా సుఖాన్ని పొందుతారు.

**వృషభం**

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించడం అన్నివిధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధం ఏర్పడకుండా జాగ్రత్త పడటం మంచిది. అనవసర ధనవ్యయంతో రుణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. అనారోగ్య బాధలకు ఔషధసేవ అవసరం.

**మిథునం**

ఆర్థిక పరిస్థితిలో మార్పులు ఉండవు. కొన్ని ముఖ్యమైన పనులు వాయిదా వేసుకుంటారు. మానసిక చంచలంలో ఇబ్బంది పడతారు. సోమరితనం ఆవహిస్తుంది.పిల్లలపట్ల మిక్కిలి జాగ్రత్త వహిస్తారు. మంచి అవకాశాలను కోల్పోతారు.

**కర్కాటకం**

ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడుతాయి. నూతన గృహకార్యాలపై శ్రద్ధవహిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలు అధికమవుతాయి.

**సింహం**

నూతన వ్యక్తులను నమ్మి మోసపోకూడదు. సంఘంలో అప్రతిష్ట రాకుండా జాగ్రత్త పడటం మంచిది. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఎదురవడంతో ఇబ్బంది పడుతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. రుణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. సోదర వైరం కలిగే అవకాశం ఉంటుంది.

**కన్య**

మనస్సు చంచలంగా ఉంటుంది. బంధు, మిత్రులతో విరోధం ఏర్పడకుండా జాగ్రత్త పడటం మంచిది. అకాల భోజనం వల్ల అనారోగ్య బాధలను అనుభవిస్తారు.

ఆకస్మిక కలహాలకు అవకాశం ఉంటుంది. చెడు సహవాసానికి దూరంగా ఉండటానికి ప్రయత్నించాలి.

**తుల**

నూతనకార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. ప్రయత్నం మేరకు స్వల్ప లాభం ఉంటుంది. వృథా ప్రయాణాలు ఎక్కువగా చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలు ఉంటాయి. రుణప్రయత్నాలు చేయవలసి వస్తుంది.

**వృశ్చికం**

విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా ఉంటుంది. ప్రయాణాలు ఎక్కువగా చేస్తారు. మెలకువగా ఉండటం అవసరం. స్థానచలనం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. రుణలాభం పొందుతారు. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలుంటాయి.

**ధనుస్సు**

కుటుంబ కలహాలు దూరమవుతాయి. చెడు పనులకు దూరంగా ఉండటం మంచిది. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఎదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. అందరితో స్నేహంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి.

**మకరం**

సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. తలచిన కార్యాలన్నీ విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలు ఉండవు. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి. అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి.

**కుంభం**

నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు. మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్నకార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది.

**మీనం**

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతనకార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకోసం సమయం వెచ్చించాల్సి వస్తుంది.

# ఎగిరే జింక-1

మధిర సుబ్బన్న దీక్షితులు 1930వ దశకంలో రచించిన కాశీమజిలీ కథలు అప్పట్లో ఆబాలగోపాలాన్ని అలరించాయి. తెలుగు సాహిత్యంలో తప్పకుండా చదవాల్సిన గొప్ప గ్రంథాల్లో కాశీమజిలీ కథలు ముఖ్య స్థానాన్ని ఆక్రమించాయి. పన్నెండు భాగాలుగా వెలువడిన ఈ గ్రంథంలోని మూడోభాగం కథలు ప్రస్తుతం మీరు చదువుతున్నారు.



కుంభకోణం పట్టణాన్ని విజయకేతుడనే రాజు పాలిస్తున్నాడు. ఆయన ఒక్కగానొక్క కొడుకు కందర్పుడు. పేరులోనూ, రూపంలోనూ మన్మథుడే. అతనికి చిన్నతనం నుంచి దేశవిదేశాల్లోని వింతలు చూడాలని కోరిక. కానీ దేశాటనం అంటే మాటలతో పని కాదు.

'తల్లిదండ్రులతో చెబితే వెళ్లనివ్వరు. ఒకవేళ వారు ఒప్పుకొన్నా తక్కువ వ్యవధిలో దేశాలన్నీ చూసిరావడం అసాధ్యం. గట్టిగా ప్రయత్నిస్తే భరతఖండంలోని యాభై ఆరు దేశాలనూ చూడొచ్చు. మిగిలిన వాటిమాటేమిటి?! ఆకాశంలో ప్రయాణిస్తేకానీ చేరుకోలేని ద్వీపాలు, దేశాలెన్నో ఈ భూమండలంలో ఉన్నాయని చెప్పుకొంటారు. వాటిని చూడటం ఎలా?' అనే ఆలోచనలే అనుక్షణమూ కందర్పుడిని బాధించేవి. యుక్తవయసు వచ్చిన తరువాత తన మనసులోని భావాలను ఒక ఉపాధ్యాయునితో పంచుకున్నాడు. కానీ ఆయన సైతం..

"వత్సా! నీ తండ్రి వృద్ధుడు. నువ్వు ఆయనకు సహకరించాలి. రాజ్యభారాన్ని పంచుకుని ప్రజలను న్యాయంగా పాలించాలి. అంతేకానీ వెర్రి ఊహలు చేయకు" అని హితవు పలికాడు.

**కందర్పుడు ఆ మాటలకు అంగీకరించలేదు.**

"ఆచార్యా! విస్తారమైన ఈ భూమిపై మన రాజ్యం ఏపాటిది? మావంటి రాజులు ఎందరు లేరు? మీ ఇంటిలో మాత్రం ప్రజలు లేరా? వారికి మీరు మాత్రం ప్రభువులు కాదా? నా ప్రజలమీద నాకుమాత్రం అంతకంటే అధికారాలేం ఉంటాయి? వీటిపైన నాకు ఆసక్తి లేదు. మనుచరిత్రలో ప్రవరాఖ్యుని చరిత్ర చదివిన కొద్దీ నాకు దేశాటన పట్ల ఆసక్తి పెరిగిపోతున్నది. ఔషధాల వల్ల, యంత్రాలవల్ల మన పూర్వీకులు ఇతరులకు సాధ్యంకాని దూరతీరాలకు ప్రయాణించారని కావ్యాలు వర్ణిస్తున్నాయి కదా?! దయచేసి అటువంటి విశేషాలేమైనా మీకు తెలిస్తే చెప్పండి" అని పదేపదే అడిగాడు.

**అందుకు ఆ ఉపాధ్యాయుడు..**

"రాకుమారా! మన నగరంలో మణివర్మ ఉన్నాడు. వారు వంశపారంపర్యంగా యంత్రాలు చేయడంలో, తంత్రాలు పన్ని రూపాలు మార్చడంలో ఆరితేరినవారు. మణివర్మ ముత్తాతకైతే సాక్షాత్తూ విశ్వకర్మ అని పేరుండేది. ఆయన స్వయంగా ఒక కీలుజింకను తయారుచేసుకుని, దానిమీద దేశాలన్నీ తిరిగేవాడట. నా అంచనా నిజమైతే ఆ జింక ఇప్పటికీ మణివర్మ ఇంట్లోనే ఉండి ఉంటుంది" అని చెప్పాడు.

"అయితే పదండి. మణివర్మ ఇంటికి వెళ్దాం" ఆసక్తిగా అడిగాడు కందర్పుడు.

**ఉపాధ్యాయుడు పెదవి విరిచి..**

"మణివర్మ మహామూరుడు. అనుమతిలేనిదే చీమనైనా తన ఇంట్లోకి రానీయడు. తాను ఇల్లు వదిలి బయటికి రాడు. అటువంటివాడి వద్ద నేర్పుగా పని సాధించుకోవాలి" అని చెప్పాడు.

ఆ నిమిషం నుంచి కందర్పుడు అదే పనిలో ఉన్నాడు. ఒకనాడు సామాన్య పౌరునిలా వేషం వేసుకుని బయల్దేరాడు. కంచుకోటలా ఎత్తయిన ప్రహరీ, పటిష్టమైన సింహద్వారం కలిగిన మణివర్మ ఇంటికి కొద్దిదూరంలో నిలబడి వచ్చేపోయేవారిని గమనించసాగాడు. కొంతసేపటికి మణివర్మ ఇంట్లోంచి ఒక వృద్ధుడు బయటికి వచ్చాడు. కందర్పుడు అతనితో మెల్లిగా మాట కలిపాడు. మణివర్మ ఇంటి సంగతులు కొన్ని రాబట్టాడు.

"మణివర్మ కోపదారి మనిషి. భార్యను చీటికిమాటికి కొడుతుంటాడు. మనుమరాలైన సుభద్రను మాత్రమే ప్రేమగా చూస్తాడు. ఎప్పుడూ తన గదిలో ఒంటరిగా ఉండి, శక్తిపూజ చేసుకుంటూ ఉంటాడు. సుభద్ర చక్కటి పూలతోట ఒకటి పెంచుకుంటున్నది. నేను తోటమాలిగా పనిచేస్తున్నాను" అని వృద్ధుడు చెప్పుకొచ్చాడు.

ఆ విషయాలన్నీ పదేపదే తర్కించుకున్న తరువాత, "తాతా! నువ్వు నాకో సాయం చేసిపెట్టాలి. ఆరోగ్యం సరిగాలేదని వంకపెట్టి, నీకు సహాయకునిగా నీతోపాటు నన్ను కూడా పనికి తీసుకెళ్లు" అని కందర్పుడు బతిమాలాడు.

"ఈ సంగతి మణివర్మకు తెలిస్తే తోలు ఒలిచేస్తాడు. ఆయన అనుమతి లేకుండా పురుగైనా ఆ ఇంట్లో కాలుపెట్టలేదు" అని భయపెట్టాడు వృద్ధుడు. అతని చేతిలో వరహాలమూట పెట్టాడు కందర్పుడు. వృద్ధుడి కళ్లు మెరిశాయి. మరునాడు ఇద్దరూ కలిసి మణివర్మ ఇంటికి వెళ్లారు. సుభద్ర తలుపు తీసింది. ముసలాయనతోపాటు కందర్పుడు కూడా లోపలికి ప్రవేశించడం ఆమె గమనించలేదు. కానీ, కందర్పుడు తేరిపార చూశాడు. ఆమె ముఖ కవళికలను

**మనసులో ముద్రించుకున్నాడు.**

వృద్ధుడు మొక్కలకు నీళ్లు తోడుతుంటే.. కందర్పుడు ఓ చెట్టుకింద మట్టిలో పుల్లతో గీస్తూ ఆడసాగాడు. కొంతసేపటికి సుభద్ర వచ్చింది.

"ఏమయ్యా! ఆ ముసలాయన అంతలా కష్టపడుతుంటే నువ్వు మాత్రం సోమరిపోతులా కూర్చున్నావేం?! కూలి తీసుకోవడం లేదా?" అని నిలదీసింది.

"ఏం చేయను మరి.. నాకీ మోటుపని అలవాటు లేదు. తోడుగా ఉండమని తాత పిలిస్తే వచ్చాను. నాకు తెలిసిన పని ఇదొక్కటే" అని కందర్పుడు ఆమె చేతికి ఒక చిత్రపటాన్ని చూపించాడు. అందులో ఒక సుందరమైన ఉద్యానంలో ఆలుమగలు విహరిస్తున్నట్లు గీశాడు.

"ఈ అమ్మాయి బొమ్మ నా పోలికలో గీశావేం?!" అడిగింది సుభద్ర. కందర్పుడు నవ్వి ఊరుకున్నాడు.

"అబ్బాయి బొమ్మ నీ పోలికలో ఉన్నట్లుందేం?!" అని కోపం ప్రదర్శించింది. "అవునా! నాకు తెలియదే.." అమాయకత్వాన్ని నటించాడు కందర్పుడు. ఆమె కోపమూ, అతని అమాయకత్వమూ రెండూ నిజమైనవి కావు. ఆ తరువాత వాళ్లిద్దరి మధ్య చాలా సుదీర్ఘమైన సంభాషణ నడిచింది. కానీ ఆ మాటలేవీ అక్షరాల్లో ఒదగవు. అదంతా ఒట్టి కళ్ల భాష మాత్రమే.

**ఆ భాషకు ముగింపుగా సుభద్ర..**

"నాకు చిత్రలేఖనం నేర్చుకోవాలని చాలాకాలం నుంచి ఆశ. నేర్పించగలవా?" అని అడిగింది.

అందుకు కందర్పుడు ఒప్పుకొని.. అప్పటికప్పుడే ఆమెకు బోధన ప్రారంభించాడు. బొమ్మగీస్తున్న సమయంలో అతని వేళ్లకేసి ఆదమరుపుగా చూసే సరికి రత్నపుటుంగరం తళుక్కున మెరిసింది.

"ఎవరు నువ్వు? ఇంత డబ్బున్న వాడివి కూలిపనికి ఎందుకు వచ్చావు?!" అని నిలదీసింది. "చల్లకు వచ్చి ముంతదాచిపెట్టడం ఎందుకు?! నేను యువరాజు కందర్పుడను" అని చెప్పాడు.

**ఆ మాటలతో నిలువెల్లా కంపించిపోయింది సుభద్ర.**

"యువరాజులవారా? మా ఇంటికి వేంచేశారా?! ఇంతసేపూ నేను మిమ్మల్ని మామూలు కూలివాడిలా పరిగణించానా?!" అని అస్థిమితంగా అటూ ఇటూ తిరుగుతూ తన మనసులోని కలవరపాటును ప్రదర్శించింది. ఉన్నట్లుండి అతని పాదాలకు నమస్కరించింది.

**ఆమెను లేవనెత్తి..**

"అమ్మాణీ! మరేమీ పరవాలేదు. నేను నీ సహాయం కోరి వచ్చాను. మీ తాత సాక్షాత్తూ విశ్వకర్మ అవతారమేనని చెప్పుకొంటారు. మీ ఇంటిలో ఎన్నెన్నో వింత వస్తువులు ఉన్నాయని విన్నాను. వాటిని చూడాలని నా కోరిక. చూపగలవా?!" అడిగాడు కందర్పుడు.

**గుండెల మీద చేయి వేసుకుని..**

"మా తాతకు తెలిస్తే నా తల తీస్తాడు" అని చెప్పింది.

"మనసుంటే మార్గముండదా?! ఇంత దయగల దానివి ఈమాత్రం సాయం చేయలేవా" అంటూ కన్ను గిలిపాడు కందర్పుడు.

**దాంతో మరింత తబ్బిబ్బుపడింది సుభద్ర.**

"ఒక పనిచేయండి. రాత్రి పొద్దుపోయేదాకా ఓపిక పట్టండి. ఆ తరువాత మనం తాత గదిలోకి వెళ్లవచ్చు" అని చెప్పి, కందర్పుణ్ని తన గదిలోకి తీసుకుపోయింది.

అన్ని పనులూ పూర్తిచేసి, తాళపుచెవులు దొంగతనంగా తీసుకువచ్చింది. కందర్పుని తీసుకుని, వింత వస్తువులున్న గదిలో ప్రవేశించింది.

"నేను, మా తాత కాకుండా ఈ గదిలోకి వచ్చిన మూడోవ్యక్తి మీరే" అన్నది సుభద్ర.

"నిజమా!" అంటూ ఆమె భుజాలమీద చేయివేసి, అక్కడున్న విశేషాలన్నీ ఒక్కటొక్కటిగా చూడసాగాడు కందర్పుడు. చివరగా అతడు అన్వేషిస్తున్న తోలుజింక కనిపించింది. దీపపు వెలుగులో పరిశీలించి చూడగా దానిపై ఒక శాసనం ఉంది. అందులో..

'ఈ తోలుజింక కుడిచెవిలోఉన్న బిరడా తీసి, నోటితో గాలి పూరించాలి. అప్పుడిది గుర్రంలా లేచి నిలబడుతుంది. మళ్లీ బిరడా బిగించి, దీనిని అధిరోహించాలి. కుడి, ఎడమలకు ప్రయాణించడానికి దీని చెవులే మీటలుగా పనిచేస్తాయి. నెత్తిమీద ఉన్న సీలను కుడికి, ఎడమకు తిప్పడం ద్వారా పైకి, కిందికి కూడా ప్రయాణించవచ్చు..' అని రాసి ఉంది.

జింకను తిరిగి అక్కడే పెట్టేసి, సుభద్రవైపు తిరిగాడు కందర్పుడు. ఆమె చిబుకాన్ని కుడిచేతి చూపుడువేలితో ఎత్తిపట్టుకుని, చూపులో చూపు నిలిపి..

"నీకు నామీద ఎంత అనురాగం లేకపోతే.. ఇంత విలువైన వస్తువులను నాకు చూపిస్తావు?! దీనికి ప్రతిఫలంగా నీకేం ఇవ్వగలను?! నా ప్రియపత్నిగా చేసుకుంటానని బాస చేస్తున్నాను. నన్ను అంగీకరిస్తావు కదూ!" అన్నాడు.

ఆమె సిగ్గుపడి కన్నులు వాల్చింది. అతడామె అధరాన్ని చుంబించాడు. మరో అడుగు ముందుకు పడకముందే ఇద్దరూ విడివడ్డారు.

"సుభద్రా! మా తల్లిదండ్రులను ఒప్పించి కానీ, నిన్ను చేపట్టలేను. ప్రస్తుతానికి మన ప్రేమచిహ్నంగా ఈ తోలుజింకను నాతో తీసుకుపోతున్నాను. మీ తాతకు అనుమానం రాకుండా ఉండేందుకు అచ్చంగా దీనిలాగే ఉండే మరోజింక తయారుచేయించి పంపిస్తాను" అని చెప్పాడు కందర్పుడు.

ఏదో మత్తు జల్లిన దానిలా ఏమీ మాట్లాడలేక పోయింది సుభద్ర. ఆమె చూస్తుండగానే జింకను పూరించి, గాలిలోకి ఎగిరి చీకట్లో కలిసిపోయాడు. ఎవరికీ తెలియకుండా, ఒక శిల్పిచేత ఆ జింకకు నకలు తయారుచేయించి, సుభద్రకు అందేలా చేశాడు. అనంతరం తన ఉపాధ్యాయునికి ఆ జింకను చూపించి..

"ఆర్యా! మీ అనుగ్రహం వల్ల నేను తలపెట్టిన కార్యం సఫలమైంది. హిమాలయాలకు ఆవల ఉన్న దేశాలను చూసి రావాలని అనుకుంటున్నాను. ఒక్కమాసంలోగా తిరిగివస్తాను. నేను వెళ్లిన తరువాత మా తల్లి దండ్రులు బెంగపెట్టుకోకుండా మీరే చూసుకోవాలి" అని కోరాడు.

మరునాడే చీకటిపొద్దున కొన్ని ఆహార పదార్థాలను మూటగట్టుకుని తోలుజింకను పూరించాడు.

దానిని అధిరోహించి.. 'జయ పరమేశ్వరా!' అంటూ మర తిప్పాడు. వెంటనే జింక ఆకాశంలోకి ఎగిరింది. కందర్పుడు ఉత్తరాభిముఖంగా ప్రయాణించసాగాడు. గరుత్మంతుని కంటే వేగంగా జింక ఎగురుతున్నది. చిన్న కుదుపుకానీ, ప్రయాణపు బడలిక గానీ లేవు. మధ్యాహ్నా వేళకు హిమాలయాలకు చేరి, అక్కడ కొంతసేపు విశ్రమించాడు. మళ్లీ జింకనెక్కి మరింత ఉత్తరానికి పోయాడు. హిమాలయాలకు ఆవలివైపు అనేక పర్వతాలు, అడవులు దాటాడు.

మరొక్క జాములో సాయంత్రం కానుందనగా, అశేష జనవాహినితో నిండిన మహాపట్టణాన్ని గగనతలం నుంచి చూశాడు. ఊరి బయటనే కిందికి దిగి, తోలుజింక ఎడమచెవి బిరడా తీయగానే.. గాలిపోయి, కుంచించుకు పోయింది. దానిని చుట్టచుట్టి చంకలో పెట్టుకుని పట్టణంలో ప్రవేశించాడు. పది అడుగులు నడిచాడో లేదో రక్షకభటులు అడ్డం వచ్చారు.

"ఎవరు నువ్వు? ఏ దేశం వాడివి? సుంకం చెల్లించకుండా పట్టణంలోకి రావడానికి వీల్లేదు" అన్నారు.

కందర్పునికి వాళ్ల భాష అర్థం కాలేదు. అతడేదో చెప్పబోయాడు. అంతలోనే.. "వీడు తోలు కూడా తీసుకు వస్తున్నాడు. దీనికి వేరుగా సుంకం కట్టాలి. పదవయ్యా! కొత్వాల్ వద్దకు" అంటూ తోలుజింకను లాక్కుని, మెడమీద చెయ్యివేసి ముందుకు తోశారు.

## ఇకమతులోడి దగ్గర పైసలు కొట్టేయబోయి ఊపు సాపు చేసుకున్న దొంగోడు



ఒక ఊర్లె ఒక ఇకమతులోడు ఉంటుండె. బమ్మిని తిమ్మిజేసుట్ల.. తిమ్మిని బమ్మిజేసుట్ల ఆనసోంటోడు ఆ సుట్టుపక్కల నూరు మైళ్ల దాంక బాణమేశినా కనిపియ్యడు. ఆల్లింట్ల దేవుని పండుగుందని అత్తగారిని, సుట్టాలను అందరిని విలిశి.. పండుక్కు మ్యాకపిల్లను కొనుక్కద్దమని పక్కూరు సంతకు వోయిండు. ఆడ ఏమి దెల్వనోని లెక్క ఎడ్డెడ్డిగ మాట్లాడుకుంట.. మంచి మ్యాకపిల్లను అగ్వసగ్వకు గొన్నడు. ఈని ఎడ్డీర్కం జూసి.. పాపమని తక్వ ధరకే మ్యాకపిల్లను అమ్మిండు సావుకారి. ఈడు అంగట్లకు అచ్చినప్పటి సంది.. మర్లివోయెదాంక, ఈని కావలే గాశిండు ఓ దొంగోడు. అగ్వల మ్యాకపిల్ల దొర్కిందన్న మురిపెంల ఆడీడ దిరిగి ఆల్శం జేసిండు. ఇంటికి మర్లెవారకు పొద్దుగూక వట్టింది. అడివిలకెల్లి వోవాలె! దొంగలుగిట్ల ఉంటరని జెల్దిజెల్దిన నడువ వట్టిండు. నట్టనడిమిట్లకు వోంగనే, ఈని కోసమే సూత్తున్న దొంగోడు శెట్టు సాటుకెల్లి అచ్చి ఎదురంగ నిలుసున్నడు. నడుముకు బెల్టు, డబ్బాల్‌డబ్బాల లుంగీ, శేతుల గుత్పకట్టె.. అన్ని సూడంగనే ఇకమతులోనికి ఇషయం అర్థమయ్యింది. ఇకమతుతోని ఎట్లనన్న తప్పిచ్చుకో వాలని.. "ఏందన్న.. ఈ అడివిల ఏం జేత్తున్నవన్న?" అంట ఎడ్డిఎడ్డిగ అడిగిండు. దానికి ఆ దొంగోడు.. "కనిపిత్తలేదారా? నేను గజదొంగ గంగులును. నక్రాల్ జెయ్యకుంట నీకాడున్న పైసలు, మ్యాకపిల్ల, మెడలున్న కంటె, పెయ్యిమీదున్న బట్టలు అన్ని దీశి ఆడవెట్టి.. ఎన్కకు మర్లకుంటవో! లేదంటె గుత్పకట్టె జూశినవ్ గదా! ఇయ్యరమయ్యర జోపుత" అనుకుంట.. సుట్ట ముట్టిచ్చుకొని నిలుసున్నడు. దొంగోడు శేరైతే మనోడు సవశేరాయె.. ఆడు జెప్పినట్టే మ్యాకపిల్లను దించి శెట్టుకు గట్టేశిండు. కీసలకెల్లి ఆయిన్ని పైసలు దీశి కింద వోశిండు. పెయ్యిమీదున్న కంటె.. ఎండి కడెం దీశి ఆని కాళ్లకాడ వెట్టిండు. "అన్నా! సలి వెడ్తాంది.. ఇంట్ల అత్తగారోల్లున్నరు. పెయ్యిమీద బట్టల్లేకుంట వోతె పురాత ఇజ్జత్ వోతది. జర బట్టలుండనియ్యరాదు" అంట బతిమి లాడిండు. 'పుక్యానికె బంగారం, ఎండి, మ్యాక అచ్చినయి.. పాత బట్టలుంటేంది? లేకుంటేంది?' అనుకొని.. "గట్లనే తియ్యి" అని.. అన్ని సదురుకొని ముల్లె గట్టుకోవట్టిండు. అంతట్లకే మన ఇకమతులోడు.. "అన్నా! నువ్వు సూత్తె మంచోని లెక్క గొడుతున్నవ్. సంతకచ్చి ఏం దీస్కపోకుంటె ఎడ్డోడనుకుంటరు. నీ గుత్పకట్టె కొత్తగనె ఉంది గద. నాకియ్యరాదే" అంట ఎడ్డెడ్డిగ అడిగిండు. ఎడ్డోనితోని ఏమైతదని.. "ఇగవటు" అని గుత్పను ఇసిరేశిండు. కట్టె అందుకోంగనే.. మర్లేశి దొంగోన్ని ఇయ్యరమయ్యర జోపుడు వెట్టిండు. "అయ్యా.. అవ్వా.. సత్తిన్రో!" అనుకుంట.. అన్ని ఆన్నే వారేశి, చెంగోబిల్ల అనుకుంట ఉరికిండు తెలివితక్వ దొంగోడు. ఈని ముల్లెనే గాక దొంగోని ముల్లెగూడ సదుర్కోని ఇకమతులోడు అత్తగారోళ్ల ముంగట రుబాబుతోని ఇంటికి జేరిండు.



## ప్రతీ పూట.. అదే పాట!

ఎ అన్ని రుతువుల్లోనూ చలికాలమంటే ఇష్టం. వణికించే వాతావరణంలోనూ అలవాటు ప్రకారం ఉదయం ఆరు గంటలకే నిద్రలేచే వాళ్లం. పుష్య మాసపు చలిగాలి ఒంటికి తాకి, చెవులకు సోకి వెళ్తుంటే.. ఒక్కోసారి హాయిగా అనిపించినా, ఎక్కువసార్లు భయపెట్టేది. మార్గశిరంలో అమ్మ ధనుర్మాస వ్రతాన్ని పాటించేది. తెల్లవారుజామున మూడున్నరకే నిద్రలేచి వెళ్తూ, తను కప్పుకొన్న దుప్పటి తీసి నాకూ, ఇంకొకటి అక్కకూ కప్పేది. పరిచితమైన అమ్మ స్పర్శతో, మరింత వెచ్చగా, హాయిగా.. అమ్మకు దగ్గరగా జరిగి, తన పొట్టలో ముడుచుకుని పడుకున్న అనుభూతి కలిగేది. పదేళ్ల వయసులోనూ మాకు స్వెటర్స్ ఉన్న జ్ఞాపకం లేదు. తల పైనుంచి చెవుల మీదుగా నడుము కిందిదాకా వేలాడేట్టు మెడ దగ్గర ముడివేసి హరికంఠం కట్టేవారు. తెల్లవారుజామునే అన్ని పనులు పూర్తిచేసినా కూడా.. అమ్మలో అలసట కనిపించేది కాదు. నేను, అక్క బడికి వెళ్లేటప్పుడు ఆ నెల రోజులూ బియ్యం, పెసరపప్పు, బెల్లం, మిరియాలు, జీలకర్ర వేసి వండిన పొంగలి తినేవాళ్లం. లేవగానే పెరడంతా తిరుగుతూ.. 'హ! హ!' అనుకుంటూ నోళ్లు తెరిచి, చలికి నోట్లోంచి తెల్లని పొగలు వస్తుంటే ఆనందించేవాళ్లం. అంత చలిలోనూ మా బావినీళ్లు గోరువెచ్చగా ఉండటం ఆశ్చర్యం కలిగించేది. మండువేసవిలో మిట్ట మధ్యాహ్నం పూట బావిలో నీళ్లు చేదితే.. కొత్త కుండలో నీళ్లలా ఎంతో చల్లగా ఉండటం కూడా అబ్బురపరిచేది. చలికాలం సాయంత్రాలు ఇప్పటికీ నానమ్మ బాగా గుర్తుకొస్తుంది. కొంచెం చీకటి పడగానే ఆమె దక్షిణపు మనసాలలో ఉన్న కుంపటి రాజేసేది. అన్నట్టు, ఈ కుంపటి గురించి కొంత చెప్పాలి. అది బొగ్గుల కుంపటి కాదు. మట్టితోచేసిన పూలకుండీ లాంటిది. దానిలో పిడకలు ఉండేవి. ఇంట్లో ఎప్పటికీ నిప్పు ఆరకుండా ఉండటానికి అన్నమాట. రాత్రి నన్నూ, అక్కనూ ఆ కుంపటి ముందు కూర్చోబెట్టుకునేది నానమ్మ. తన చేతులను కుంపటికి కొంచెం పైన పెట్టి ఆ వెచ్చని చేతులతో మా చెంపలను కాపేది. నానమ్మ గొంతు శ్రావ్యంగా ఉండేది. పాటలు పాడుతూ రోజూ ఒకే కథ చెప్పేది. అయినా వినేవాళ్లం. ఓ దేశాన్నేలే రాజుకు ఏడుగురు కూతుర్లు. ఓ రోజు రాణిగారి పూజ కోసం ఏడుగురూ పొన్న పూలు కోసుకుని రావడానికి వెళ్తారు. మిగిలినవాళ్లంతా కలిసి అందరిలోకి ఆఖరి పిల్లను కావాలనే చెట్టు మీద వదిలేస్తారు. అంతలో పులి వచ్చి ఆ పిల్లకేసి గాండ్రించి చూస్తూ ఉంటుంది. పిల్ల ఏడుస్తూ.. 'దింపనైనా దింపు.. మింగనైనా మింగు' అంటుంది. ఆ పులికి రెండోదే నచ్చి అదే చేస్తుంది. ఆ మింగడంలో పిల్ల చిటికెన వేలు కిందపడిపోయి, కొన్నాళ్లకు ఓ జంగమయ్యకు దొరుకుతుంది. దాన్ని శొంఠి కొమ్ము అనుకుని ఇంటికి తీసుకెళ్లి భార్యకు ఇస్తే.. ఆమె దాన్ని సర్కటాల కుండలో వేసి మూతపెడుతుంది. ఓ రోజు తలనొప్పికి శొంఠి కొమ్ము అరగదీసి రాయమంటూ భార్యను అడగగా.. ఆమె వెళ్లి చూస్తే, అందులో ఒక అందమైన అమ్మాయి కనిపిస్తుంది. వాళ్లు ఆ పిల్లను పెంచుకుంటారు. జంగమయ్య తన వీపుపై ఆ పిల్లను కట్టుకుని, జోలెలో అడుక్కు తింటూంటే.. ఆ పిల్లే పాటలు పాడుతుంది. రెడీమేడ్ సింగర్ దొరికిందని అతను సంతోషంగా మరింతగా అడుక్కు తింటాడు. ఓ రోజు రాజమందిరం ముందు నుంచి వెళ్తూ ఉండగా.. ఆ పిల్ల గుర్తుపట్టి, సిన్మా క్లయిమాక్స్ సీన్లో హీరోయిన్‌లా పెద్ద గొంతుతో 'రావా! మొరవినవా!' అంటూ దేవుణ్ని నిలదీస్తూ పాడేసరికి, రాణీగారు గుర్తుపట్టి కోట గుమ్మం దాకా పరుగెత్తి, తన కూతుర్ని తాను తెచ్చుకుంటుంది.